శ్రీ శారదా దేవ్యై నమః                    శ్రీ ఆంజనేయస్వామినే నమః

# రామభక్తి సామ్రాజ్యము

## త్యాగరాజ కీర్తనకు విశేష వివరణ



వ్యాఖ్యాత :


## ఇంద్రకంటి వేంకట లక్ష్మణశాస్త్రి

కులపతి, సంగీత జనకులం.

49-17-18 (3), లలితానగరం,

విశాఖపట్టణం 16.

శ్రీ శారదా దేవ్యై నమః    శ్రీ ఆంజనేయస్వామినే నమః

# రామభక్తి సామ్రాజ్యం

(త్యాగరాజ కీర్తనకు విశేష వివరణ).

వ్యాఖ్యాత :

ఇంద్రకంటి వేంకట లక్ష్మణశాస్త్రి

కులపతి, సంగీత జనకులం.

49-17-18 (3), లలితానగరం,

విశాఖపట్టణం - 16.

ప్రతులు
1000
1993

లలితా ఆర్టు ప్రెస్
విశాఖపట్నం- 1

దొరకుచోటు

ఇంద్రకంటి వేంకట లక్ష్మణశాస్త్రి.
కులపతి, సంగీత జనకులం,
49-17-18(3). లలితా నగరం
విశాఖపట్టణం-16

శ్రీ తిరుపతి దేవస్థానమువారిచే ప్రారంభించబడిన
ధార్మిక గ్రంథ ప్రచురణ సహాయ ప్రణాళిక క్రింద
ఇయ్యబడిన విరాళముతో
ముద్రింపబడినది.



శ్రీ ఇంద్రగంటి వెంకట లక్ష్మణశాస్త్రి

# పీఠిక.

శ్లో॥ శ్రీ కృష్ణమాచార్య మనంత పుత్రం
సత్సాధుమిత్రం కరుణార్ద్ర నేత్రం
గురుం గురూణాం పితరం పితౄణాం
అనన్య శేష శ్శరణం ప్రపద్యే॥

శ్రీ గురుభ్యో నమః

భగవంతుడు నాద స్వరూపుడు. ఓంకారము నాద బ్రహ్మము. గానము నాదాశ్రయము. మానవులకు, తిర్యగ్జంతువులకు ఆనందదాయకమైనది సంగీతము.

"శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణీ". బుద్ధి ఉన్ననూ పరిపక్వత లేని స్థితి శిశువునకు కలదు. హృదయము శిశువునకు గాని, పశువునకు గాని, ఫణికిగాని కలుగుటచే అది సంగీతమునకు అర్ద్రమగును కావుననే గానరసము జడములను సైతము ద్రవీకరింపగలదు.

సంగీతము ధాతు, మాతు, మనోధర్మ సంకలనము. మన దేశమున ప్రధానముగా రెండు సంగీత సంప్రదాయములు గలవు. ఒకటి కర్ణాటక సంగీతము, రెండవది హిందూస్తానీ సంగీతము. ఉత్తర భారతమందు ప్రచారము కలది హిందూస్తానీ సంగీతము. దక్షిణదేశము కర్ణాటక సంగీతమునకు పుట్టినిల్లు. తమిళ, కన్నడ, తెలుగు, మళయాళ ప్రాంతీయులు పాడుకొనునది కర్ణాటక సంగీతము. శాస్త్రీయ సంగీతము కఠిన తపశ్చర్యవంటి ఏకాగ్రత, పరిశ్రమలవలనమాత్రమే సాధ్యము.

ఇచ్చట మరొక్క విషయము చెప్పవలసియున్నది. కర్ణాటక సంగీత పారగులందరూ భగవదనుగ్రహము కలిగినవారే. వారి సంకల్పములు, చర్యలయందు దివ్యానుభవములు గోచరించునవి. దీనిని బట్టి "సంగీత జ్ఞానము భక్తివినా సన్మార్గము కలదే" అని త్యాగరాజస్వామి చెప్పిన మాట సార్ధకము. భగవదారాధనా విధానములలో భక్తితత్పరత గల శాస్త్రీయ సంగీత గానము భగవంతునకు దగ్గిర దారి.

ఇట్టి కర్ణాటక సంగీత పరిణత స్థితికి మూలపురుషులైన మహానుభావుల సంస్మరణము సంగీత పిపాసువులకు మార్గ దర్శకము. కావున ఈ చిన్ని గ్రంథమున కర్ణాటక సంగీత స్రష్టలను, సంగీతమార్గమున జీవన్ముక్తులైనవారి చరిత్రలను, స్థూలముగా చెప్ప సంకల్పించి ఇట్టి కర్ణాటక సంగీత ప్రచారము యథాశక్తిగా చేయుదమనుకొనుచున్న నా అభిప్రాయమును సంకల్పముగా మార్చి "సంగీత జనకుల" స్థాపనకు దోహదకారి అయిన జగద్గురు పీఠం వ్యవస్థాపకులు శ్రీ ఎక్కిరాల కృష్ణమాచార్యుల (మాస్టర్ ఇ. కె.) వారి ఆశీర్వచనములను దోసిలి ఘటించి తలవంచి స్వీకరించుచున్నాను.

విశాఖపట్టణమున 14-12-1979 వ తేదీన నేను ఆరంభించిన సంగీత జనకుల సంస్థకు స్థూలముగా కొన్ని ఆశయములు కలవు

1. శాస్త్రీయ సంగీతమందు 'డిప్లమా' సిలబస్ ప్రకారము సంగీత విద్య "ఉచితముగా" గరపుట.

2. భక్తి సంగీతములైన త్యాగరాజ దివ్యనామ కీర్తనలు,

రామదాసు కీర్తనలు, కబీర్‌దాసు భజనలు, మీరా భజనలు మొదలగునవి విరివిగా నేర్పుట.

3. ప్రతీ మాసమందు ఒక దేవాలయమందు దివ్యనామ సంకీర్తన బృందగానము గావించుట.

4. అనుకూలించినప్పుడు దూరాభారమందున్న పుణ్య క్షేత్రములను విద్యార్థులతో సందర్శించుట.

5. వీలైనంతమంది రసజ్ఞులైన శ్రోతలను తయారుచేసి శాస్త్రీయ సంగీతమును ఆస్వాదించగల శక్తిని వారికి గలుగ చేయుట.

6. ప్రతి మాసమందు ఒక నిర్దిష్ట దినమున శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించి అందరికీ ప్రవేశము ఉచితముగా కల్పించుట.

7. అటులనే ప్రతీనెలా మరియొక దినమున వాగ్గేయకారుల రచనలపై సోదాహరణ ప్రసంగములు ఏర్పాటుచేసి అందలి మూలతత్త్వమయిన భక్తి భావమును వివరించుట.

కొలది కాలముమండి జగద్గురుపీఠం డైరెక్టర్ చి॥ చింతలపాటి సత్తిబాబు ఒక సంగీత గ్రంథమును వ్రాయువలసినదిగా నన్ను పదే పదే ప్రోత్సహించుచూ వచ్చెను. అది గురుదేవులైన మాస్టర్ ఇ. కె. ఆశీః ప్రభావమై యుండవచ్చు. త్యాగరాజ స్వామివారి "రామభక్తి సామ్రాజ్యము" అను కీర్తన నా మనస్సునందు తళుక్కుమని మెరసి దాని వివరణము వ్రాయ

సంకల్పము కల్గినది. "ఈలాగని వివరింపలేను చాల స్వానుభవ వేద్యమే" అని త్యాగరాజస్వామివారే చెప్పిరి. "భాగవతము తెలిసి పల్కుట కష్టంబు శూలికైన తమ్మి చూలికైన" అన్నారు పోతన. ఈ కీర్తనను వివరణము చేయుటయును అట్టిదియే. అయిననూ రచనా చాపల్యమున యీ వివరణమునకు యథా శక్తిగ ఉద్యమించితిని. విజ్ఞులు గ్రహింతురు గాక! మన్నింతురు గాక! వర్తమాన కాలము చాల ప్రమాదకర స్థితుల నెదుర్కొనుచున్నది. మనుష్యుని మానవత్వము నుండి అధోగతులకు పడద్రోయు చున్నది. వృత్తి రంగమున ఇదియే మానవునకు తటస్థమగు చున్నది. దీనిని నిరోధించు ప్రయత్నము ఆరంభించుట అవసరము. ఫలితమెట్లున్ననూ ఆరంభము ముఖ్యము.

నేటి సినీమా ప్రపంచము మానవుని హృదయ పవిత్రతను కల్మషము చేసి నీచాభిరుచులను కల్గించుచున్నది. సంస్కార హీనము, హేయము, జుగుప్సాకరమును అయిన దూష్యమయిన, పాపజుష్టమైన మనోవికారములను కల్గించుచున్నది. అటు కథా సన్నివేశములు, అందలి సంగీతము ఇట్టి అధోగతికి ఆటపట్టులైనవి. ఫలితముగా అపారమై, పవిత్రమైన, భక్తి తత్పరమైన మన కర్ణాటక సంగీత సంపద విస్మరింపబడు చున్నది. సంగీతజ్ఞుల మనస్సులకు ఈ స్థితి ప్రాణప్రాయము.

సంగీత జనకుల స్థాపనలో జన సామాన్యమును ఉత్తమ సంగీత మార్గములకు మళ్ళించు ప్రయత్నము చేయుట ప్రధాన ఆశయమై యున్నది. గీతాకారుడు "కర్మణ్యే వాధికారస్తే

మాఫలేషు కదాచన" అని కదా చెప్పినాడు. ఫలితము భగవద ధీనము. ప్రయత్నము మనది.

ఈ గ్రంథ ముద్రణకు ఆర్థిక సహాయ మందించిన శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానమువారికి, శ్రీ పార్వతీ కుమార్ గారికి, ఈ గ్రంథముపై తమ అమూల్యమయిన అభిప్రాయము వ్రాసి యిచ్చిన "సంగీత కళానిధి" శ్రీ నేదునూరి కృష్ణ మూర్తిగారికి, "కళా ప్రపూర్ణ" శ్రీ చర్ల గణపతి శాస్త్రిగారికి, జగద్గురు పీఠ అంతర్జాతీయ గౌరవాధ్యక్షులు శ్రీ కంభంపాటి పార్వతీకుమార్ గారికి, ఈ గ్రంథమును సర్వాంగ సుందరముగా ముద్రించిన లలితా ఆర్టుప్రెస్ వారికినీ నా కృతజ్ఞతలు తెలుపు కొనుచున్నాను.

తే॥ గీ॥

కృష్ణమాచార్య గురువర్యు నెద భజించి
త్యాగరాజ సదాశివ శ్యామశాస్త్రి
దీక్షితార్యాన్నమాచార్య దేశికులను
తలచి నెలకొల్పితిని జనకులము పేర
రమ్య కచ్ఛపీ నాద తరంగ మిద్ది॥

విశాఖపట్టణము.
4-3-1993 ఇంద్రకంటి వేంకట లక్ష్మణశాస్త్రి.

# ప్రశంస

Phone : 50650

'Sangeetha Kalanidhi',
Nedunuri Krishna Murty

P-5, University Qrs.
Sivajipalem,
Visakhapatnam-530 017

రామభక్తి సామ్రాజ్యమేమానవుల కబ్బెనో ఆ మానవుల సందర్శనం అత్యంత బ్రహ్మానందమే - మనసా - ఈలాగని వివరింపలేను - చాల స్వానుభవవేద్యము - అన్నారు త్యాగరాజ స్వామివారు - అంతటి మహానుభావులే ఆ అనుభవము ఈలాగని వివరింప లేనన్నపుడు మానవమాత్రులం, మన తరమా చెప్పండి.

శ్రీ ఇంద్రగంటి వేంకట లక్ష్మణశాస్త్రిగారిని ఆంధ్ర దేశ సంగీత లోకంలో ఎరగని వారుండరనడం అతిశయోక్తి కాదు. సంగీత జనకులము స్థాపించి పదిమందికీ సంగీత విద్యాబోధన చేస్తున్న కులపతి శ్రీ శాస్త్రిగారు.

దినకర కుల భూషణుని దీనుడై భజన చేయు భక్తాగ్ర గణ్యులు శాస్త్రిగారు. వారి భక్తి సంకీర్తనా గానానుభవం అనిర్వచనీయము, మహా మహీయం.

సంగీత విద్యయందు ప్రావీణ్యము గల సత్సంతానము వారికి దైవం ప్రసాదించిన దివ్య ధనము - తనకబ్బిన సంగీత సంపదను తనవారికే పరిమితం చేయక సంగీత పిపాసులు యావన్మందికీ పంచిపెడుతున్న శాస్త్రిగారు ధన్యజీవులు.

శక్తివంచన లేకుండా సంగీత విద్యాదానం చేయడంతో తృప్తిపడని శ్రీ శాస్త్రిగారు ఈ రామభక్తి సామ్రాజ్యం రచన ద్వారా తన ఆనందానుభూతిని కూడా రసజ్ఞులకు పంచిపెట్టాలని సంకల్పించడం ఆయన సహృదయతకు తార్కాణం. త్వరలో అచ్చుకానున్న యీ వ్రాత ప్రతిని చదివి నా అభిప్రాయం కావాలని కోరడం మిక్కిలి సంతోషంగా భావించి నాకు తోచిన నాలుగు మాటలు వ్రాస్తున్నాను —

మహాభక్తుల జీవిత చరిత్రలు, మహా వాగ్గేయకారుల సందేశాలు మానవాళి సాధింపవలసిన మోక్షప్రాప్తికి భక్తి జ్ఞాన వైరాగ్య సోపానాలు - భక్తి మార్గావలంబులై తాము తరించి యితరులను తరింపజేయగల తరుణోపాయములను సూచన చేసిన మహాభక్తులూ, వాగ్గేయకారుల జీవన విధానములను వారి సందేశములను వివరణాత్మకంగాను, విశేషాంశములతోను విశిష్టమగు విమర్శనా దృష్టితోనూ విపులీకరించి యువతరాన్ని సన్మార్గ సదాచార సంపన్నులుగా తీర్చిదిద్దుటకు యిటువంటి గ్రంథములు ఎంతో తోడ్పడగలవు. ఎంతో ఓపికతో శ్రీ త్యాగరాజు - ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి మొదలగు సంగీత రత్నముల రచనలలోని భక్తి జ్ఞాన వైరాగ్యాది మోక్ష సాధన మార్గముల గురించి చెప్పుటయే గాక అందలి సంగీతపరమైన సాంకేతిక సంబంధమైన విలువలను గూడ సందర్భోచితముగ ముచ్చటించుట వల్ల యీ విద్య యందు అనురక్తులైనవారికి మంచి ఉత్తేజమునిచ్చి పరిశోధనాసక్తిని పెంపొందించ గల శక్తి యీ రచనలో నిక్షిప్తమై ఉన్నది.

శ్రీ త్యాగరాజ స్వామివారి ఘనరాగ పంచరత్న కృతుల ప్రత్యేకత ఏమిటో వివరిస్తూ చేసిన ఉదాహరణాత్మకమైన వ్యాఖ్య ఆసక్తికరము. అగు, విషయములను చదువరులకందిస్తుంది. అలాగే కర్ణాటక, హిందూస్తానీ రాగములలోని సారూప్యత, వైవిధ్యములను గురించిన గురుశిష్య సంవాదము ఇరు పక్షములకు ఉపయోగించును.

రామభక్తులగు తులసీదాసు, కబీరుదాసు, సమర్థ రామదాసు, భద్రాచల రామదాసు మొదలగువారి జీవితాల్లోని ముఖ్య ఘట్టాలను కళ్ళకు కట్టినట్టు వర్ణించి పాఠకులను కరుణరసంలో ముంచి తేల్చారు శ్రీ శాస్త్రిగారు. ఈ భక్తశిఖామణుల తోవలో శ్రీ లక్ష్మణశాస్త్రిగారి తండ్రి శ్రీ లక్ష్మీనారాయణ, తల్లి అన్నపూర్ణమ్మగార్ల పవిత్ర నామస్మరణ అనుబంధించుట వారికి మాతాపితలపై గల నిశ్చలమగు భక్తికి తార్కాణము. నిజ జీవితములో వారి యిడుముల కడతేర్చిన రామభక్తి వంశ పారంపర్యంగా శ్రీవారి తనయులకు అందునా శ్రీ I. V. L. శాస్త్రిగారికి సంక్రమించుట పురాకృత పుణ్య విశేషమే - వీరు గాత్ర సంగీతమే గాక మృదంగవాద్యము, వేణు వాదనలందు కూడ నిష్ణాతులగుటకు భగవత్కృపయే గాక స్వయంకృషి తల్లి, తండ్రి గురు దైవ సేవలు తోడ్పడిన వనుటలో సందేహము లేదు

యిలాగే సంగీత సాహిత్య రంగాల్లో మరిన్ని మంచి పనులు చేయుటకు శ్రీ శాస్త్రిగారికి ఆయురారోగ్య మహదైశ్వ ర్యములనిచ్చి భావితరములవారికి, యీనాటి యువతకు మార్గ దర్శకములగు కార్యక్రమములను రూపొందించుటకు మంచి వనరులనిచ్చి వారి జీవితాన్ని సార్థకం చేసుకొనేట్లుగా శ్రీరామ చంద్రమూర్తి అనుగ్రహించుగాక - స్వస్తి.

నేదునూరి కృష్ణమూర్తి

— (౦) —

# భాగవత మార్గము

భగవంతుడు భాగవతుల రూపమున దర్శన మిచ్చుచుండును. భాగవతులు జీవుల రూపమున నున్న దేవుని దర్శించుచుందురు. అట్టి భగవద్దర్శనము వలన వారు జీవులను ప్రేమించుట, ఆదరించుట, రక్షించుట, హితము చేయుట అప్రయత్నముగ వారినుండి జరుగుచుండును. భాగవతుల నుండి తానే వ్యక్తమగుచు భగవంతుడే సృష్టి జీవులను రక్షించుకొనుచుండును. లీలాప్రాయముగ తమ నుండి భగవంతుడు వ్యక్తమగుచు ఇతరులను రక్షించుకొనుటను భాగవతులు దర్శించుచు భగవద్వైభవమును అనుభూతి జెందుచు నుందురు.

జీవుల రూపమున నున్న దేవుని సేవించుకొనుట కారణముగ భగవంతునకు భక్తుడు మిక్కిలి ప్రియతముడు. లోకహితముగ జీవుల సేవ నొనర్పక జప, హోమ, తప, పూజాది కార్యక్రమములను మాత్రమే సలుపు భక్తుల యందు భగవంతుడు అతి ప్రసన్నుడు కాడు. మహాత్ముల జీవిత ఘట్టములు ఈ ధర్మ సూక్ష్మమునకు అద్దము పట్టినట్లుండును. భాగవతుల కథలను వివరించుట యనగ భగవంతుని యొక్క లీలలను వివరించుటయే. అట్టి కథలను వ్రాసినను, చదివినను, వినినను వ్యక్తి పునీతమగును. సత్సంకల్పములు అప్రయత్నముగ ఉద్భవించును. సత్కార్యముల యందు మనసు ఉత్సాహముతో సశరీరముగ దుముకును.

భక్తి, జ్ఞాన, వైరాగ్యములు భాగవతుల కథలను చదువు చున్నప్పుడు అప్రయత్నముగ లభ్యమగును. ప్రయత్నించి పొందు జ్ఞాన, వైరాగ్యములకన్న అప్రియత్నముగా పొందుట

యందు ఒక సులువు కలదు. అట్టి సులువు కలిగించు ప్రతి ప్రయత్నము పుణ్యమైనదే. ఐ. వి. ఎల్. శాస్త్రిగారి ద్వారా భగవత్ సంకల్పముగ మరియొకమారు భాగవతులైన వాగ్గేయ కారుల జీవిత ఘట్టములు వివరింపబూనుట చదువరులకు కలుగు ఒక అదృష్టము. తన భక్తుల చరిత్రను భగవంతుడు తానే మరల మరల వ్రాయించుకొనుచు ముచ్చట పడుచుండును. కొన్ని క్రొత్త విశేషములు వ్యక్తము చేయుచుండును. కొన్ని సాధన రహస్యములను దేశమును, కాలమును బట్టి ప్రకాశింప జేయుచుండును. త్యాగరాజు, కబీరు, తులసీదాసు, శ్యామ శాస్త్రి ప్రభృతుల జీవితములు తెలిసినవే అయినను మరల మరల ప్రస్తావించినపుడు రుచికరమైన విషయములు వ్యక్త మగుచుండును. భాగవతుల చరిత్రలు పరిపూర్ణముగ తెలి యుట యుండదు. తెలిసికొను వారి స్థితిని బట్టి యుండును. సంగీతము, భక్తిజ్ఞానము కలిగిన శాస్త్రిగారి దృక్కోణము నుండి ఎన్నియో క్రొత్త రహస్యములు ఈ గ్రంథమున ప్రకాశము చేయబడినవి. భగవత్సంకల్పముగ ఇందలి విషయములు చదువరులకు కావలసిన ప్రేరణను తప్పక కలిగించునని నా విశ్వాసము. ఇట్టి పుణ్య కార్యమును శ్రద్ధతో అలసట చెందక నిర్వర్తించిన శ్రీ శాస్త్రిగారికి నా హృదయపూర్వక ధన్య వాదములు.

కంబంపాటి పార్వతీకుమార్
జగద్గురు పీఠము

# ఆశంస

చర్ల గణపతిశాస్త్రి

పూర్వ కాలములో గురుకులములుండెడివి. అందు గురువులు విద్యను నేర్పెడివారు. విద్య అనగా "యయా తదక్షరమధిగమ్యతే సా విద్యా" దేనిచేత ఆ పరమాత్మ స్వరూపము తెలుపబడునో అది విద్య అని పై సూక్తి చెప్పుచున్నది. అట్టి పరమాత్మను తెలుపు విద్యను గ్రహించి ఆచరించుచున్న గురువులు గురుకులములలో నుండి అటువంటి విద్యను గోరువారికి చెప్పుచుండెడివారు. ఆ గురువులు అధీతి బోధాచరణ ప్రచారములు చేయుచుండువారు. అధీతి అనగా చదువుట, బోధ అనగా అర్థము తెలిసికొని గ్రహించుట, ఆచరణ అనఁగా ఆ తెలిసికొన్నదానిని ఆచరణలో పెట్టుట, ప్రచారము అనగా తాను ఆచరించినది జనులలో ప్రచారము చేయుట ఇది పూర్వ సంప్రదాయము. ఆ గురుకులములలో జ్ఞానమునకే గాని, ధనమునకు పదవికి ప్రాధాన్యము లేదు.

ఏకాదశ సహస్రాణాం యోఽన్నదానాదినా భరేత్।
స వై కులపతిర్నామ వేద వేదాంగ పారగః॥

ఏ గురువు అన్నదానము విద్యాదానము మొదలగువానిని ఏర్పరచి వానిచే పదునొకండువేల విద్యార్థులను భరించునో అటువంటి వేద వేదాంగముల పారము పొందినవాడు కులపతి అని పెద్దలు చెప్పిరి.

నేడు అట్టి గురుకులములు పేరుకైనను లేవు సరిగదా వాని సంగతినైన తెలిసికొనలేకున్నారు. విద్యను అన్నమును

విక్రయించుట పాపమని పూర్వులన్నారు. నేడు నకిలీ గురు కులములు బయలుదేరి ధనమునకే ప్రాధాన్యమునిచ్చుచున్నవి.

ఇట్టి రోజులలో శ్రీ శాస్త్రిగారు ధనమునకే మాత్రము స్థానము లేకుండ గాంధర్వ విద్యను నేర్పుట చాల సంతోష దాయకమైన విషయము. ఇప్పుడు వేదాది విద్యలు కూడ అర్థ సహితముగా నేర్చుకొనబడుటలేదు. అర్థము కావలయు నను భావము కూడ లోపించుచున్నది. అట్లే చాలమంది సంగీతజ్ఞులు కూడ కీర్తనలకు అర్థము చెప్పుటలేదు. భక్తి భావమును గలిగించుట లేదు. అట్లుగాక శ్రీ శాస్త్రిగారు సంగీత జనకులము అను పేర సంస్థను స్థాపించి అర్థము తెలుపుచు భక్తి భావములను గలిగించుచు అందరకు సంగీత విద్యా ప్రచారము చేయుచున్నారు. ఇటువంటి సంస్థలు ఇప్పుడు లేవనే చెప్ప వచ్చును.

వేదములకు సంబంధించిన మంత్రపుష్పము మొదలగు వానిని స్తోత్రములను భక్తి కీర్తనములను గూడ చెప్పుచు భక్తి జ్ఞానములను తెలుపుచుండుట గమనించదగినది. ప్రతి విద్యా ర్థికి అన్ని విషయములు తెలుపుచు పరీక్షించి ప్రత్యేక శ్రద్ధ తీసికొని నేర్పుట చాల అభినందించదగిన విషయము.

ఇప్పుడు శ్రీ లక్ష్మణశాస్త్రిగారు అటువంటి విషయములను తెలుపుటకు రామభక్తి సామ్రాజ్య మను ఈ పుస్తకమును రచించిరి. నదులన్నియు సముద్రములో చేరునట్లు విద్యలన్నియు

ఆ పరమాత్మానందములో చేరవలెను. సనక సనందనాది మునులు జ్ఞానముద్వారా తరించితే నారద తుంబుర త్యాగరాజాదులు నాదముద్వారా తరించిరి. ఉపనిషత్తులు శబ్ద జ్ఞాన బ్రహ్మమును బోధించినవి. సంగీతము నాద బ్రహ్మమును బోధించినది. ఉపాసకులు శబ్దముద్వారా గాని, నాదముద్వారా గాని పరమాత్మను ఉపాసింపవలెను. ఈ గ్రంథములో రామ భక్తి సామ్రాజ్యమును వివరించుటే కాక అనేక భక్తుల చరిత్రల లోని సంగతులు విశేషముగా కూర్చి దీనికి ఘనతను శ్రీ శాస్త్రిగారు ఆపాదించిరి.

వీరు సంగీతముతో భక్తి జ్ఞానములను జోడించి కబీరు రామదాసువంటి మహాభక్తుల జీవితాలు విద్యార్థులకు బోధించుచు ఈ సంగీత జనకులము ద్వారా సేవ చేయుటే గాకుండా వాటిని తెలుపునట్టి ఇట్టి రామ సామ్రాజ్యము వంటి ఉత్తమ పుస్తకముల ద్వారా భగవంతుని ఉపాసించుచున్నారు. ఇట్లే వీరింకను భక్తి జ్ఞానములను బోధించి సేవ చేయుటకు భగవంతుడైన శ్రీమన్నారాయణుడు సర్వవిధముల శ్రీ శాస్త్రిగారిని అనుగ్రహించుగాక అని ఆశించుచున్నాను.

— (౦) —

శ్రీ శారదాదేవ్యై నమః                శ్రీ ఆంజనేయస్వామినే నమః

# రామభక్తి సామ్రాజ్యం

## గురు ప్రసంగము

గురువు : శ్రీ త్యాగరాజ స్వామివారు ప్రసాదించిన కృతి సముదాయం ఒక పాలసముద్రం వంటిది. ఆ క్షీర సాగరాన్ని తరచిన కొద్దీ అందులో నుండి అద్భుతమైన సంగీత-సాహిత్యాది నిగూఢములు గోచరిస్తాయి. వారి కీర్తనలలోని పరమార్థం మానవాళిని దుష్కృత్యముల దరిజేరనీక ఆధ్యాత్మికానందమును ప్రసాదించుటయే. "గీతార్థము-సంగీతానందము యీ తావున చూడరా-ఓ మనసా! సీతాపతి చరణాబ్జము లిడుకొన్న వాతాత్మజునికి బాగ తెలుసురా!" అని అయ్యవారు సెలవిచ్చిరి. భక్తిజ్ఞాన వైరాగ్యములను సంగీతముతో మేళవించి పరబ్రహ్మను తనివితీర సేవించే సాధనను ఒక మహత్తర యోగంగా అనుభవించి, భక్తులకు, సంగీత పిపాసువులకూ మార్గదర్శియై, ఆవాతాత్మజుడు చిరంజీవియైనాడు. అటులనే శ్రీ త్యాగరాజ స్వామివారి భావ రసోద్దీపక కృతి సంగీతంలో వెలువరింపబడ్డ వాక్కులు శ్రోతల, గాయకుల మనోవీధుల్లో దివ్య శిల్పాల్ని సృష్టించి, నెలకొల్పి, ఆనందసిద్ధి కలిగించి, ఆధ్యాత్మిక వైభవముతో అజరామరములైనవి.

అట్టి శ్రీవారి కృతులలో మకుటాయమానమై ఘనరాగ పంచరత్న కీర్తనలుగా ప్రసిద్ధి జెందిన "జగదానందకారక", "దుడుకుగల", "సాధించెనే", "కనకన రుచిరా", "ఎందరో మహానుభావులు" అను ఐదు కృతులు తెలుగు నుడికారంలోని

సొంపులు, తీపి తమలో అంతటా నిండేటట్లు సంతరించుకొని భావార్థ సుశోభితాలైన మధు గుళికలు. ఇందలి సంగీత శైలి అపూర్వము. చరణములలోని స్వర ప్రస్తారము న భూతో, న భవిష్యతి. కర్ణాటక సంగీత ప్రపంచంలో హేమాహేమీ లందరూ ఈ ఐదు కృతుల్నీ మేనులు మరచి, మనసు లగ్నం చేసుకొని, ముక్త కంఠాలతో, భక్తిభావం వెల్లి విరిసేటట్లు గానం చేయడమే త్యాగరాజ స్వామివారి ఆరాధనగా పాటించ బడుచున్నది.

ఈ పంచరత్న కీర్తనలలో మొదటిదైన జగదానంద కారక అను కృతి సంస్కృత సమాసాలతో నిండి, పద ప్రయో గంలో వీరికున్న ప్రతిభను బహుళంగా చాటుతుంది. స్వామి వారు ఈ కృతిలో శ్రీరామచంద్రుని అష్టోత్తర శతదివ్య నామము లచ్చోకీర్తించినప్పటికీ రామానుగ్రహము కలుగకపోవుటచే వ్యధ జెంది రెండవ కీర్తనయందు "దుడుకు గల నన్నే దొరకొడుకు బ్రోచురా" అని దుఃఖించిరి. ఈ సందర్భములో వారు చేయ రాని దుష్కృత్యములెన్నో చేసినట్లు ఆపాదించుకొని తన్ను తానిందించుకొనిరి. మూడవ కీర్తనయందు ఆ దేవదేవుని లీలా వైరుధ్యమును ఈ విధముగా మనమునందు తర్కించుకొని నిందాస్తుతి జేసిరి. (రామావతారమందు) బోధించిన సన్మార్గ వచనముల (కృష్ణావతారమందు) బొంకజేసి, తాపట్టిన పట్టు - సాధించెనే ఓ మనసా! అని వ్యధ జెందిరి. ఇందు దేవకి వసు దేవుల నేగించిన విధము గోపికల మనోరథ మొసంగని వైనము మొదలుగా గల కృష్ణావతార సన్నివేశముల యందలి లీలలు రామావతారమందు బోధించిన సన్మార్గవచనములకు భిన్నముగా

నుండి వాటిని బొంకుజేసినట్లు నిందింప ఆ పరమేశ్వరుడు తనకు దర్శనమిచ్చి "సద్భక్తుల నడతలిట్లనెనే-అమరికగా నా పూజ కొనెనే-విముఖులతో జేరబోకుమనెనే-వెతకల్గిన తాళుకొమ్మనెనే" అని హితబోధ జేసినట్లు చెప్పికొనిరి. నాల్గవ కీర్తన యందు దర్శనమిచ్చిన ఆ దేవదేవుని "కనకన రుచిరా" అని కీర్తించుచూ ఆ పరమాత్ముని సుందర రూపమును బహు విధముల కొనియాడిరి. ఐదవదగు ఎందరో మహానుభావులన్న కృతియందు అనేక విధముల భగవంతుని పూజించి సాక్షాత్కరింప జేసుకొన్న మహానుభావులను స్మరించి వందనము గావించిరి. ఈ పంచ రత్న కీర్తనల శ్రవణము, గానము ఒక మహా యోగము, తపస్సు, మోక్షదాయకము.

శిష్యుడు : ఈ పంచరత్న కీర్తనలయందు నాకు కొన్ని సంశయములు గలవు. వాటిని నివృత్తిచేయ ప్రార్థన.

గురువు : అవశ్యము!

శిష్యుడు : ఈ పంచరత్న కీర్తనలయందు స్వర - సాహిత్యముల శైలి విడివిడిగా పరిశీలించినచో మహోన్నతమైనది. ఆ రెండింటినీ జోడించినప్పుడు స్వరముల విచ్ఛేదము సాహిత్య భావమును అనుసరించి లేకపోవుటచే గానము చేయునప్పుడు సాహిత్య సౌందర్య దర్శనము క్లిష్టతరమగుచున్నది. ఉదాహరణకు "ఎందరో మహానుభావులు" అన్న పంచరత్న కీర్తన లోని ఆఖరి చరణమును పరిశీలింపుడు.

"భాగవత రామాయణ గీతాదిశ్రుతి శాస్త్ర పురాణపుమర్మములన్ శివాది షణ్మతముల గూఢములన్ - ముప్పది ముక్కోటి సురాంతరంగముల భావం బులనెరిగి భావ రాగ లయాదిసౌఖ్య ముచే చిరా యువుల్ గలిగి నిరవధిసుఖాత్ములై త్యాగరా జాప్తులైనవా ॥రెందరో॥

ఇలాగే మిగిలిన పంచరత్న కీర్తనలలో గూడ సాహిత్యపు విరుపులు భావానుగుణంగా వినపడవు. దీని విశేషమును తెలుప ప్రార్థన.

గురువు : సంగీత రచనలో విభిన్న స్వరముల కూర్పుచే విభిన్న భావము, రసోత్పత్తి కలుగుచున్నది. త్యాగరాజ స్వామి ఈ పంచరత్న కీర్తనలయందు తాను చెప్పదలచుకొన్న భావమును స్వర లిపితో వ్యక్తపరిచి తరువాత దానికి సాహిత్యమును జతచేసి ఆ భావమును ద్విగుణీకృతము జేసినారు.

ఇప్పుడు నీవు ఉదాహరించిన చరణము యొక్క స్వర-సాహిత్యములు పరిశీలింపుము :

రీ;; పనిసరీ నిసరిగరి। రీ, సా సనిప మపనిప రీ పని।

భా గవతరామా. .యణ గీ తాది శ్రుతి శా స్త్రపురాణపు

పా రిసరి గరిస నిసరిమపని। పా పమరీ-పామరిరి నిపపా।

మ ర్మములన్ శివాది ష ణ్మతముల గూఢములన్ ముప్పది ముక్కో . .

'సనిపారిరి సనిప పాపా గరి| రిగరి రిరిరి గరి రిగం రిరి|
టి సురాంతరంగముల భావంబుల నెరిగి భావరాగలయాదిసౌఖ్య
సపా, పపా, రిరీ, గరిపని పనిస|రి సాససా – పాపపా – రీరిరి||
ముచే చిరా యువుల్ గలిగి నిరవధి సుఖాత్ములై త్యాగరాజాప్తులై
గరిసని ||ఎందరో||

నవా :

"భాగవత, రామాయణ, గీతాది" అను పద సముదాయపు స్వరలిపిని పరిశీలింపుము. ఒక వక్త విభిన్న వస్తువులను పేర్కొనునపుడు ప్రతి వస్తువు యొక్క మొదటి అక్షరమును ఉచ్చస్వరముతోను తరువాత అక్షరములను క్రింది స్వరముల తోను ఉచ్చరించి ఆయా పద విచ్ఛేదనము ప్రస్ఫుటము గావింతురు. ఇక్కడ "భాగవత – రామాయణ – గీత" అను మూడు పదములందలి మొదటి అక్షరము "రి" అను స్వరముతో ప్రారంభింపబడి మిగిలిన అక్షరములు మంద్రస్వరములో కూర్చ బడినవి. వేదవాఙ్మయమగు మంత్రపుష్పము పరిశీలించినచో ఈ విషయము అవగతమగును. "సబ్రహ్మ సశివః సహరి స్సేన్ద్రః"– అను ప్రయోగమందు ఆరంభాక్షరములు స్వరితమం దును అంత్యాక్షరములు "అనుదాత్త" మందును కూర్చబడినవి. "ఆది – శ్రుతి – శాస్త్ర – పురాణపు – మర్మములన్" ఈ పదములకు రిషభం నుండి మంద్ర పంచమం వరకు గల అవరోహణ–ఆరో హణ స్వరములన్నిటినీ ప్రయోగించి వాని విస్తృతమును వ్యక్త పరచి–మర్మములన్ అను మాటను మంద్ర పంచమమందు కేం ద్రీకరించి–మర్మములను మెల్లగా మాట్లాడవలెనను స్ఫూర్తి

కలుగజేసిరి. "శివాది షణ్మతముల" అను మాటలో షణ్మత ములు అనుదానికి "నిసరిమపని" అను షట్ స్వర స్థాయిని ప్రయోగించి మహానుభావుల విజ్ఞానపు లోతును చెప్పునప్పుడు "మర్మముల" అన్నప్పుడు మంద్రపంచమమును వాడి "గూఢ ములన్" అను తర్వాత ప్రయోగమందు మధ్యపంచమమువాడి- స్వరమును తీవ్రపరిచి వారి విజ్ఞానౌన్నత్యమును వెల్లడించిరి. "ముప్పది ముక్కోటి సురాంతరంగముల భావంబుల" అను పదములయందు "ముప్పది ముక్కోటి" అను శబ్దములో 'క్కో' అను మాటను ఒత్తిపలికి ఆ సంఖ్యయొక్క ప్రత్యేకతను తెలిపి "సురాంతరంగముల" అనుదానిని తారస్థాయిలో ఇమిడ్చి దేవ తల స్థానమును సూచించుచూ-భావంబులు అనుదానిని మధ్య పంచమములో ఇమిడ్చి "సురాంత రంగముల భావముల" యొక్క ఔన్నత్యమును చూపించి ఈ ఔన్నత్యమును "ఎరిగి" అన్న మాటకు తారస్థాయి రిషభం వాడి "భావ-రాగ-లయాది- సౌఖ్యముచే - చిరాయువుల్ గలిగి" అనుదానికి స్వర కూర్పు నందు తారస్థాయి రిషభమునుండి మధ్యమస్థాయి రిషభమునకు తిన్నగా వచ్చి-షడ్జమ-పంచమ జీవ స్వరములు ప్రయోగించి సంగీత శాస్త్రమందలి జీవస్వర ప్రయోగములచే కలుగు సౌఖ్య మును వ్యక్తపరిచి "చిరాయువుల్" అను ఆశీర్వచన ప్రయోగ మును తారస్థాయి రిషభమందు ముగించి సంగీతౌన్నత్యమును బహుళముగా చాటి చెప్పిరి. "భావ-రాగ-లయాది-సౌఖ్యము చే- చిరాయువుల్ గలిగి" అనగా మంచి భావము-రాగము-తాళ ముతోకూడిన సంగీతము కల్గజేయుసమాధిస్థితి ఆయుర్భాగ్యము కలుగజేయును. ఈ పద ప్రయోగ మందున్న స్వరము లు

ససా-పపా రిరీ (గరిసని - పనిసరి) సాససా-పాపపా-రీరిరీ (గరిసని), ఆరోహణ క్రమమందున్న జీవ స్వరములు స్వర త్రియములు కాగా అవరోహణయందున్నవి స్వర పంచకములు. జీవస్వర సంయోగముచే ఉద్భవించునది ప్రణవనాదము. భగవంతుడు ప్రణవనాద స్వరూపుడు. స్వరత్రియము సూచించునది ముల్లోకమందలి ప్రణవనాదము కాగా స్వర పంచకము సూచించునది పంచ భూతాత్మకమయిన జీవిచే ఉద్భవించు ప్రణవనాదము. రాగమందలి ప్రణవనాదోత్పత్తికి మూలాధారమయిన జీవ స్వరములు ఆరోహణ - అవరోహణ క్రమములో ప్రయోగించి ఆ ప్రణవనాదోత్పత్తిచే కల్గు సౌఖ్యము ఆయురారోగ్యమును పెంపొందించి నిరవధి సుఖము (మోక్షము) కలుగ జేయునని చెప్పిరి.

ఈ విధముగా ఈ స్వరములు తమకు తాముగా ఒక భావమును వ్యక్తపరుచును. దానికి సాహిత్య భావము తోడైనప్పుడు ఆ రసానుభూతి వర్ణనాతీతము, ఈ అనుభూతిని పొందవలెనన్న సంగీతమందు కొంత పరిజ్ఞానము, ప్రజ్ఞ అవసరము. ఇదే విధముగా వారి ఘనరాగ పంచరత్నములందు స్వర సముదాయపు పరిభాష విస్తృతముగా ప్రయోగించబడుటచే అవి మేటి పంచరత్నములుగా భాసిల్లినవి.

శిష్యుడు : గురువుగారూ! త్యాగరాజ స్వామివారి రచనలను ద్రాక్షాపాక రచనలుగా పేర్కొంటారే! మరి జగదానంద కారకా అను పంచరత్న కీర్తన యందునూ, మిగిలిన పంచరత్న

కీర్తనల యందునూ, స్వామివారి శైలి నారికేళ పాకములో నున్నది గదా! దీని వివరణ తెలుప ప్రార్థన.

గురువు : త్యాగరాజస్వామివారి రచనలు బహుళముగా ద్రాక్షా పాక రచనలే. అయితే వారి కాలంలో వారి సమకాలికులు (స్వామివారి ప్రతిభ వెల్లడికాక పూర్వము) వారి ప్రజ్ఞా పాట వములను కించపరచుచూ సంభాషించుకొనుచుండ అట్టి వారి సంభాషణలు విన్న వారి శిష్యులు వ్యథజెంది గురువుగారికి ఆ విషయమును విన్నవించిరి. అంత త్యాగరాజస్వామి చిరు నవ్వు నవ్వి "జగదానంద కారక" అను మొదటి పంచరత్న కీర్తనను క్లిష్టమైన సంస్కృత సమాసములతో పాడి వారి విమర్శలకు తాళము వైచిరి. అందుచే ఈ పంచరత్న కీర్తనల యందలి సాహిత్యము ప్రత్యేక శైలిలో కొనసాగి మిగిలిన కృతులనుండి భిన్నత్వము నొంది వారి రచనలన్నిటి యందు మకుటాయమైనవి.

శిష్యుడు : "ఎందరో మహానుభావులు" అన్న కీర్తన యొక్క సందర్భము తెలుప ప్రార్థన:

గురువు : తిరువాన్కూరు రాజ్యమున రామమంగళ గ్రామ నివాసియగు "షట్కాల గోవిందమారార్" త్యాగరాజు దర్శనము చేసి "చందన చర్చిత" అను జయదేవుని అష్టపదిని ఆరుకాలము లలో పాడి అసమాన పాండిత్యమును ప్రదర్శించగా త్యాగరాజు పులకితాంగుడై "ఎందరో మహానుభావులు" అను కీర్తనను పాడినట్లు కొందరు చెప్పుదురు

త్యాగరాజు గురువుల ఆదేశానుసారం గురు సన్నిధిలో అనేకులగు భక్త శిఖామణులు, పాండితీవిభవ సంపన్నులు, కవి పుంగవులు ఉపవిష్టులై యుండగా వారి నుద్దేశించి "ఎందరో మహానుభావులు" అను కీర్తన పాడినట్లు మరికొందరు చెప్పుదురు

గంగాతీర మందున్న రామదాసు యను ఒక భక్తునికి శ్రీ రామచంద్రుడు దర్శనమిచ్చి త్యాగరాజు దర్శనార్థమై తిరువయ్యూరు వెళ్ళమని ఆజ్ఞాపించెనట. భగవంతుని ఆదేశానుసారము ఆ రామభక్తుడు త్యాగరాజస్వామిని దర్శించి వారి సన్నిధిలో గానంచేసి తన స్వప్న వృత్తాంతము స్వామివారికెరుక పరచెనట. ఇట్లే కాశీక్షేత్రము నుండి రామభక్తుడైన గోపీనాథ భట్టాచార్య అను ప్రసిద్ధ హిందుస్తానీ సంగీత విద్వాంసుడు త్యాగరాజస్వామివారి గానము వినగోరి తిరువయ్యూరు వచ్చి మేను పులకరించు గానము చేయగా త్యాగరాజస్వామి, తమ గృహమునకు రామభక్తులు, మహా విద్వాంసులు శ్రీరాముని చేతనే ప్రేరితులై పలువురు రాగా జూచి సంతోషముతో "ఎందరో మహానుభావులు" అన్న శ్రీరాగ కీర్తన, విదులకు మ్రొక్కెద అను మాయామాళవ గౌళకీర్తన, "రామభక్తి సామ్రాజ్యం" అను శుద్ధ బంగాళ రాగకీర్తన బాడి రామభక్తులను కొనియాడిరి.

మొత్తంమీద ప్రథమముగా వారు ఈ పంచరత్న కీర్తనను ఏ సందర్భములో పాడిననూ, వారు అనేక సందర్భములలో ఈ కృతిని సందర్భోచితముగ గానం చేసినట్లు ద్యోతకమగుచున్నది.

శిష్యుడు : "రామభక్తి సామ్రాజ్యం" అను శుద్ధ బంగాళ కృతి యొక్క వివరణను విపులముగా తెలుప ప్రార్థన.

గురువు : ఆ కృతియొక్క సాహిత్య మీ విధముగా యున్నది :
శుద్ధ బంగాళ రాగము - ఆదితాళము.
(22వ మేళకర్తయగు ఖరహరప్రియ రాగజన్యం).

పల్లవి : రామభక్తి సామ్రాజ్య-మేమానవులకబ్బెనో మనసా ॥రామ॥

అనుపల్లవి : ఆ మానవుల సందర్శన-మత్యంత బ్రహ్మానందమే ॥రామ॥

చరణము : ఈలాగని వివరించలేను-చాలా స్వానుభవవేద్యమే
లీలాసృష్టి జగత్రయమను - కోలాహల త్యాగరాజ
నుతమగు ॥రామ॥

భగవత్తత్వమును నిరూపించుటకు అనేకులైన మహనీయులు అనాది కాలము నుండియును ప్రయత్నించుచుండిరి. భగవత్తత్వమును కొందరిట్లనిరి. భగవంతుడు విగళిత వేద్యాంతరుడు. వేద్యము అనగా తెలియదగినది, ఏది తెలియ దగినదో అది జారి పడిన తరువాత కలుగు అనుభూతియే దివ్య తత్వము. అట్టిదే బ్రహ్మానందమునూ, బ్రహ్మానందము నిరూపణము చేయలేని విషయము. నిర్వచింపరాని మనస్థితి.

100 మానుషానందములు = 1 మనుష్య గంధర్వానందము.
100 మనుష్య గంధర్వానందములు = 1 దేవ గంధర్వానందము.
100 దేవ గంధర్వానందములు = 1 పితృ దేవతానందము.

| | |
|---|---|
| 100 పితృ దేవతానందములు. | = 1 ఆజానజదేవ తానందము |
| 100 ఆజానజదేవతానందములు | = 1 కర్మ దేనతానందము. |
| 100 కర్మ దేవతానందములు | = 1 దేవానందము. |
| 100 దేవానందములు | = 1 ఇంద్రానందము. |
| 100 ఇంద్రానందములు | = 1 బృహస్పత్యానందము.. |
| 100 బృహస్పత్యానందములు | = 1 ప్రజాపత్యానందము. |
| 100 ప్రజాపత్యానందములు | = 1 బ్రహ్మానందము. |

మానుషానందమన యువకుడును, సాధువును, ద్రిఢిష్ఠుడును, బలిష్ఠుడును నగు నొక మహారాజు పొందునట్టి యానందము పైన జూపిన లెక్కను బట్టి చూడగా 100, 00, 00, 00, 00, 00, 00, 00, 00, 00 (ఒక లక్ష కోటి కోట్లు) మానుషానందములయినచో నొక్క బ్రిహ్మానందమగునని సాక్షాద్ద్రిష్టలును, బ్రంహ్మిష్ఠులును నగు మహర్షులు వాకొనిరి.

త్యాగరాజస్వామివారు పై కృతియందు ఈ బ్రిహ్మానందమునే ప్రస్తుతించిరి. రామభక్తి సామ్రాజ్యము ఏ మానవుల కబ్బెనో ఆ మానవుల సందర్శనము అత్యంత బ్రిహ్మానందమని సెలవిచ్చిరి. సామ్రాజ్యము అనేక రాజ్యముల ఏకీకృతిగా గల ఒక పెద్ద రాజ్యము. రామభక్తి ఒక మహా సామ్రాజ్యము. అది పుణ్యాత్ములయిన మహానుభావులకు మాత్రమే లభించు సంపద. అట్టి మహా పురుషుల సందర్శనా సాంగత్యములు కలిగినవారు ధన్యాత్ములు. అది వారికి బ్రిహ్మానందము కల్గించును. "అత్యంత బ్రిహ్మానందము" అన్న త్యాగరాజులవారి మాట వారి అనుభూతికి నిదర్శనము.

సాధు సాంగత్యము సర్వ సంపద్ ప్రదము. రామ
భక్తియే మహా సామ్రాజ్యముగా కల్గిన ఉత్తముల సాంగత్యము
కలిగింపలేని సంపద ఏముండును? సంపదలకు అవశ్య ఫలి
తము ఆనందము కదా! అది వట్టి ఆనందము కాదు. అట్టి ఉత్త
ముల సందర్శనము బ్రహ్మానందదాయకము. అనగా సృష్టి
యందుగల సమస్త సంపదలూ కల్గింపనేరని ఆనందము ఈ
ఉత్తముల సాంగత్యమున కల్గును. అట్టి బ్రహ్మానందము
ఇట్లుండును అని తెలియజెప్పుట అసాధ్యము. ఈలాగని వివరింప
లేను అన్న మాట యొక్క అభిప్రాయమిదియే. మరి ఈ బ్రహ్మా
నందము ఎట్లుండును? అని వితర్కించుకొనిన సాధు సంగము
వలన అట్టి స్థితి కల్గునని చెప్పినారు. మరి దాని స్వరూప
స్వభావములు ఎట్లుండును? ఇది యొక వాక్కులకందని స్థితి.
అవర్ణనీయము, ఒక అనుభూతి, అనుభవైక వేద్యమే గాని
వాచామ గోచరము.

వ్యాసమహర్షి మహాభాగవతమును రచించెను. అది భగ
వంతుని యొక్క అవతారముల కథ ఆధ్యాత్మిక నిధానము
ఈ గ్రంథమున అనేకులు వ్యాఖ్యలు వ్రాసిరి. వాటియందు
శ్రీధరీయము ప్రామాణిక వ్యాఖ్యగా పెద్దలు చెప్పుదురు.
పోతనామాత్యులు భాగవతమును తెలుగు పద్య, గద్యములలో
అనువదించిరి. వ్యాసమహర్షి సూత్రప్రాయముగా అందించిన
విషయమును మాత్రము చెప్పి ఈయన తృప్తి పడలేదు.
పాఠకులకు వ్యాసుని హృదయమును అందించుటకు కొంత తమ
స్వకపోల కల్పనములు కావించిరి. ఎక్కువ పట్ల శ్రీధరీయ
వ్యాఖ్యను కూడ యథాతథముగా భాగవతమువలె అనువదించిరి.

ఇట్లు చేయుట వలన మూలముకంటె అనువాదము చాలా పెరిగినది. భగవత్తత్వ నిరూపణమునందు పోతరాజు త్యాగరాజులు పడిన శ్రమ ఇట్లు ఏకీభవించుచున్నది,

(ఆధునిక యుగమున భాగవత మార్గమున సేవించుచు దైనందిన జీవితమున భగవదనుభూతిని అందజేయుటకు కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్యులు 1976-1984 నడుమ భాగవత రహస్య ప్రకాశమును 16 సంపుటములుగా వ్యాఖ్యానించిరి.)

ఇది లీలా సృష్టి. భగవంతుడు పురుషుడు. ప్రకృతి స్త్రీ తత్త్వము. భగవంతుడే లీలార్థము సృష్టిగా పరిణమించెను. ఈ జగత్త్రయము కోలాహలమందుము. జగత్తు సృష్టి, స్థితి, లయముల రంగము. అనుక్షణమును ప్రకృతి యందు ఈ సృష్టి, స్థితి, లయములు జరుగుచుండును. ప్రకృతి అంతయూ పుట్టుట, మరొకటిగా పరిణమించుట, గిట్టుట అను కార్యముల కోలాహలవంతము అయియున్నది. ఇట్టి లీలా సృష్టి అయిన జగత్త్రయమునందు కల కోలాహల స్థితియొక్క పరమార్థము రామభక్తి సామ్రాజ్యము అను సంపద గల పెద్దల సాంగత్యమున సాధారణులకు అర్థవంతమై ప్రకాశించును.

ఈ సారాంశము తెలియజెప్ప ప్రయత్నము కంటె ఈ బ్రహ్మానందానుభూతి పొందినవారి అనుభూతులు చెప్పుట వలన ఎక్కువ తెలియజెప్పుటకు చేయ ప్రయత్నమగును. ఈ కృతి రామభక్తుడైన "గోపీనాథ భట్టాచార్య" అను ప్రసిద్ధ హిందుస్తానీ సంగీత విద్వాంసుడు త్యాగరాజస్వామిని దర్శించినప్పుడు వెలువడిన అమృత ఝరి.

శిష్యుడు : శ్రీ గోపీనాథ భట్టాచార్యులుగారి వివరణను తెలియజేసి ఈ సన్నివేశమును విపులముగా తెలియజేయ ప్రార్థన.

గురువు : భారతదేశమందు కాశీక్షేత్రము పురాతనమైనది. సనాతన ధర్మమునకు అది కేంద్రము. విద్య లన్నింటికినీ అటపట్టు. పూర్వము కాశీపట్టణమున విద్య నభ్యసించినవారిని మహా పండితులుగా గుర్తించెడివారు. ఈ ధార్మిక కేంద్రము చుట్టునూ అనేక పురాణములు, గాథలు ముడివడి యున్నవి. సమస్త శాస్త్రాధ్యయనములకునూ వేదికయై పిపాసువులకు జ్ఞాన ప్రదాత అయినది కాశీ పట్టణము. వ్యాసర్షి మొదలు సమస్త వేద ఋషులకు ఇది శ్రద్ధాకేంద్రము. విశ్వేశ్వర అన్నపూర్ణాంబలను సేవించి వీరందరునూ తరించిరి. సమస్త కళలకునూ ఆలవాలమైన ఈ కాశీ క్షేత్రమున పదునెనిమిదవ శతాబ్దపు టుత్తరార్థమందు గోపీనాథ భట్టాచార్యులు అను ఒక బెంగాలీ బ్రాహ్మణుడుండెడివాడు. ఈయన తులసీదాసు శిష్య ప్రశిష్య గణములలో నొకరు. గొప్ప రామభక్తుడు. సంగీత విద్యా పారంగుడు. హిందూస్తానీ సంగీతము నందు విశేష పాండిత్యమును గణించి ఎందరో శిష్యులకు జ్ఞానభిక్ష పెట్టినాడు. పరమ పావనమైన కాశీ క్షేత్రమును దర్శించి తదనంతరము రామేశ్వరము దర్శించి వారి వారి కర్మ బంధముల నుండి విముక్తి పొందగోరుట సనాతనమైన భారతీయ ఆచారము. అందుచే అనేకులు కాశీ క్షేత్రమును దర్శించినప్పుడు అట గల గోపీనాథ భట్టాచార్యుని దర్శించి వారి గానామృతమును చెవులార గ్రోలి తరించెడివారు. అట్టి యాత్రికులలో అనేకులు దాక్షిణాత్యులునూ ఉండెడివారు.

అది కాలమున దక్షిణదేశమందు తిరువయ్యూరు గ్రామమున త్యాగరాజస్వామి రామతారక మంత్రోపాసకుడై నారదానుగ్రహ ప్రాప్తిచే సంగీత మర్మములను ఎరిగినవాడై గొప్ప సంగీతవేత్తగా ఖ్యాతిచెంది యుండెను. మహా భక్తుడగు త్యాగరాజు రామకృపకు పాత్రుడై అనేక అద్భుత కార్యములను చేసి కీర్తివంతుడైనాడు. త్యాగరాజస్వామివారి మహిమలు కీర్తి కాశీక్షేత్రమందలి గోపీనాథ భట్టాచార్యులకు అనేకులగు యాత్రికులు చెప్పిరి. ఒకనాడు స్వప్నమందు శ్రీ భట్టాచార్యునికి శ్రీరామచంద్రుడు సాక్షాత్కరించి త్యాగరాజ స్వామివారి దర్శనము చేసి వారి సంగీతమును వినుమని ఆజ్ఞాపించెను. ఆ దినములలో ప్రయాణ సౌకర్యములు లేవు. సుదూర ప్రదేశములను సైతము కాలినడకనే చేరుకొనవలసి యుండెడిది. అనేక కష్టములకోర్చి గోపీనాథ భట్టాచార్యులు ఎట్టకేలకు తిరువయ్యూరు చేరిరి.

అది ఏకాదశీ పర్వ దినము. ఆ దినమున త్యాగరాజ స్వామివారి గృహము సంకీర్తనాదులచే ప్రణవనాద పూరితమై భగవత్సాన్నిధ్యమును కల్గియున్నది. త్యాగరాజ స్వామి, శ్యామశాస్త్రి వంటి మహానుభావులే గాక అనేకులైన సంగీత విద్వాంసులతోను, వాద్యకారులతోను, శిష్యులతోను, సంగీత రసాస్వాదకులైన లెక్కకు మిగిలిన సదస్యులతోడను ఆ ప్రదేశము నిండి ఓంకార ధామమై భాసిల్లుచున్నది. మహానుభావులైన త్యాగరాజస్వామి శ్యామశాస్త్రిగారలు పాడుచుండ వారి శిష్యులు బృందగానము సేయగా వెలువడు నాద తరంగములు సమ్మోహన వెల్లువలై శ్రోతల నచేతనులుగా నొనరించి ఆ పర

హాత్ముని లీలా వైదుష్యమును నెరుకపరుచు చున్నది. అట్టి మహత్తర సమయమునందు గోపీనాథ భట్టాచార్యులు త్యాగరాజ స్వాములవారి గృహమునకేతెంచిరి. అచట కాలిడినదాది గోపీ నాథునకు దైవ సాన్నిధ్యానుభూతి కల్గి వారందరితో కలసి ఒడలెరుగక సంకీర్తన చేయ దొడంగిరి. గానముచే తాదాత్మ్య మును జెందిన గోపీనాథ భట్టాచార్యులు అచట నున్న ఎల్లరి దృష్టినీ ఆకర్షించిరి. సంకీర్తనానంతరము త్యాగరాజస్వామి గోపీనాథుని ప్రత్యేకముగా పాడమని కోరిరి. వారి కోరికను మన్నించి గోపీనాథ్ దుర్గారాగమును అద్భుతమైన హిందుస్తానీ సంగీతపు బాణీలో, విళంబిత, మధ్య, ధృతకాలములందు ఆలా పించి త్రిస్థాయి సంచారములతో ఆ రాగమును చిత్ర, విచిత్ర గతులలో నడిపించి పాడ దొడంగెను. అచట నున్న మహా విద్వాంసులైన వాయిద్యకారులు వారి గానమునకు సహకార మందించుచుండ, గోపీనాథునకు అమితోత్సాహము కలిగి క్లిష్ట, సంక్లిష్ట సమాసములతో గూడిన స్వర కల్పనలు, తాళగతులు ప్రదర్శించ దొడంగెను. అచట నున్నవారెల్లరూ ఆ అద్భుత గానమునకు ముగ్ధులై ఒడలెరుంగక చైతన్య హీనులైరి. ఆ విధముగా వారి గానము వేకువజాము వరకూ సాగినది. ఆ పాడుచున్నవారు కాశీక్షేత్ర నివాసియగు మహాసంగీత విద్వాంసు డైన గోపీనాథ భట్టాచార్యులు అని తెలిసి వారి స్వప్న వృత్తాం తము విన్న వెంటనే త్యాగరాజస్వామివారి ఆనందము 'అవధులు దాటినది'. వారి సంగీత ఝరి మహా ప్రవాహమై అచట నుపవిష్టులైన వారినందరినీ ఆనందామృత డోలికల పరవ శింపజేసినది. ఆ సమయమందు త్యాగరాజస్వామి గానము

చేసిన కృతియే "రామభక్తి సామ్రాజ్యమే మానవుల కబ్బెనో మనసా! ఆ మానవుల సందర్శన మత్యంత బ్రహ్మానందమే - ఈలాగని వివరించలేను చాలస్వానుభవవేద్యమే...."

ఈ కృతిని త్యాగరాజస్వామి గానము చేయుటకు పూర్వము 'శుద్ధ బంగాళ' రాగమును విస్తృతముగా అలాపించి కృతిని సవివరముగా భావ, రాగ సంగతులతో సమ్మేళనముచేసి, అపూర్వశైలిలో నెరవు, స్వర ప్రస్తారము చేయుచూ శ్రోతల మంత్ర ముగ్ధుల గావించెను. వెను వెంటనే శ్రీ భట్టాచార్యులు మహదానందభరితులై శ్రీ స్వామివారు పాడిన రాగము శుద్ధ బెంగాలీ శైలిలో నున్నదని ప్రశంసించగా త్యాగరాజస్వామి వెంటనే ఆ రాగమును "శుద్ధ బంగాళ" అని పేర్కొనిరి. తదనంతరము త్యాగరాజస్వామివారి శిష్యులలో ఒకరయిన వాలాజి పేట వేంకటరమణ భాగవతులు గురువుగారి నుద్దేశించి:

"స్వామీ! ఈ రాగమును మున్నెన్నడునూ మేము వినలేదు. ఈ రాగమందలి విశేషములను మాకు తెలియజెప్ప ప్రార్థన" అని వేడగా శిష్యుని కోరికను మన్నించినవారై త్యాగరాజ స్వామి ఇట్లు చెప్ప దొడంగిరి.

త్యాగ : మీరు శ్రీ భట్టాచార్యగారు పాడిన రాగమును విన్నారు కదా! దానిని మన కర్ణాటక సంగీతమందు "శుద్ధ సావేరి" అని వ్యవహరింతుము.

భట్టాచార్య : ఆ రాగమును హిందుస్తానీ సంగీతమందు దుర్గా" రాగమని పిలుతురు.

వేం॥ రమణ : స్వామీ! మీరు పాడిన దుర్గా రాగమునకు, మా శుద్ధ సావేరికి స్వరములు ఒకటే అయిననూ ప్రస్తారములోనూ, రాగస్వరూప భావములలోనూ మిక్కిలి వ్యత్యాసము అగుపడు చున్నది. అది ఎట్లు కల్గినది?

భట్టాచార్య : హిందూస్థానీ సంగీతములో రాగాలాపన పూర్వార్థ మందు ప్రతి స్వరమునూ పరిశుద్ధముగా అనగా గమక రహిత ముగా పాడుచూ ఆధార షడ్జమమువద్ద చిన్న చిన్న ప్రయో గములచే దీర్ఘ సంచారము చేసి ఆధార షడ్జమమందు రాగ భావములో శ్రోతల మనస్సులు లగ్నము జెందునటుల పాడు దుము. అందుచే పరిసరమంతయూ జీవ స్వరములతో ప్రణవ నాదపూరితమై శోభిల్లును.

త్యాగ : ఆహా! ఎంత చక్కని విశ్లేషణము చేసినారు స్వామీ! మా కర్ణాటక సంగీతమందు స్వరములను వాటి నిజ స్వరూప మును పోషించుచూ అలంకారప్రాయముగా గమకములను వాడుదుము. అందువలన ఆ స్వరము యొక్క రసోత్పత్తి విభిన్న రీతులలో ఆహ్లాదపరుచును.

భట్టా : అందుకే మీ కర్ణాటక సంగీతము పాడుట చాల కష్టము. చాలమంది కర్ణాటక సంగీత విద్వాంసులు హిందూస్థానీ సంగీ తము పాడగలరు. కాని హిందూస్థానీ సంగీత విద్వాంసులు కర్ణాటక సంగీతమును పాడలేకపోవుచున్నారు.

వేం॥ రమణ : గురువుగారూ! శుద్ధ సావేరికి, శుద్ధ బంగాళ రాగమునకు గల పోలికలు తేడాలు వివరింపగోరెదను.

త్యాగ : ఈ రెండు రాగముల మూర్ఛనలు :

శుద్ధసావేరి: ఆరోహణ: సరిమపదస ) 29వ మేళకర్తయగు
అవరోహణ: సదపమరిస.) ధీరశంకరాభరణ
రాగజన్యం

శుద్ధబంగాళ: ఆరోహణ: సరిమపదస. ) 22వ మేళకర్తయగు
అవరోహణ: సదపమరిగరిస.) ఖరహరప్రియ రాగ
జన్యము

శుద్ధ బంగాళరాగమందు "సాధారణ గాంధార" ప్రయోగము తీసివేసినచో శుద్ధసావేరి మూర్ఛనకు సమానము. అదియును వక్ర ప్రయోగముతో చేర్చబడినది.

వేం॥ రమణ: శుద్ధసావేరి రాగమును "హరి కాంభోజి" రాగ జన్యముగ కూడ చెప్పవచ్చు కదండీ?

త్యాగ : చెప్పకూడదు. తారస్థాయి "స" నుండి దైవతమునకు వచ్చు జారు గమకమందు 'కాకలి నిషాదము' అంతర్లీనమై ఉండును. కాని కాకలి నిషాదము ధ్వనింపదు. ఆ గమకమందు కైశికి నిషాద సన్నిహితత్వము కూడదు. అందుచే అది ధీర శంకరాభరణ రాగజన్యమే!

వేం॥ రమణ: శుద్ధ బంగాళ రాగముతో సాధారణ గాంధారమునకు బదులు అంతర గాంధారమును ప్రయోగించినచో?

త్యాగ: వక్ర ప్రయోగములచే జన్య రాగముల నెన్నో సృష్టింపగలము. కాని శుద్ధ బంగాళ రాగముతో సాధారణ

గాంధార ప్రయోగము ఎందుకు చేసితినన - మనమందరమూ శ్రీ భట్టాచార్యులుగారు ఎంతో మనోహరముగా పాడిన దుర్గా రాగమును వినియుంటిమి గదా! వెంటనే నేను అదే మూర్ఛన గల మన శుద్ధ సావేరి పాడిన యెడల వారితో పోటీకి పాడి నట్లగును. ఐతే వారు పాడిన రాగాన్ని ఆధారము చేసుకొని ఒక చిన్న మార్పుతో అనగా సాధారణ గాంధారాన్ని అవ రోహణలో జతచేసి ఒక కొత్త రాగాన్ని కల్పించి పాడాలని సంకల్పించేను. ఐతే నీవన్నట్లు సాధారణ గాంధారానికి బదులు అంతర గాంధారాన్ని జతచేశాననుకో! అప్పుడు ఆ రాగము 'దుర్గా' రాగమునకు పూర్తిగా దూరమగును. అది నా మనో భీష్టము గాదు. అదియునూ గాక మన కర్ణాటక సంగీతములో "లీనము" అను గమక ప్రయోగములో అన్ని స్వరములను దగ్గరనున్న మీది స్వరముతో కలిపి రెండక్షరముల కాల ప్రమా ణముతో కంపితము చేయుదుము. కాని సాధారణ గాంధార మును మాత్రము నూటికి తొంబదిపాళ్ళు క్రింది స్వరముతో అనగా చతుశ్రుతి రిషభముతో కలిపి రెండక్షరముల కాల ప్రమాణముతో కంపితము చేయుదుము. అందుచే ఈ సాధారణ గాంధార ప్రయోగము వలన చతుశ్రుతి రిషభమునకు అధిక సన్నిహితత్వమేర్పరిచి దుర్గా రాగమునకు ఒక క్రొత్త స్వరూ పమును ఇచ్చుట జరిగినది. అదియునూ గాక, అంతర గాంధారము చాల ముఖ్యమైన స్వరము. జీవ స్వరములైన షడ్జమ, పంచమ, మధ్యమముల తరువాత ద్వావింశతి శ్రుతు లలో అధిక ప్రాముఖ్యము కలిగినది ఈ స్వరమే. అందుచే దీనిని ప్రయోగించినచో మిగిలిన స్వరముల ప్రాముఖ్యత తగ్గును.

భట్టా : మీరు అవలంభించిన సిద్ధాంతమునకు అనుగుణముగా హిందూస్తానీ సంగీతమందు కూడ రెండు రాగములు కలిపి ఒక క్రొత్త రాగమును సృష్టించుట కలదు. ఎట్లనగా మీ అభోగి రాగాన్ని-కానడరాగాన్ని కలిపి అభోగి-కానడ అని వేరే రాగాన్ని మేము పాడుదుము. అట్లే అనేక రాగములు 'బసంత్-బహార్' మొదలగునవి పుట్టినవి.

త్యాగ : ఐతే మీ రాగాన్ని అదే స్వరూపంలోనూ, పేరుతోను మా దాక్షిణాత్యులు పాడుటయు, అటులనే మా దాక్షిణాత్య రాగాల్ని అదే పేరుతో మార్పు చేయకుండా హిందూస్తానీ సంగీతములో పాడుటయూ కూడ జరుగుచున్నది.

భట్టా : మీరు పాడిన కృతియందలి సాహిత్య విశేషములను తెలుప ప్రార్థన.

త్యాగ : వేంకటరమణా! ఏదీ నీవు వ్రాసిన సాహిత్యాన్ని చదువు.

భట్టా : మీరు పాడుచుండగా మీ శిష్యులు ఏదో వ్రాయుచున్నారు. అవి ఏమోననుకొన్నాను. అనగా వారు మీ పాటకు స్వర సాహిత్యములను వెంట వెంటనే వ్రాసుకుంటున్నారన్న మాట!

వేంకట: మా గురువుగారు ఏమి మాటలాడినా అది ఒక పాట అయి అద్భుతమైన సంగీతరచన అయిపోతుంది. అది వెంట వెంటనే మేము వ్రాసుకొనకపోతే అవి అలా గాలిలో కలిసి పోతాయి.

భట్టా : చాలా బాగున్నది.

వేంకట: "రామభక్తి సామ్రాజ్యమే మానవులకబ్బెనో మనసా"- ఇది పల్లవి.

త్యాగ : "రామభక్తి సామ్రాజ్యము" అనగా పరబ్రహ్మ యొక్క భక్తి సామ్రాజ్యము. సామ్రాజ్యము అనగా అనేక చిన్న రాజ్యములు కలిసిన పెద్ద రాజ్యము గదా. చిన్న రాజ్యాలు సామ్రాజ్యంలో అంతర్భాగా లవుతాయి. అందుచే రామభక్తి సామ్రాజ్యమబ్బుట అనగా ఎవరు ఇతరుల భక్తి విశ్వాసాలను రామభక్తి సామ్రాజ్యముయొక్క అంతర్భాగములుగా గుర్తించ గలుగుదురో వారు మహానుభావులు. అనగా ఇతర ధర్మము లనూ భక్తి విశ్వాసములను చిన్నపుచ్చకుండా వాటియందు మన భక్తి విశ్వాసములను దర్శించగల విశాల దృక్పథమును రామభక్తి సామ్రాజ్యము అన్న పదము స్ఫురింపజేస్తుంది.

వేంకట: ఆహా! ఎంత భావ గాంభీర్యము! ఒక చిన్న పదము వాడి ఎంతటి విశాలమైన భావాన్ని వెల్లడించారో-గురువుగారు!

భట్టా : ఇందువలననే మీ కృతులను త్యాగోపనిషత్తులంటారు!

త్యాగ : రామభక్తి సామ్రాజ్యము అన్నది ఒక మహా విశాల మైన భావన. ఈ తత్త్వముతో పరిశుద్ధులైన మహా మహితా న్వితు లెందరో కలరు. తులసీదాసు, కబీర్‌దాసు, రామదాసు మొదలుగా గల మహానుభావులందరూ ఈ రామభక్తిని మహా సామ్రాజ్యంగా ఆరాధించేరు. ఉపాసించేరు. వేంకటరమణా! అనుపల్లవి చెప్పుము:

వేంకట: ఆ మానవుల సందర్శన – మత్యంత బ్రహ్మానందమే మనసా!

త్యాగ: ఇప్పుడు భట్టాచార్యులుగారి సన్నిధానమున ఎంతో ఆనందాన్ని అనుభవిస్తున్నాము.

వేంకట: సరిగా తులసీధాస స్వామియే ఇచటకు వచ్చిన ట్లున్నది!

త్యాగ: బాగు బాగు! ఇలాంటివారి దర్శనము పొందగల్గితే బ్రహ్మానందముగాక మరేముండును?

వేంకట: బ్రహ్మానందము అంటే?

త్యాగ: అనేకవేల కోట్ల మానుషానందములు ఒక్కటైన అత్యున్నత స్థితి యొక్క మానసికానుభూతి బ్రహ్మానందము కదా! అది అన్ని ఆనందములకంటె శ్రేష్ఠమైనది. రాముడు పరబ్రహ్మము. కాబట్టి రామభక్తి సామ్రాజ్య ప్రష్టల సేవ బ్రహ్మానంద ప్రదము. పరబ్రహ్మము, బ్రహ్మ-విష్ణు-మహేశ్వ రాది సమస్త దేవతలనూ, జగత్పాలకులనూ సృష్టించి ఆయా స్థానములయందు వారిని అధిష్ఠింపజేసెను. ఆ సమయములో ఉత్పన్నమైన ఆనందము బ్రహ్మానందమునకు సరిపోలునని కొందరు పెద్దలు చెప్పిరి. మానవులందరకునూ జ్ఞానము పంచేం ద్రియముల వలన లభించును. పంచేంద్రియములనగా త్వక్, చక్షు, ఘ్రాణ, శ్రోత్ర, రసనేంద్రియములు. ఈ పంచేంద్రి యముల సంతృప్తి వలన కలుగు ఆనందమే మానుషానందము. దీనికి బ్రహ్మానందమునకూ హస్తి – మసికాంతర వ్యత్యాసము గలదు.

ఇది చరణం.

వేంకట: ఈలాగని వివరింపలేను-చాల స్వానుభవవేద్యమే
లీలాసృష్టి జగత్రియమనే-కోలాహల త్యాగరాజనుతమగు॥

త్యాగ: ఈ ఆనందాన్ని ఎట్లు విడమరిచి చెప్పగలను? మిఠాయి ఎలాగుంటుందటే తీయగా ఉంటుందంటాము. తీపి ఏలాగ ఉంటుందని అడిగితే ఏమి చెప్పగలము? అది అనుభవైక వేద్యము. మూలతత్త్వము. అట్లే రామభక్తులను సందర్శించుటవలన కలుగు ఆనందము గూడ అనుభవైకవేద్యమే! బ్రహ్మానందము మూల పదార్థము. సృష్టి భగవంతుని లీల. సృష్టి స్థితి లయములు జగత్త్రియము నందు నిరంతరమూ జరుగు కోలాహలమే మనము జగత్తున విను కలకలము. అనగా భగవదభీష్టమయిన నిరంతర సృష్టి స్థితి లయముల కోలాహలము భగవల్లీల. ఈ జగత్తునందలి కోలాహలము నుండి ప్రశాంత స్థితికి చేరుటకు రామభక్తి ఒక్కటియే శరణ్యము.

ఒక సమయమున పార్వతీదేవి నామ జపమునకు అత్యుత్తమమయిన నామము ఏది? అని ఈశ్వరుని ప్రార్థింపగా ఈశ్వరుడు ఇట్లు చెప్పెను:

"శ్రీరామ రామ రామేతి-రమే రామే మనోరమే
సహస్రనామ తత్తుల్యం-రామనామ వరాననే"

అనగా రామశబ్దము అత్యుత్తమమయిన దనియును, వేయి ఇతర నామములు దానికి సమములు కావని ఈశ్వరుడు బదులు చెప్పెను. అనగా రామతత్త్వము అంత మహత్తరమయినది.

మనము రామాయణమును పరిశీలించినచో రాముడు విష్ణువు యొక్క అవతారము అయిననూ ఈశ్వరుని ఆరాధించెను. ఆయనకు నమ్మినబంటు ఆంజనేయుడు ఈశ్వర తేజమున జనించెను. ఈ ప్రపంచమున శైవులు, వైష్ణవులు ఒకరి నొకరి ద్వేషించుకొనుచుండ రామతత్త్వము శివకేశవుల సన్నిహితత్వ మును తెలియజేయుచున్నది. కావున రామోపాసకులకు సర్వ ధర్మములు సమానములు. సమగౌరవప్రదములు. అందువలననే అదియొక మహా సామ్రాజ్యము.

వేంకట: (గోపీనాధ్‌ను జూచి) స్వామీ! తాము తులసీదాస స్వామి ప్రశిష్యులని వినియున్నాము. గురుదేవులు త్యాగ రాజులవారు రామభక్తి సామ్రాజ్య భావనచే పరిశుద్ధ మనస్కు లయినవారి సందర్శనము అత్యంత బ్రహ్మానంద దాయకమని సెలవిచ్చిరి. అందుచే రామభక్తులయిన తులసీదాస్, కబీర్ దాస్, సమర్థ రామదాస్ మొదలయిన మహానుభావుల చరిత్ర మును మాకెరుకపరిచి మా జన్మములను ధన్యము గావించ గోరెదము.

గోపి: తులసీదాసు ఆంజనేయస్వామికి అత్యంత ప్రీతి పాత్రులు. మనమిప్పుడు రామభక్తిని గురించి చెప్పుకొను చున్నాము.

"యత్ర యత్ర రఘునాధ కీర్తనమ్-తత్ర తత్ర కృతమస్త
కాంజలిం
బాష్పవారి పరిపూర్ణలోచనం - మారుతిం నమత రాక్ష
సాంతకం".

అని తులసీదాసు సెలవిచ్చిరి. అందువలన ఈ పరిసరములో ఆంజనేయస్వామి అజ్ఞాతరూపులై మన గోష్ఠి వింటున్నారు. తులసీదాసుకు రామ దర్శనము కలుగజేసినవారు ఆంజనేయ స్వామియే. అందుచే ఆ రామదూత సంస్మరణ ఎక్కడ జరిగితే అక్కడ రామభక్తి తత్త్వము విలక్షణముగా ప్రకాశించును. అందువలన హనుమంతుని అద్భుతలీలలు మనము స్మరించుకొని తదితర రామభక్తుల చరిత్ర శ్రవణము గావింతము:

రామ భక్తిలోని ఔన్నత్యమునకు కారణము రాముని యొక్క సచ్చరిత్రము. ఆ గాథను తెలుపు మహా కావ్యము రామాయణము. అందు సుందరకాండ మకుటాయమానమైనది. దీనిని అనుదినము పఠించినవారికి ఎట్టి మనఃక్లేశములూ ఉండవు. ఈ సుందరకాండకు మూలపురుషుడు ఆంజనేయస్వామి. సూక్ష్మముగా దాని సారాంశము ఇట్లున్నది.

సుగ్రీవుడు వానరవీరులలో ముఖ్యులైన అంగదుడు, హనుమంతుడు, జాంబవంతుడు, నీలుడు మొదలుగా గల వానర వీరులను సీతాన్వేషణమునకై దక్షిణ దిశగా పంపెను. వానర వీరులందరూ మార్గాయాసమువలన ఆకలి దప్పులు గొన్నవారై ఋక్ష బిలము ప్రవేశించి అది దాటి స్వయంప్రభా పరిరక్షిత మైన ఒక సుందర వనమందు మార్గాయాసము తీర్చుకొని ఆమె మహిమచే సముద్ర తీరమందు ఒక కొండపై చేర్చబడ్డారు. అప్పటికి సుగ్రీవుడిచ్చిన ఒక మాసము గడువు తీరినదని గ్రహించి ప్రాయోపవేశోన్ముఖులైరి. అంత సంపాతియను గృధ్రరాజు (అనగా జటాయువు అన్నగారు) వీరి వృత్తాంతము

విని లంకలో సీత వున్నట్లుగా తెలియపరచెను. వానరవీరులకు నూరు యోజనములు విస్తీర్ణము గల సముద్ర లంఘనము ఒక సమస్యగా పరిణమించెను. అంతట జాంబవంతుని ప్రేరణచే వాయు పుత్రుడు తన శక్తి సామర్థ్యము గుర్తించినవాడై సముద్ర లంఘనమునకు మహేంద్రగిరినుండి ఉపక్రమించెను. మార్గ మధ్యమున సురసను జయించి, మైనాకుని స్పృశించి, సింహికను హతమార్చి లంకయందు అడుగిడెను. అచట లంకిణిని జయించి లంకా పట్టణమంతా సీతకై వెతికెను. ఎట్టకేలకు అశోకవనమందు సీతను చూచెను. అంతట రావణుడు భార్యా సమేతుడై సీతవద్దకు వచ్చి అనేక విధముల బెదిరించి తన వాంఛ రెండు నెలలలో తీరకపోయిన పక్షమున ఆమెను సంహరించెదనని చెప్పి వెడలిపోయెను. అంతట ఆంజనేయుడు మెల్లగా సీతాదేవికి రామకథా శ్రవణంబు గావించి మనసునకు ఊరట గల్గించి తనమీద నమ్మిక కల్గుటకై రాముడు ఆనవాలుగా ఇచ్చిన అంగుళీయకమును సమర్పించెను. అంతట జానకీదేవి బ్రహ్మానంద పరవశయై తన శిరోమణిని ఆనవాలుగా ఇచ్చుచూ ఎటులైననూ రామచంద్రుడు ఒక నెల వ్యవధిలో రావణుని సంహరింపకున్న తన మరణము తథ్యమని నుడివెను అంతట వాయుపుత్రుడు ఆమెను అనేక విధముల నోదార్చి భయ పడ వలదని చెప్పెను.

రాక్షసులకు తన ప్రతాపము ఎఱుకపరప దలచి రావణునకు హితబోధ చేయదలచి ఆంజనేయుడు అశోక వనమును నాశనము చేయ దొడగెను. అంతట రావణుని పనుపున అనేక మంది రాక్షసమూకలు హనుమంతునెదుర్కొని హతులైరి. తద

నంతరము ప్రహస్తుని కుమారుడైన జంబుమాలి, మహావీరులైన రావణుని సేనానాయకులు ఐదుగురు, రావణుని చిన్న కుమారుడగు అక్షుడు మొదలుగా గల అనేకమంది రాక్షసవీరులు హనుమంతుని నెదుర్కొని అతని ధాటికోర్వలేక యుద్ధములో మరణించిరి. అంత ఇంద్రజిత్తుని రావణుడు పంపగా వారిరువురి మధ్య ప్రచండమైన యుద్ధము జరిగినది. ఎట్టకేలకు ఇంద్రజిత్తు హనుమంతునిపై బ్రహ్మాస్త్ర ప్రయోగము చేయగా దానికి ఒక ముహూర్తముసేపు మాత్రమే బంధింపబడి ఉండవలసినవాడని గుర్తించి చేష్టలుడిగి పరుండెను. అంతట రాక్షసవీరులు వానిని త్రాళ్ళతో బంధింప వాయుసూనుడు బ్రహ్మాస్త్ర బంధము నొందినవాడయ్యెను. రాక్షసులు వాయుపుత్రుని రావణుని సన్నిధికి గొనిపోయిరి. అంతట ఆంజనేయుడు రావణునికి తగిన హితబోధ జేసి రాముని ప్రతాపమును ఎఱుకపరచెను. కాని రావణుడు ఆ హితబోధను తిరస్కరించి హనుమంతుని తోకకు నిప్పు పెట్టమని ఆజ్ఞాపించెను. అంతట ఆంజనేయస్వామి సీతాదేవి మహిమవలన అగ్నిచే తన తోకకు ఎట్టి హాని కలుగక పోగా ఆ మండుతున్న తోకతో లంకాపురినంతటను దగ్ధము గావించెను. తదనంతరము సీతాదేవి కడకేగి ఆమె సెలవు తీసికొని తిరిగి వానర బృందమును చేరి రామునకు ఈ శుభ వర్తమానము ఎఱిగించెను. ఇదియే సుందరకాండ సారాంశము.

హనుమంతుడు తదనంతరము చేసిన అద్భుత సాహసము లెన్నియో గలవు. వాటి నన్నిటినీ ఇచట ప్రస్తావించుట లేదు. కాని వాయుపుత్రుని రామభక్తి వైశిష్ట్యమును తెలుపు మరియొక సందర్భమును నేను చెప్పవలసియున్నది.

రామపట్టాభిషేక సమయమందు రాముడు తనకు సహాయము చేసిన సుగ్రీవాది ప్రముఖులకు అనేక బహుమానము లొసంగెను. తరువాత తన కంఠమునుండి ఒక విలువైన మణి హారమును తీసి జానకీదేవికిచ్చి దానిని తనకత్యంత ప్రియ పాత్రున కొసంగమని చెప్పెను. అంతట జానకీదేవి ఆద్దానిని వాయుపుత్రుని కొసగగా వాయుపుత్రుడు హారమందున్న ఒక్కొక్క మణినీ పెలికితీసి పరీక్షించి పారవేయ నారంభించెను. సభవారంతా నిశ్చేష్టులైరి. జానకీదేవి తాను అమితాదరముతో నొసగిన మణిహారమును అంజనేయుడు ఈ విధముగా జేయుట జూచి ఆశ్చర్యమంది వాయుపుత్రుని ప్రశ్నింపగా, అంజనేయుడు తన హృదయమును చీల్చి అందున్న సీతారాములను ఆమెకు కనపరిచి, సీతారాములే స్వయముగా తన హృదయ పీఠమును అలంకరింపగా వేరు అలంకరణలు తనకేల? యని నుడివెను.

వేంకట: ఆంజనేయ స్వామిని గొప్ప సంగీతవేత్తగా కూడ చెప్పుకొంటారు.

త్యాగ: ఆంజనేయస్వామి నిరంతర నాదోపాసనాపరుడు. "నాద తను మనిశం-శంకరం నమామి హే మనసా శిరసా" అని నాద స్వరూపుడైన ఆ శ్రీరామచంద్రుని సచ్చరిత్రమును నిరంతరము గానము చేయుచుండెడివాడు. ఒకపరి నారద, తుంబురుల మధ్య ఎవరు గొప్పవారు అన్న సంశయము కల్గినది. అప్పుడు వారిరువురూ సరస్వతీదేవి కడకేగి తామిద్దరిలో ఎవరు శ్రేష్ఠమైన గాయకులో వివరింపవలసినదిగా కోరగా ఆమె వారిని శ్రీ ఆంజనేయస్వామి కడకు పంపెను. అంత

ఆంజనేయస్వామి హనుమత్తోడి రాగాలాపన చేసి పరిసరమం దున్న జల ప్రవాహమును స్తంభింపజేసి ఆ జలమును ఘనీభ వింపజేసెను. నారద, తుంబురులను దానిని తిరిగి యథా పూర్వస్థితికి వారి గాన వైదుష్యముతో సాధించమని కోరెను. వారిరువురు ఎంత ప్రయత్నించిననూ అది ఘన పదార్థముగానే నిలిచిపోయినది. అంత వారు తమ అసమర్థతకు లజ్జాక్రాంతులై పశ్చాత్తాపము జెంద, ఆంజనేయస్వామి తిరిగి "తోయవేగ వాహిని" రాగమును బాడి ఆ ఘన పదార్థమును యథా పూర్వ ముగా జలప్రవాహ మొనరించెను. ఎంతటి మహానుభావులకైనా అహంకారము తగదని హితబోధచేసి వారల పంపివైచెను.

కావున ఆంజనేయస్వామి రామభక్తాగ్రగణ్యుడే కాక సంగీతమందు "హనుమత్తోడి" వంటి రాగాలను సృష్టించిన మహానుభావుడు.

శ్లో॥ అసాధ్య సాధకస్వామిన్-అసాధ్యం తవకిం వద
రామదూత కృపాసింధో-మత్కార్యం సాధయ ప్రభో॥
శ్లో॥ శ్రీరామ హృదయానందం-భక్తకల్ప మహీరుహం
అభయం వరదం దోర్భ్యాం-కలయే మారుతాత్మజం॥

గోపీ : ఆంజనేయస్వామి భక్తులకు కల్పతరువు వంటివాడు. వాని కరుణచే రామ దర్శనము తప్పక లభించును. తులసీ దాసులవారికి రామదర్శన భాగ్యము కలుగజేసినది ఆ మహ నీయుడే.

వేంకట : స్వామీ! తులసీదాసులవారి చరిత్ర సవివరముగా తెలుప ప్రార్థన.

## తులసీదాస చరిత్ర

గోపి : తులసీదాస స్వామినే నమః.

కళ్యాణిరాగం—ఆదితాళము.

1. శ్రీరామచంద్ర కృపాళో భజమనహరణ భవభయదారుణం
నవకంజ లోచన కంజముఖకర కంజ పదకంజారుణం
॥శ్రీరామ॥

2. కందర్ప అగణిత అమిత ఛబి నవనీల నీరద సుందరం
పటపీత మానహు తడిత రుచిశుచినేమి జనక సుతావరం
॥శ్రీరామ॥

3. భజు దీనబంధు దినేశదానవ దైత్యవంశ నికందనం
రఘునంద ఆనందకంద కోసలచంద దశరథ నందనం
॥శ్రీరామ॥

4. శిరముకుట కుండల తిలకధారు ఉదారు అంగ విభూషణం
ఆజానుభుజ శరచాపధర సంగ్రామ జిత ఖరదూషణం
॥శ్రీరామ॥

5. ఇతి వదతి తులసీదాస శంకర శేషముని మనరంజనం
మమ హృదయ కంజనివాస కురు కామాది ఖలదల గంజనం
॥శ్రీరామ॥

హస్తినాపుర ప్రాంతమందు ఆత్మారాముడు అను ఉత్తమ బ్రాహ్మణునకు తులసీదాసు జన్మించెను. వారు పారమార్థిక చింతతో ఎల్లప్పుడూ కాలక్షేపము చేయుచుండిరి. అక్బర్ పాదుషా కొలువునందు ఆత్మారాముడు, తులసీదాసు కలసి పురాణ కాలక్షేపము చేయుచుండెడివారు. యుక్త వయసు

రాగానే తులసీదాసునకు మాతాదేవి అను పేరు గల ఒక కన్యను ఇచ్చి వివాహము చేసిరి. అతడు ఆమెయందు విశేష అనురాగముతో వుండి ఆమె ఎడబాటును సహింప లేకుండెను. ఇట్లుండ ఒకసారి అక్బర్ పాదుషా ఆత్మారామునిని, తులసీదాసునిని, పురాణ కాలక్షేపమునకై అహ్వానించెను. అక్బర్ తులసీదాసు వాగమృతమునకు ఆకర్షింపబడిన వాడగుటచే వారిరువురినీ కొన్ని దినములు కొలువునందుంచుకొనెను. ఆ సమయమందు తులసీదాసునకు భార్య ఎడబాటు దుస్సహముగా వుండెను.

అత్తవారింటనున్న మాతాదేవి తన తల్లికి జబ్బు చేసినదని వర్తమానమందగా అత్తగారి అనుమతి పొంది తల్లిని జూడ పుట్టింటికి వెళ్ళెను. అక్బర్ పాదుషావద్ద సెలవు తీసుకొని తులసీదాసు భార్యను కలియవలెనను యుత్సుకతతో గృహోన్ముఖుడయ్యెను.

ఇంటికి రాగానే భార్య కనిపించకపోవుటచే ఆమెను తక్షణమే జూడగోరి చీకటిపడిననూ ఐదుక్రోసుల దూరముననున అత్తవారింటికి కాలినడకలో బయలుదేరెను. అర్ధరాత్రి సమయమున అత్తవారింటి తలుపులు తట్టగా ఎవరూ లోపలనుండి జవాబు ఈయలేదు. అపుడు ఆ ఇంటికి గల ఎత్తైన ప్రాకారము దాటి లోపలికి వెళ్ళవలెనని నిశ్చయించి గోడకు వ్రేలాడుచూ ఒక త్రాడువలె కనిపించు వస్తువును పట్టుకొని దాని సహాయముతో గోడనెక్కి భార్యవుండు గది చేరెను. అర్ధరాత్రి సమయమున భార్య అతనిని జూచి అతని బట్టలకున్న రక్తపు మరకలను జూచి అది ఏమిటని అడుగగా తులసీదాసు తను లోనికి వచ్చిన విధానమును చెప్పెను. అంత ఒక దీపము తీసుకొని

ఆ ప్రాకారము వద్దకు వెళ్ళి చూడగా ఒక నల్ల త్రాచుపాము మధ్యకు తెగి చచ్చి పడివున్నది. దైవకృపచే అది తులసీ దాసును కరువలేదు.

అంత మాతాదేవి తులసీదాసుయొక్క సాహస కృత్యము నకు మిగుల చింతించి నీటి బుడగవంటి తన శరీరముపై భ్రమ పడి క్షణిక సుఖమును ఆశించి మూఢుడివలె ప్రవర్తించుట కంటె తన శరీరమును ఈశ్వర సేవకు వినియోగించిన జన్మకు సాఫ ల్యము కలుగుననియు, ఇంద్రియ బలమున్నపుడే ఈశ్వరుని ఆరాధింపవలెనని ఉద్బోధించెను. భార్యచేసిన ఉపదేశమును వినగానే తులసీదాసునకు వైరాగ్యము కల్గి శ్రీరాముని దర్శించు వరకు ఇంటికి రానని శపథము చేసి గంగాతీరమునకు జనెను.

వారణాసి క్షేత్రమున గంగా తీరమున ఒక పెద్ద రావి చెట్టు క్రింద కూర్చొని నిత్యమూ రామనామ మంత్రము జపించి ఆ జప జలమును రావిచెట్టు మొదలులో పోయుచుండెను. ఆ రావిచెట్టు మీద ఒక బ్రహ్మరాక్షసి వసించుచు దాహ తాపముచే బాధపడుచుండెను. తులసీదాసు పోసిన రామనామ తీర్థ జల మును ఆ బ్రహ్మ రాక్షసుడు పండ్రెండేళ్ళు గ్రోలిన పిదప శాప విముక్తుడై తులసీదాసుకు నమస్కరించెను. అంత తులసీ దాసు అతని వృత్తాంతము తెలిసికొని తనయొక్క శ్రీరామ దర్శన దీక్షను తెలుపగా శాప విముక్తుడైన బ్రహ్మ రాక్షసుడు ఈ విధముగా చెప్పెను:

కాశీ పట్టణమందు తూర్పు భాగమున ఒక పేద బ్రాహ్మ

ణుడు కలడు. అతడు పరమ నిష్ఠాగరిష్ఠుడు. ఉత్తమోత్త ముడు. రామభక్తుడు. వాని ఇంట అనుదినము శ్రీరామ చరిత్రము పురాణము చెప్పబడుచుండును. ఆ పురాణము విను టకు అనేకమంది పురజనులు వచ్చుచుందురు. అందులో ఒక ముదుసలి బ్రాహ్మణుడు పురాణము ప్రారంభించుటకు ముం దుగా వచ్చి పురాణము పూర్తి అయ్యేంతవరకూ ఉండి చివరికి మంగళహారతి గైకొని పోవుచుండును. అతడు ఆ పురాణము చెప్పు బ్రాహ్మణునకు కుడిభాగమున వుండును. ఎట్టి ఆటంక మున్ననూ అతడు పురాణ శ్రవణమునకు తప్పక వచ్చును. అతడే ఆంజనేయుడు. వానిని నీవాశ్రయించినచో నీకు తప్పక రామ దర్శనము లభించునని చెప్పి తాను శాప విమోచనము పొంది వెడలిపోయెను.

బ్రహ్మరాక్షసుడు చెప్పిన విధముగా పురాణ శ్రవణము జరుగు బ్రాహ్మణుని ఇంటికి జని ముసలి బ్రాహ్మణుడి రూపంలో వున్న ఆంజనేయస్వామిని తదేకదృష్టితో చూచుచూ కూర్చొనెను. మంగళహారతి అనంతరం ముసలి బ్రాహ్మణుని తులసీదాసు వెంబడించుచూ అరణ్య ప్రాంతము జేరెను. అటునుండి ముసలి బ్రాహ్మణుడు వేవేగముగా పోవ తులసీదాసు వాని పాదము లకు అడ్డుగా పడి దీనుడై ప్రార్థించెను. కొంతసేపటికి ఆంజ నేయస్వామి తులసీదాసు మనోగతంబెరిగి రామ దర్శనానంత రము రామతారక మంత్రము ఉపదేశించెదనని చెప్పి అంత వరకు అక్కడ ఉన్న ఆశ్రమములో ఉండి రామనామము జపించమని చెప్పి ఆంజనేయుడు అదృశ్యుడయ్యెను. తులసీ దాసు ఆంజనేయుడు చెప్పినట్లుగా రామనామము జపించుచూ

దినములు వెళ్ళబుచ్చుచుండెను. కొంతకాలము పిదప ఆంజనేయస్వామి ప్రార్థన స్వీకరించి రామలక్ష్మణులు ధనుస్సులు ధరించి మహమ్మదీయ ప్రభువుల వేషములు ధరించి సైన్య సమేతముగా తులసీదాసు ఆశ్రమ ప్రదేశమున ప్రవేశించిరి. వచ్చినవారు తురకలని వారిని గౌరవించక తులసీదాసు తన జపములో మునిగి వుండెను. కొంతకాలము అయిన తర్వాత తులసీదాసు పురాణ కాలక్షేపం విని తిరిగి వచ్చుచున్న ఆంజనేయస్వామిని దర్శించి రామ కటాక్షము ఎప్పుడు తనకు సంప్రాప్తమౌనని వేడుకొనగా ఆంజనేయస్వామి తురక ప్రభువుల వేషములో వచ్చినవారు రామలక్ష్మణులే అని చెప్పిరి. అంత తులసీదాసు రామలక్ష్మణుల దర్శనము వారి నిజ స్వరూపములో లభించునంతవరకూ తన దీక్ష మాననని చెప్పి ఆంజనేయ స్వామిని రామతారక మంత్రమును ఉపదేశించమని పట్టు పట్టెను. ఆంజనేయుడు తులసీదాసు గత జన్మమున వాల్మీకి మహర్షి అని ఎరిగినవాడై వానికి తారకమంత్రము ఉపదేశించెను. పట్టుదలతో తారక మంత్రం జపించుచూ శ్రీరాముని ధ్యానించుచూ తనని మోసము చేయకుండా నిజ రూపమున దర్శనమీయుమని ప్రార్థించెను. కొంతకాలమైన పిదప ఆంజనేయస్వామి అభ్యర్థనను మన్నించి రామచంద్రుడు సీతాలక్ష్మణ సమేతుడై దివ్యకాంతులు వెదజల్లుచూ తులసీదాసుకు దర్శన మొసంగెను. అంతట తులసీదాసు ఒడలు మైమరచి అనేక విధముల రాముని స్తోత్రము చేయగా శ్రీ రామ చంద్రుడు ప్రసన్నుడై తులసీదాసును రామాయణమును వ్రాయుమని ఆజ్ఞాపించెను. అందుకు కావలసిన విజ్ఞానమును ప్రసాదించెను.

వానప్రస్థము స్వీకరించి తన్ భార్యతో శేష జీవితమును వెళ్ళ బుచ్చుచూ తాను రచించిన రామాయణమునందలి భాగములను ఆమెకు వినిపించి ఆమెను సంతోషపరచుచుండెను. ఎల్లవేళల యందు తనకు అండగా నిలిచి సహాయము చేతునని వాగ్దాన మిచ్చి శ్రీరామచంద్రుడు అదృశ్యుడయ్యెను. తదనంతరం భార్యకు వర్తమానమిడి వానప్రస్థ జీవితమును వెళ్ళబుచ్చుచూ రామాయణం వ్రాయుచూ నిరంతర రామనామ గానముతో జీవితమును వెళ్ళబుచ్చుచుండెను.

ఇట్లుండ వారి ఆశ్రమము కొంత కాలమునకు ప్రఖ్యాతి వహించి ధన కనక వస్తు వాహనములతో నిండి అనేకమంది భక్తులకు ఆశ్రయమిచ్చుచుండెను. ఒకనాడు కొందరు చోరులు ఆశ్రమంలో విలువగల వస్తువులను దొంగలింపవలెనని కాచుకొని యుండిరి. అంత రామలక్ష్మణులు ధనుర్ధారులై ఆశ్రమమును కావలి కాయజొచ్చిరి. వారిని దాటి లోన ప్రవేశించుటకు చోరులకు సాధ్యపడలేదు. మరునాడు వారు తులసీదాసు కాళ్ళమీద పడి తమను రక్షింపమని వేడుకొనిరి. అంత తులసీ దాసు ఈ ఆశ్రమము, ఇందులోని వస్తువులు అన్నీ శ్రీరామచం ద్రునివని చెప్పి చోరులను యధేచ్ఛగా వారికి కావలసిన వస్తు వులను తీసుకుపొమ్మని చెప్పెను. అంతట వారు రామభక్తికి మించిన మరొక ధనము లేదని ఎంచి తులసీదాసుకు ముఖ్య శిష్యులుగా మారిపోయిరి.

ఒకనాడు తులసీదాసు ఇంటివద్ద సాధు సమారాధన జరుగుచుండగా ఒక మహా పాపాత్ముడు "సీతా రామాభ్యాం

నమః" అని పంక్తియందు కూర్చుండెను. మిగిలినవారు వాడు మహా పాపాత్ముడని, వానిని గెంటివేయమని చెప్పగా రామ నామోచ్చారణ వలన వాని పాపము లన్నియూ నశించెనని చెప్పెను. అందుకు వారు నిదర్శనం చూపమనగా మర్నాడు విశ్వేశ్వరాలయమునకు సాధువులందరినీ రమ్మని చెప్పెను. అంత విశ్వేశ్వరాలయంలో భోజనపాత్ర నిండా భోజన పదార్థము లుంచి రామ మంత్రోచ్చారణ వలన ఆ పాపాత్ముని పాపములు నశించినట్లైన శిలా రూపమున వున్న నందీశ్వరుడు భోజన పదార్థములను భుజింపవలయుననీ చెప్పి రామతారక మంత్రము పఠించుచూ రాముని ధ్యానించెను. అంత ప్రజలు ఆశ్చర్యపడునట్లుగా శిలా రూపమున వున్న నందీశ్వరుడు కదలి పాత్రయందలి భోజన పదార్థములను భుజించి నిజ స్థానమునకు జనెను. అంత ప్రజలెల్లరూ రామనామ మంత్రము యొక్క మహిమను ఎఱిగినవారై తులసీదాసును అనేకవిధముల కొనియాడిరి.

ఒకనాడు ధనవంతుడగు వైశ్యుడొకడు మరణించెను. అతనిని బ్రతికింప ఉపాయం తోచలేదు. బంధువులు అతనిని శ్మశానమునకు గొనిపోయిరి. వైశ్యుని భార్య తులసీదాసు మహిమలు విన్నదై తిన్నగా తులసీదాసు ఆశ్రమమునకు వచ్చి సాష్టాంగపడెను. అంత తులసీదాసు ఆమెను "దీర్ఘ సుమంగళీ భవ" అని ఆశీర్వదించెను. జరిగిన వృత్తాంత మంతయూ వైశ్యుడి భార్య చెప్పగా తులసీదాసు తన మాట వ్యర్థం కాజాల దని చెప్పి ఆమెను రామనామ జపము చేయుచుండమని చెప్పెను, తాను రాముని మనస్సులో స్మరించుచూ నిశ్చింతతో

వుండెను. అంత స్మశానమునకు కొనిపోబడిన వైశ్యుడు కట్లు తెంచుకొని కూర్చొని ఇట్లు చెప్పదొడంగెను.

తాను చనిపోగానే ఇద్దరు యమకింకరులు అగమ్యమగు మార్గముగుండా తనను తీసుకొనిపోవుచుండ ఇద్దరు మహా పురుషులు అక్కడికి వచ్చి అంజనేయుడు చనిపోయినవానికి ఆయుర్ధాయం ఇచ్చెనని చెప్పచూ వానిని వదలమనిరి. అంత వారు ఆ మాటలను నిర్లక్ష్యం చేయుటచే ఒక పెనుగాలి దుమారం లేచి అందుండి గదాయుధం ధరించిన ఒక మహా వానరుడు వచ్చి వారిని తన్ని తనను విడిపించెను. వెంటనే నాకట్లు తెగిపోయినవి అని చెప్పెను.

తన భార్య ఈలోగా ఆత్మహత్యా ప్రయత్నం చేసుకొనునను భయంతో ఆమెను త్వరితంగా చూడగోరెను. వెంటనే ఆమె తులసీదాసు ఆశ్రమంలో ఉన్నదని విన్నవాడై తులసీదాసు ఆశ్రమమునకు పోయి ఆమెను జూచెను. అంత ఆ పుణ్య దంపతులిరువురూ తులసీదాసునకు నమస్కరించి ఆంజనేయుని మహిమలను మిక్కిలి కొనియాడి సీ తా రా మ ల క్ష్మ ణు లు అంజనేయస్వామి నిరంతరము తులసీదాసుకు అండగా వుండుటచే అతడు మహా మహితాత్ముడని వేనోళ్ళ కొనియాడిరి.

క్రమంగా తులసీదాసు మహిమలు అక్బర్ పాదుషా చెవిని కూడ పడెను. తన కొలువునందున్న ఆత్మారాముని కొడుకు అంత గొప్పవాడయ్యెనని మిక్కిలి ఆనందించి వానిని సగౌరవముగా రాజ దర్బారునకు రప్పించమని రాజభటులను,

రథమును పంపెను - అంత తులసీదాసు అక్బర్ పాదుషా కోరికను మన్నించినవాడై హస్తినాపురంలోని అక్బర్ పాదుషా దర్బారునకు వెళ్ళెను. అంత అక్బర్ పాదుషా తులసీదాసుని అనేక విధముల మెచ్చుకొని తన మహిమచే శ్రీరామచంద్రుని దర్శనము తనకు కలుగజేయుమని ప్రార్థించెను. అంత తులసీదాసు ఆ విషయమును ఆంజనేయస్వామికి విన్నవించగా, అక్బర్ పాదుషాకు శ్రీరామదర్శన యోగ్యత లేదనియు అతనికి స్వప్న సాక్షాత్కారమే కలుగగలదని చెప్పి ఈ విషయమై విచారింపవలదని చెప్పెను. మరునాడు ఒక వానర సమూహమును హస్తినాపురమునకు పంపెను. అవి హస్తినాపురమందలి సమస్తమును ధ్వంసము చేయుచుండగా పురప్రజలు ఆ బాధ భరింపజాలక పాదుషాతో మొరబెట్టుకొనిరి. అంత అక్బర్ పాదుషా తులసీదాసు వద్దకు పోయి ఈ హఠాత్పరిణామమునకు కారణమడుగగా తులసీదాసు శ్రీరామచంద్రుడు సైన్య సమేతుడై వస్తున్నాడనియు, అందుకు ముందుగా ఒక దండును పంపెనని చెప్పెను. ఈ వానరదండు ఇక్కడ పరిస్థితులను ప్రభువుకు నివేదించిన తరువాత శ్రీరామచంద్రుడు ఇంతకు సహస్రాధికమైన సైన్యముతో గూడిన 18 వానర సేనలతో హస్తినాపురమునకు వచ్చునని చెప్పెను. అంత అక్బర్ పాదుషా బెంబేలు జెంది శ్రీరామచంద్రుని సైన్య సమేతముగా తాను భరింపజాలనని ఒక్క శ్రీరాముని దర్శనం మాత్రమే తనకు చేయించమని చెప్పెను - అంత తులసీదాసు, శ్రీరామచంద్రుడంతటి మహానుభావుడు రాజదర్శనము చేయునప్పుడు ఒక్కడూ రాజాలడనియు అది రాచ మర్యాదలకు విరుద్ధమని

చెప్పెను. అంగీకరించినచో తనకు స్వప్న సాక్షాత్కార భాగ్యమును కలిగింతునని చెప్పెను. అందుకు అక్బర్ పాదుషా అంగీకరించెను. ఆ మరునాడు అక్బర్ శుచియై శ్రీరామ దర్శనమపేక్షించుచుండగ అర్ధ రాత్రమున ఒక దివ్య తేజస్సు గోచరించి అంతర్ధానమయ్యెను. అంత అక్బర్ పాదుషా తులసీదాసుని ఎంతో మెచ్చుకొని తన గురువర్యునిగా స్వీకరించి ఆరాధించెను.

ఆ రోజులలో ప్రియా దాసుడు అను సంస్కృత పండితుడు మహాభక్తుల చరిత్రము వ్రాయుచుండెను. అందు తులసీ దాసు చరిత్రను చేర్చలేదు. అంత శ్రీరామచంద్రుడే స్వయముగా స్వహస్తములతో తులసీదాసు చరిత్రను అందు లిఖించగా ప్రియాదాసుడు ఆశ్చెరు వొంది తులసీదాసుకీ విషయమెఱిగించి వానిని మిక్కిలి గౌరవించెను.

తులసీదాస రామాయణము పఠించి ఆయనచే రచింపబడిన "హనుమాన్ చాలీసా" పారాయణ చేయువారికి శ్రీరామ, హనుమత్ప్రభువుల కటాక్షము నిస్సంశయముగా లభించును.

వేంకట : ఆంజనేయస్వామి కృపచే రామ దర్శన భాగ్యం పొందిన మఱియొక మహనీయుడు "సమర్ధ రామదాస్" అని విన్నాను. వారి చరిత్ర గూడ వివరముగా తెలిపి మమ్ములను కృతార్థులను జేయ ప్రార్థిస్తున్నాను.

గోపీనాథ్ : చక్కని విషయం అడిగారు. ఆ మహనీయుల సంస్మరణ శుభప్రదము.

# సమర్థ రామదాస్ చరిత్ర

పూర్వము గంగాతీరమున "జాంబా" అను గ్రామమందు సూర్యాజీపంత్ రాణూభాయ్ అను ఉత్తమ బ్రాహ్మణ దంపతులుండెడివారు. వారికి శ్రీరామ నవమినాడు ఒక భక్తుడగు కుమారుడు జన్మించెను. వానిని వారు 'రామదాసు' అని పిలువసాగిరి. రామదాసు చిన్నప్పటి నుండి రామనామ జపముతో బాటు రామనామ గానము చేయుచు గానముతో బాటు నృత్యము గూడ సాగించుచూ తన్మయత్వముతో శ్రీరాముని కీర్తించెడివాడు. అతని తోడి బాలులందరూ అతనితో గూడ గానము చేయుచు నాట్యము చేయుచుండగా ఆ వూరి ప్రజలందరూ కన్నుల పండుగగా జూచెడివారు. ఇట్లుండ రామదాసునకు ఉపనయనము జరిగినదాదిగా వేద వేదాంగములు నేర్చుకొని తత్వ రహస్యము లెఱింగి సంసార బాధలనుండి తప్పింపగల్గేది ఒక్క తారకమంత్రము మాత్రమే అని గ్రహించెను.

అతనికి యుక్తవయసు రాగానే అనుకూలవతియగు నొక కన్యను తీసుకువచ్చి వివాహము చేయ తల్లిదండ్రులు నిశ్చయించిరి. వివాహ మహోత్సవము శోభాయమానంగా జరుగుచున్నది. అంత బ్రాహ్మణులు మంత్రములు పఠించుచుండగా ఆ మంత్రార్థము లెఱిగిన రామదాసస్వామి ఆ మంత్రముల కర్థము తాను పెండ్లాడబోవు భార్యను పోషించవలసిన బాధ్యత, ఆమెకు ఎట్టి కష్టము రాకుండా చూడవలసిన బాధ్యత తాను స్వీకరించుటయే కదా యని చెప్పి తాను అందుకు సిద్ధముగా లేనని ఆ పెండ్లి పీటలమీద నుండి ఎవరికీ తెలియని ప్రదేశము

నకు వెడలిపోయెను. తల్లి దండ్రులు వెతికివెతికి తుదకు వివాహ ప్రయత్నమును విరమించుకొనిరి.

అంత రామదాసు అరణ్యంలో ఒక రహస్య స్థావరమేర్పరుచుకొని పారమార్థిక చింతతో కాలమును వెళ్ళబుచ్చుచుండెను. ఆ మహారణ్యములో తనివితీర బిగ్గరగా దిక్కులు పిక్కటిల్లునట్లు రామనామ గానము చేయుచు తన్మయత్వం జెందేవాడు. ఆ అరణ్యమందలి క్రూరమృగములు తదితర జంతువులు అతని ఆశ్రమమునకు వచ్చి వారి గానం వింటూ వుండెడివి.

ఒకనాడు ఆంజనేయస్వామి వికృతరూపంలో రామదాసునకు దర్శనమిచ్చెను. ఆ వచ్చినవాడు ఆంజనేయస్వామి యని తారకమంత్రి మహిమవలన ఎఱిగినవాడై వానిని అనేకవిధముల స్తోత్రము చేసి ఆంజనేయ స్వామిని నిజ రూపంలో దర్శనమిమ్మని ప్రార్థించెను. అంత ఆంజనేయస్వామి సంతుష్టుడై నిజరూపంలో దర్శనమిచ్చి వాని రామనామ గానమునకు తాను ముగ్ధుడై ఇటు వచ్చితినని చెప్పి శ్రీరామ కటాక్షము అతనికి త్వరలో కలుగనున్నదని చెప్పి అంతర్ధానమయ్యెను-నాటినుండి రామదాసు రామనామ సంకీర్తనము ద్విగుణీకృతోత్సాహముతో సాగించుచూ శ్రీరామాంకితముగా "తత్వమానస బోధ" అను మహత్తరమైన ఒక గ్రంథమును రచించెను. అందు శ్రోత, ఉపదేష్ట, సభికుడు, సర్వము మనస్సుగా నిశ్చయించి వ్రాయబడినది. నిత్యము రామదాసకృత 'మానసబోధ' పఠించువారికి శ్రీరామ సద్భక్తి కలిగి గురు శుశ్రూష చేయనక్కర లేకుండా మానసిక తత్వం పెరుగును.

ఇట్లు చాలాకాలం రామదాసు ఏకాంతవాసములో జీవనము సాగించిన పిదప ఒకనాడు ఆ దారిన పండరి క్షేత్రమునకు పోవు భక్త బృందము పాండురంగ నామ సంకీర్తనము జేయుచూ ఆ దారిన పోవుచుండిరి. రామదాసు పండరినాథుని దర్శించ గోరి మిగిలినవారితో పొత్తు కలియక తాను వేరుగా రామ నామము గానము చేయుచూ పండరి క్షేత్రము పోదొడంగెను. మార్గమధ్యమున హనుమంతుడు దర్శనమిచ్చి పండరి క్షేత్ర మున రామదర్శనం లభించునని చెప్పి అంతర్ధానమయ్యెను. రామదాసు పండరి క్షేత్రము చేరి 'చంద్రభాగా' నదియందు స్నానము చేసి రామ దర్శన కుతూహలముతో పాండురంగ స్వామి దేవాలయమందు ప్రవేశించెను. అంత ఆలయ మందున్న పాండురంగస్వామి తన మనస్సున ఊహించుకొనుచున్న కోదండ రామునికి సమానముగా లేదని చూచి మిక్కిలి వ్యధతో, హనుమంతుడు తనకు రామదర్శనమగునని చెప్పగా పాండు రంగని దర్శన మగుచున్నదని చింతించుచుండెను. అతని మనోగతం తెలిసినవాడై పాండురంగడు రామదాసుకు కోదండ రాముని రూపములో దర్శనమీయగా రామదాసు పులకితాంగుడై శ్రీరామచంద్రుని అనేక విధముల స్తోత్రము చేసెను. అంత శ్రీరామచంద్రుడు వానికి అభయమొసంగి రామభక్తిని ప్రచారము గావించమని చెప్పి తిరిగి యధా రూపమును పొంది పాండురంగ విఠలునిగా మారిపోయెను.

ఆ కాలములో మహారాష్ట్ర రాజ్యమును శివాజీ పాలించు చుండెను. బాల్యము నుండియు భారత, రామాయణ గాథలు విన్న శివాజీ హిందూ ధర్మమును పాటించుచూ తన రాజ్య

మును రామరాజ్యముగా పాలించుచుండెను. రామదాసస్వామి పండరి క్షేత్రమునుండి తిరిగి వచ్చుచుండగా శివాజీ వానికి కన పడెను. రామదాసు కీర్తి, మహిమలు విన్న శివాజీ తక్షణమే గుఱ్ఱము దిగి సాష్టాంగ మొనరించి అతని శిష్యునిగా సేవ చేయుచూ గురువుల అనుజ్ఞతో "సజ్జనగడ" అను కోట సమీప మున చక్కని ఆశ్రమ మేర్పరిచి ప్రతి గురువారము గురు దర్శనము చేయుచూ వారి బోధామృతము వినుచుండెను. ఒకనాడు రామదాసస్వామి శివాజీ త్యాగశీలత పరీక్షించ నెంచి ఒక జోలెను భుజానికి తగిలించుకొని కోటలో సభతీర్చిన శివాజీ దగ్గరకు తిన్నగా వెళ్ళెను. వెంటనే శివాజీ సింహాసనము దిగి గురువునకు సాష్టాంగపడి జోలెతో వచ్చిన గురువునకు ఏమి భిక్ష వేయవలెనని ఆలోచించెను. వెంటనే ఒక పత్రము వ్రాసి దానిపై రాజముద్ర వేసి ఆ పత్రమును జోలెయందుంచెను. అందు ఇట్లు వ్రాయబడి యున్నది:

"శ్రీ గురూజీ మహరాజునకు శిష్యుడు వినయ పూర్వక ముగా సమర్పించుకొన్న పత్రము. ఈనాడు రాజసభలోకి శిష్యునియందనుగ్రహించి జోలె ధరించి వచ్చిన గురుస్వామికి నా వందనములు. మహావాత్సల్యముతో వేంచేసిన గురూజీకి నేను దాసుడను. అందుచే నేటినుండి గురూజీకి రాజ్య మర్పిం చడమైనది. సర్వ కార్య భారములు గురువర్యులే నడిపించు టకు అంగీకరించి ఈ పత్రమును సమర్పించితిని. శిష్య వాత్సల్యముతో దీనిని స్వీకరించ ప్రార్థిస్తున్నాను.

ఇట్లు మీ ప్రియ శిష్యుడు
శివాజీ.

అంత రామదాసస్వామి శివాజీ గురుభక్తికి సంతోషించి ఇట్లు ప్రశ్నించెను. రాజ్యమంతయూ గురువునకర్పించి నీవేమి చేతువని అడిగెను. అంత శివాజీ గురువర్యుని పూజించుచూ ఆయన చెంత సేవకునిగా వుందును. గురుసేవకన్న రాజ్య సేవ నాకు ఘనము కాదు. స్వామీ! మీరే ఈ రాజ్యాధికారి. తమదే ఈ సింహాసనము, రాజ్యము. దానిని ధర్మయుతముగా పాలింపుడని వినయముగా ప్రార్థించెను.

అంత రామదాసస్వామి తన శిష్యుని భక్తికి మెచ్చుకొని పత్రిమును తిరిగి ఇచ్చి తనకు మారుగా శివాజీనే రాజ్యమును పాలింపుమని చెప్పెను. అతని జండాను కాషాయరంగు గల దానినిగా మార్పించెను. జోహార్లు మాన్పించి "రామ్ రామ్" అన్నట్లు శాసనము చేయించెను. ఆ రాజ్యము తనది కాదనియు, భగవంతునిదనియు నమ్మి ధర్మశక్తితో రాజ్య పాలనము చేయుమని ఆజ్ఞాపించెను. శివాజీ పరమానందము చెంది గురు వాజ్ఞను పాటించుచూ రామరాజ్యముగా రాజ్యమునేలెను.

రామదాసు తనకు అంత్యకాలము సమీపించినదని శిష్యులకు చెప్పగా వారు తమకు మార్గదర్శకము చేయకుండా తమను విడువవలదని కోరిరి. అంత తనకు మారుగా తనచే రచింపబడిన "దాసబోధ" చదివి వారు తమ సంశయములను నివృత్తి చేసుకొనవలసినదిగా చెప్పెను. భక్తులందరూ "జయ జయరాం, జయ జయరాం" అని రామ నామము మిన్నుముట్టునట్లుగా గానము చేయుచుండగా తన దేహమును చాలించెను.

వేంకట: రామభక్తిని సంపూర్ణముగా ఆస్వాదించి రామ కటాక్షము పొందిన మహాభక్తులు హిందువులే గాక, హైందవేతరులు కూడ అనేకులు గలరని విన్నాము.

గోపి: వారిలో ముఖ్యులు కబీర్‌దాసు. ఇతడు జన్మతః హిందువు అయినా మహమ్మదీయునిచే చేరదీయబడి మహమ్మదీయుడైనాడు.

వేంకట: వాని చరిత్ర గూడ జెప్పి రామభక్తి సామ్రాజ్యము యొక్క విలక్షణమును తెలియజెప్ప ప్రార్థన.

శ్యామశాస్త్రి: నేడు మహా పర్వదినము. మహాభక్తులైన తులసీదాసు, సమర్థ రామదాసు, కబీర్‌దాసుల చరిత్ర విని పునీతులమగుచున్నాము.

# కబీర్‌దాస్ చరిత్ర

కబీర్‌దాస ప్రభవే నమః

మోహనరాగం—ఆదితాళం.

భజరే రామనామ సుఖదాయీ ॥భజ॥

1. రామనామ్‌కే దో అక్షరమే—సబ్ సుఖ్ శాంతిమిలాయి ॥భజ॥

2. కహత కబీరా సునో భాయ్ సాధో—జ్యోతిమె జ్యోతి మిలాయీ ॥భజ॥

గోపి : పూర్వము గంగాతీరమున కాశీ పట్టణములో "తమాల్" అను పేరు గల ఒక మహమ్మదీయుడుండెడివాడు. అతడు బట్టలు నేసి వాటిని అమ్ముకొని ఆ ద్రవ్యముతో కుటుంబ పోషణ జరుపుకొనెడివాడు. ఒకరోజున గంగా ప్రవాహములో పడి ఒక శిశువు ఒక తొట్టెలో నుండి కొట్టుకొనివచ్చుట తమాల్ జూచి అందులో వున్న శిశువును గ్రహించి తమకు సంతానము లేనందున భగవంతుడు ఈ శిశువును ప్రసాదించెనని గృహమునకు కొనిపోయిరి. వారు ఆ కుమారునికి "కబీరు" అని నామకరణము చేసిరి. కబీరు మాటలు నేర్చుకొన్నది మొదలు రామనామము పలుకసాగెను. ప్రజలు మహమ్మదీయుడు రామనామోచ్చారణ చేయుటను వింతగా జూడసాగిరి. వయస్సు వచ్చిన వెంటనే కబీరుని ఒక గృహస్థునిగా చేసిరి. కబీరు మొదటి నుండి రామభక్తి తత్పరుడగుటచే సంసారమందు శ్రద్ధ వహించక ఎల్లవేళలా రామభజనలు చేయుచుండెను. తండ్రి బలవంతము మీద సంసార పోషణకై కులవృత్తియగు నేతపనిని చేపట్టెను. అతడు ఏ పని చేయుచున్ననూ రాముని మీదనే ధ్యానము నిలుపుచుండెను ఒక్కొక్కప్పుడు సమాధి స్థితిలో వుండి తన పనిని మరచిపోయినచో ఆ రాముడే స్వయముగా అతని పనిని పూర్తి చేయుచుండెడివాడు. ఇట్లు రామునిచే నేయబడిన వస్త్రములు మిక్కిలి ప్రకాశవంతములై అమితమైన ధర రాబట్టగా అది జూచి తన తండ్రి కుమారుడు గొప్ప పనివాడయ్యెనని సంతోషించుచుండెను. కొంత కాలమునకు కబీరునకు ఒక బికుమారుడు కల్గెను. అతనికి 'కమాలుడు' అని పేరు పెట్టెను అడ్డ తండ్రివలె రామభజనయందు ఆసక్తి కనబరుచుచూ

పెరిగి పెద్దవాడయ్యెను. ఒకనాడు కమాలుడు తనకు తీర్థాటనము చేయవలెనని అభిలాష వున్నదని తండ్రి అనుజ్ఞ వేడెను. కబీరు అందులకు సమ్మతించగా అతడు తీర్థాటనకై బయలుదేరెను.

మార్గ మధ్యమున అనేకులు వీని సంకీర్తనము విని తన్మయులగుచూ వానివెంట భజన గోష్ఠులతో జనుచుండిరి. ఒకచోట "భీమరథి" నదీతీరమందు ఒక భక్తుడైన వర్తకుడు కమాల్‌దాసును భక్తులతో సహా తన ఇండికి గొనిపోయి మిక్కిలి గౌరవించి ఆనందముగా వారినందరినీ ఆదరించెను. వారికి విశేషముగా సన్మానములు జరిపి ఒక అమూల్యమగు రత్నమును బహుమతిగా ఇచ్చెను. కమాలుడు ఆ రత్నమును సంతోషముతో ఇంటికి తెచ్చి తన తండ్రికి ఒసగెను. కబీరు ఆ రత్నమును జూచి అసహ్యపడి రామనామమును అమ్మి మహా పాపము కట్టుకొన్నావని కొడుకుని నిందించెను. వెంటనే ఆ రత్నమును ఆ వర్తకుడికి తిరిగి ఇప్పించివేసెను. ఆ వర్తకుడు వీరి భక్తి తత్పరతకు ఆశ్చర్యపడెను. ఒకనాడు అర్ధరాత్రిమున నామదేవ జ్ఞానదేవులు కొందరు మహా భక్తులతో కబీరు గృహమునకు వచ్చిరి. అది చూచి కబీరుతో అతని భార్య వీరికి మనము విందు చేయవలెను. ఇంటికి వచ్చిన అతిథులు మహానుభావులనియు, మహా మహితాత్ములనియు చెప్పెను. కానీ ఇంట్లో ఏమియూ లేవు. ధనము లేదు. తండ్రి కుమారులు ఇద్దరూ దొంగతనం చేసి అయిననూ వస్తువులు సంపాదించవలెనని ఆలోచించి, తగిన పరికరములు కొని అంగడి వీధికి పోయి ఒక దుకాణమునకు కన్నము పెట్టిరి. కమాలు

అందు ప్రవేశించి సంభారములు ఈవలకు గెంటి తాను లోపల వుండెను. పని పూర్తి అయిన తరువాత ఇతర చోరులు ఇందులో ప్రవేశింతురని భావించి అక్కడ పండుకొని వున్న వర్తకుని వైపు వెళ్ళి, కన్నము నుండి పారిపోవ యత్నించెను. ఇంతలో ఆ వర్తకుడు లేచి కమాలుని పట్టుకొనెను. ఆ సమయమునకు అతడి శరీరం సగం ఈవలకు సగం లోనికి వుండిపోయెను. వర్తకుడు తనను ఆనవాలు పట్టినచో వీరు మోసపు భక్తులని ప్రజలు నిందించెదరని కమాలు తన తండ్రిని తన శిరస్సు వరికి నింద లేకుండ చేయమనగా కబీరు అతని శిరస్సు ఖండించి తన సామగ్రితో ఆ శిరస్సును గొనిపోయెను. భార్యతో జరిగిన వృత్తాంతమును సవిస్తరముగా చెప్పెను. పుత్ర వియోగముతో మిగుల బాధ నొందిననూ పరోపకారము నకై ప్రాణములర్పించిన తన కుమారుని మెచ్చుకొని దంపతులిరువురూ అతిథి పూజ చేసి సంతృప్తి నొందిరి. తెల్లవారిన తర్వాత కబీరు వారిని అంగడి వీధి వరకూ సాగనంపెను.

ఇంతలో రాత్రి దొంగతనము జరిగిన తర్వాత వర్తకుడు మొండెమును రాజుగారి వశమందుంచెను. రాజు ఆ మొండెమును ఒక శూలమునకు గ్రుచ్చి బజారు మధ్యన నిలబెట్టెను. ఆ మొండెము అతిథిపూజ గొన్న భాగవతులందరికీ చేతులెత్తి జోహార్లు చేయగా అది చూచి అందరూ ఆశ్చర్యపడిరి. నామదేవ, జ్ఞానదేవులు ఆ వింత చూసి దాని వృత్తాంత మడుగగా కబీరు అతిథిపూజకై ప్రాణములర్పించిన తన కుమారుని సాహస గాథను సవిస్తరముగా వారితో చెప్పెను. పరోపకారమునకై ప్రాణములు విడిచిన కమాలునందు ఆ మహాత్ములకు అమితమైన

దయ కలిగినది. వెంటనే కబీరు ఇంటనున్న కమాలు శిరసును తెప్పించి ఆ మొండెమున కతికించి జీవము పోసిరి. వెంటనే కమాలు నిద్ర మేల్కొన్న వానివలె లేచి తండ్రికి సాధువులకు నమస్కరించెను.

కొందరు కబీరును పరీక్ష చేయనెంచి పదివేలమంది సాధువులను కబీరు ఇంటికి పంపెను. కబీరు ఇంటి యందు ఆహార పదార్థములేవియూ లేవు. భార్యాభర్తలిరువురూ ఆలోచించుకొని వూరియందున్న పెద్ద శెట్టి దగ్గరకు పోయి ఆహార పదార్థములు సంపాదింపతలచిరి. కబీరు సాధువులను సేవించుచుండగా అతని భార్య పెద్ద శెట్టి ఇంటికి పోయి సాధు సమారాధనకు సరిపడు సామగ్రి ఇమ్మని ప్రార్థించెను. ఆమె వయసులో వుండుటచే శెట్టి ఆమెను పొందగోరి అందుకు ఇష్టపడినచో సామాన్లు ఇచ్చుటకు అంగీకరించెను. అంత ఆ ఇల్లాలు తన శరీరమును అతిథి పూజకై వినియోగింపదలచి భగవంతు నుద్దేశించి తన శరీరమును సాధు సమారాధనకు అమ్ముచున్నానని చెప్పి శెట్టి మాట కంగీకరించి సామగ్రిని కొనిపోయెను సాధు సమారాధన జరిపించి తనమాట ప్రకారము భర్త అంగీకారముతో శెట్టి ఇంటికి పోయెను. వర్తకుడు ఆమెయొక్క సౌందర్యమును జూచి ఆమెతో భోగింపనెంచెను. ఇంతలో శ్రీరాముడు గ్రామ రక్షకభటుని వేషములో తలుపు తట్టి ఇంట ప్రవేశించెను. వర్తకుడు గడగడలాడుచూ వడకగది తలుపు మూసివుంచగా, మారువేషంలో వున్న రాముడు అందు ప్రవేశించి కబీరు భార్యను జూచి నీవెందులకిక్కడ నుంటివని అడుగగా ఆమె జరిగిన సంగతి జెప్ప ఆ రక్షకభటుడు ఆ శెట్టిని కొరడాలతో కొట్టి

ఆమెకు నమస్కరింపజేసి తాను ఆమెను ఇంటికి జేర్చి [illegible]డయ్యెను. కబీరు ఇది విని గ్రామరక్షకుని ఇంటికి పోయి తన అభీష్టమునకు భిన్నముగా ఎందుకు వ్యవహరించితివని అడుగగా వాడు నేనేమీ ఎరుగనని వాపోయెను. అంత ఇదంతయూ శ్రీరాముని కార్యమని వర్తకుని ఇంటికడకేగి శ్రీరాముడు వాని ఇంటికి స్వయముగా వచ్చెనని చెప్పగా శెట్టి తన అపరాధమును గుర్తించినవాడై కబీరు దంపతులకు నమస్కరించి వారి ప్రధాన శిష్యుడై రామభజనలు చేయుచుండెను.

కొంతకాలము పిదప కబీరు కాశీ నగరములో వుండు రామానందుడను మహనీయుని వద్ద రామతారక మంత్రోపదేశము పొందదలచి వానిని శరణు వేడెను. అతడు మహమ్మదీయుడగుటచే రామానందుడు అందులకంగీకరింపలేదు. చివరకు ఒక ఆలోచన చేసి రామానందస్వామి స్నానమునకు పోవు మార్గమున ఒక గొయ్యి త్రవ్వి తలమాత్రము పైకి వుండునట్లు కుదుర్చుకొని యుండెను. తెల్లవారుఝామున రామానందస్వామి స్నానార్థమై ఆ దారిని పోవుచూ కబీరు శిరస్సును కాలతన్ని చీకటిలో ఎవరినో తన్నినానని "శ్రీరామ రామ" అని ఉచ్చరించెను. అంత కబీరు లేచి మహాత్మా! మీ పాదస్పర్శచే నా జన్మ పావనమైనది మీరు నాకు శ్రీరామ మంత్రముపదేశించిన గురువర్యులు. నన్ను దీవించుడు" అన కబీరులోని వినయాది సుగుణములకు రామానందుడు మెచ్చుకొనెను. తర్వాత కబీరు వీధుల వెంబడి తిరుగుచూ రామనామ కీర్తనలు చేయుచూ తాను రామానందుని శిష్యుడనని చెప్పుకొనుచుండ కొందరు బ్రాహ్మణులాగ్రహించి రామానందుని నిందిసిరి.

అంత రామానందుడు పదిమందిలో తన చెప్పు తీసుకొని కబీరు శిరస్సుపై కొట్టగా కబీరు "ఇంతమందిలో మీ పాద స్పర్శచే నా జన్మ ధన్యత గాంచినది" అని చెప్పుచూ "మీరే నా గురువు అనుటకు వీరందరూ సాక్ష్యులు గారా?" అని చెప్పెను. అంత రామానందుడు అతనిని కౌగలించుకొని తన శిష్యులలో ముఖ్యమైనవాడని ఆశీర్వదించెను.

ఇట్లుండ కబీరు భజనలు నిరంతరము సాగించుచూ గొప్పగా కొనియాడబడుచుండెను. ఇతనిని చూచి సహించలేని వారు కొందరు కబీరు పేరుతో భరత ఖండములోని వివిధ పుణ్య క్షేత్రములకు ఆహ్వాన పత్రములు పంపిరి. ఎల్ల మూలలనుండి అతిథులు రాజొచ్చిరి. లక్షలకొలది సాధువులు కబీరు గృహము వెదకుకొని వచ్చి వేరు వేరు విడుదులలో స్థిరనివాస మేర్పరుచుకొనిరి. కబీరు ఇదంతయూ జూచి ఆశ్చర్యము జెంది అట్టి భక్తుల దర్శనము చేత తన జన్మము పావనమైనదని శ్రీరామ నామము గానము చేయుచుండెను. అంత శ్రీరామచంద్రుడు తానే కబీరు రూపము ధరించి వివిధ స్థలముల నుండి వచ్చిన భక్త బృందములకు భోజనాది సత్కారములు జరిపి సంతోష పరచెను. ఈ విధముగా మూడురోజులు గడిచిన పిదప కబీరును తలవంపులు చేయదలచిన దుర్మార్గులు పశ్చాత్తాపనుంది వాని పాదములాశ్రయించిరి. అంత వారికి రామమంత్రోపదేశము చేసి ధన్యులను జేసెను.

మహాభక్తుల సందర్శనానుభూతిని "ఈలాగని వివరించలేనని" త్యాగరాజస్వామి చెప్పిన మాటకు దృష్టాంతముగా

కబీరు చరిత్రయందు, నామదేవ, జ్ఞానదేవులు కబీరు గృహము నకు వేంచేసినప్పుడు, వానికి అతిథి సత్కారములొనరించుటకై కబీరు తన పుత్రుని శిరస్సు ఖండించి తజ్జనిత మనః క్లేశమును కొంచెమైన ననుభవింపక వారిని సంతుష్టులను జేసిన విధము, ఇంకొక సందర్భములో తన భార్య శీలమును సహితము త్యాగము జేసి మహాభక్తులకు అతిథి సత్కారము లొనరించిన విధము, త్యాగరాజ స్వామివారి అభిప్రాయమునకు చక్కటి ఉదాహరణలు కాగలవు.

త్యాగ : కబీరు రామభక్తులలో అగ్రగణ్యుడు. వీరి అను గ్రహముచే మన కంచర్ల గోపన్న రామతారక మంత్రోపదేశము పొంది రామదాసుగా ప్రఖ్యాతి గాంచెను. ఈ సందర్భములో ఒక విచిత్ర సంఘటన జరిగెను.

ఒకనాడు గోపన్న కబీరును రామాలయమునకు తీసుకు వెళ్ళగా అక్కడ నున్న పూజారులు అతడు మహమ్మదీయు డగుటచే ఆలయ ప్రవేశమునకు అడ్డు తగిలిరి. కాని కబీరు ఏమియు చలించక ఆగ్రహము జెందక రామనామ సంకీర్తన జేయుచూ తన దారి బోదొడంగెను. అంత ఆలయములోని రామ విగ్రహములు మాయమై కబీరు వెంట బోసాగెను. అప్పుడు పూజారులు పశ్చాత్తాపము జెంది కబీరు కాళ్ళపై పడి క్షమాపణ చెప్పుకొని సీతారామ లక్ష్మణుల విగ్రహములు యథా స్థానమున నుండునట్లుగా చేయుమని ప్రార్థింప కబీరు ప్రస న్నుడై శ్రీరాముని ధ్యానింపగా విగ్రహములు పూర్వపు స్థల మందు నిలిచెను. తదనంతరము కబీరు గోపన్నను జూచి

"నీవు రామ నామమును నిరంతరము జపించుచుండుము. ఆ రామానుగ్రహము నీకు త్వరలో ప్రాప్తించి జీవన్ముక్తి పొందగలవు" అని చెప్పి తాను ఇతర పుణ్యక్షేత్రముల సందర్శనార్థమై వెడలిపోయెను.

గోపి : భద్రాచల రామదాసు అంటే మీరేనా?

త్యాగ : అవును.

గోపీనాథ్: ఈ సందర్భములో ఆ మహా భక్తుని సంస్మరణము గూడ వాంఛనీయము. వారి జీవిత సంగ్రహమును తెల్పి మా జన్మ ధన్యతజేయ ప్రార్థన.

## రామదాసు చరిత్ర

త్యాగ : రామదాసు పండ్రెండు సంవత్సరములు కారాగార వాస శిక్ష అనుభవించునప్పుడు వెల్లువలై ప్రవహించిన అతని ఆర్తి భక్తి సుధావాహినిగా ప్రవహించి అసంఖ్యాకములైన అమృత గుళికలవంటి కీర్తనలు వారి గరళము నుండి వెలువడినవి. ఆ ఆవేదనలో రామదాసు శ్రీరాముని కఠిన హృదయుడని నిందించెను. తనకు గల బిరుదులన్నియూ అబద్ధములనెను. సీతమ్మతో నీవైనా జెప్పవమ్మ అని మొరబెట్టెను. ఆ కీర్తనల శ్రవణము ఒడలు మైమరపింపజేయును.

గోపి : స్వామీ! వారి కీర్తననొకదానిని గానము చేసి మమ్ములను కృతార్థులను జేయుడు.

త్యాగ : అవశ్యము :

అసావేరి రాగము-చాపుతాళము.

పల్లవి : రామచంద్రులు నాపై చలము జేసినారు
సీతమ్మ జెప్పవమ్మా-నీవైన సీతమ్మ జెప్పవమ్మా ॥

అ॥ పల్లవి: కట కట! వినడేమిసేయుదు కఠినచిత్తుని మనసు
కరుగదు
కర్మములెటులుండునో కద! ధర్మమే నీకుండునమ్మ ॥

చరణము 1 : దిన దినము మీచుట్టు దీనతతో తిరుగ
దిక్కెవరోయమ్మ!
దీనపోషకుడనుచు వేడితి దిక్కులన్నియు ప్రకట
మాయెను
ఒక్కమాటైన అనడు ఎక్కులేమని తలతునమ్మా?

చరణము 2 : కౌసల్య తనయుడు కపటము జేసినాడు
కారణమేముండెనో?
కన్నడజేసెదవా? నీకన్నులపై భవముతోడ
విన్నవింపగదమ్మా-నీకన్న దిక్కెవరోయమ్మ!

చరణము 3 : దశరథాత్మజుడెంతొ దయశాలి యనుకొంటి
ధర్మహీనుడోయమ్మ-దాసజనులకు దాతయితడట
వాసిగ భద్రిగిరీశుడు-రామదాసునేల రాడట
రవికులాంబుధి సోముడట!

గోపి : ఆహా! ఏమి భావము! ఎంత మధురము! ఏమి సంగీతము! అద్భుతము! రామదాసు పండ్రెండు సంవత్సరముల కారాగారవాస శిక్ష ఎందుల కనుభవించవలసి వచ్చినది? వాని వృత్తాంతము వివరముగా తెలుప ప్రార్థన.

త్యాగ : రామదాసుకు పూర్వాశ్రమమందలి పేరు "గోపన్న". ఇంటిపేరు కంచర్లవారు. నేలకొండపల్లి కాపురస్థుడు. తండ్రి పేరు లింగనమంత్రి. తల్లి పేరు కామాంబ వీరిది ఆత్రేయస గోత్రము. నియోగి బ్రాహ్మణుడు. ఇతడు చిన్ననాటినుండియూ రామ భక్తుడై ఎల్లప్పుడూ రామకథా శ్రవణం బొనర్చుచూ శ్రీరామసేవ చేయుచుండెడివాడు.

భద్రాచలమందు వెలసిన సీతారాములవారి విగ్రహము లకు సరియగు ఆచ్ఛాదన లేక, పూజా పునస్కారములు లేక మరుగున పడి వుండగా తమ్మలదమ్మక్క అను భక్తురాలి స్వప్నమున శ్రీరామచంద్రుడు దర్శనమిచ్చి భద్రగిరినందు తానువున్న ఉనికిని తెలియజెప్పెను. అంతట ఆమె అచట ఒక ప్రదేశమున చెట్లు, తీగలు మొదలైనవాటిచే కప్పబడి వున్న సీతారామలక్ష్మణుల విగ్రహములను జూచి సంప్రోక్షణాది సమస్త కృత్యములనూ జరిపించి తన శక్తికొలది చిన్న మంటపమును కట్టించి ఆ గ్రామస్థుల సహాయము వలన బ్రహ్మోత్సవము మొదలగు ఉత్సవములను జరిపించుచుండెను.

రామదాసు భద్రాచలమందు శ్రీరామచంద్రుడు వెలసినాడని విని ఆ స్వామిని దర్శింప కొందరు భక్తులతో భద్రాచల

మేగెను. అక్కడ కొన్ని రోజులు స్వామిని సేవించి తన స్వగ్రామమునకు తిరిగి వచ్చుచూ భద్రాచలమందు స్థిర నివాసము కల్పించవలసినదిగా ఆ శ్రీరామచంద్రుని ప్రార్థించెను.

సంసార బాధ్యత నానాటికీ పెరగజొచ్చెను. గత్యంతరము లేక ఏదైనా ఉద్యోగము సంపాదింపనెంచెను. హైదరాబాద్ తానీషా వద్ద మంత్రులుగా వున్న తన మేనమామలైన అక్కన్న, మాదన్నగార్లను జూచి వారి సలహాపై తానీషాను దర్శించెను. అంత తానీషా రామదాసును భద్రాచలపు తహసిల్దార్‌గా నియమించెను. భద్రాచలమునకు వెళ్ళినది మొదలు గోపన్నయందు రామభక్తి ద్విగుణీకృతమై, నిత్య భజనలు, బ్రాహ్మణ సమారాధనలు వారి యింట తదేకముగా జరుగుచుండెడివి.

ఒకనాడు సంతర్పణ జరుగుచుండగా రామదాసుయొక్క ఏకైక పుత్రుడు రఘురాముడు గంజిగుంటయందు పడి మరణించెను. ఆ విషయమును గుప్తపరచి సమారాధన ముగియువరకూ భార్యాభర్తలిరువురూ మిక్కిలి ధైర్యముతో వచ్చిన అతిథులకు సంతృప్తిగా విందు భోజనములనొసంగిరి. తదనంతరము రామదాసు శ్రీరామచంద్రుని కడకేగి "కోదండ రామ కోదండరామ-నీ దండ నాకు నీవెందు బోకు" అను కీర్తనను గానము చేయుగా బాలుడు పునర్జీవితుడయ్యెను.

రామదాసు భద్రాచలము తహసీల్దారుగా వచ్చిన తరువాత సీతారామ లక్ష్మణులకు సరైన ఆలయము లేకపోయినందులకు

మిగుల వ్యధచెంది తనవద్ద నున్న సర్కారు పైకముతో ఆలయ పునర్నిర్మాణమునకు పూనుకొనెను. అట్టి తరి తనవద్ద నున్న ఆరులక్షల సర్కారు పైకమును ఖర్చుచేసి సీతారామ లక్ష్మణులకు ఆలయము కట్టించి ఎన్నో విలువైన ఆభరణములను చేయించి రామకైంకర్యము జేసెను.

ఈ సంగతి తానీషాకు తెలిసి రామదాసుని రావించి విచారింపగా అతడు సర్కారు పైకము ఖర్చుపెట్టినట్లు ధృవపడినది. పైకమును ఖర్చుపెట్టినందుకుగాను అతనికి పంన్రెండేండ్లు కఠిన కారాగారవాస శిక్ష విధింపబడినది. కారాగారమందు తానీషా సేవకులు రామదాసును అనేక విధములుగా హింసించిరి.

అంత అతిదీనుడై రామదాసు శ్రీరామచంద్రుని పరి పరి విధముల ఈ విధముగా ప్రార్థించెను.

"నమ్మినవారిని మోసముచేయుట న్యాయముగాదుర
నా తండ్రీ ....
"ఇక్ష్వాకుకుల తిలక ఇకనైనా బ్రోవవె రామచంద్రా! ....
"రక్షించు రక్షించు రక్షించు రక్షించు రామచంద్ర
నను శిక్షింపవచ్చిరి"

ఇట్లనేక విధముల ఆ శ్రీరాముని ప్రార్థించిన కీర్తనలు తెలుగు వాఙ్మయమందు, సంగీత సాహిత్యమందు అద్భుతమైన రచనలుగా భాసిల్లినవి.

అనేక విధముల భక్తుని బాధించుచుండ సీతమ్మవారు చూచి సహించలేక శ్రీరామునితో భక్తుని ఏల ఉపేక్షించుచున్నా

రని యడుగ అతని కర్మబంధము పరిసమాప్తి జెందుటకై వేచి యున్నానని చెప్పి ఇంక వెంటనే భక్తుని విడిపింతునని చెప్పి లక్ష్మణునితో బయలుదేరెను.

రామదాసు నిరాశజెంది జీవితము చాలించు నుద్దేశ్యముతో ఒక విష పాత్రను తన ముందుంచుకొని భగవంతుని ధ్యానించుచూ నిదురపోయెను. అంత రామలక్ష్మణులు ఆ విషపాత్రను ఆవలకు నెట్టి తిన్నగా తానీషా శయనాగారమున కేగి వానిని నిదుర నుండి లేపిరి. సంభ్రమాశ్చర్యములతో తానీషా ఆ వచ్చినవారు రామదాసు కింకరులని ఎఱిగినవాడై ఆరు లక్షల పైకమును గైకొనుచు రామదాసు సామాన్య మానవుడు గాదని గుర్తించెను ఆ మరునాడు చెఱసాలకేగి సగౌరవముగా రామదాసుని చెర విడిపించి మేళతాళములతో తీసుకువచ్చి వానికి తిరిగి తహసీల్దారు ఉద్యోగము నిచ్చుచూ ఆ జాగీరునంతయూ అతని కైవశము జేయుచూ శాసనము జేయించెను. తదనంతరము రామదాసు అజన్మాంతము భద్రాచలరాముని సేవించుచూ సజీవముగా వైకుంఠము జేరెను.

వీరి కీర్తనలు బహుళ ప్రజాదరణ పొందినవి. అవి భక్తిరస భరితములు, భజన గోష్ఠుల యందు తప్పనిసరిగా గానము జేయబడును. వారి కీర్తనలచే అనేకులు ప్రభావితులైరి.

వేంకట: ఎందరో మహానుభావులు! అందరికీ వందనములు. ఈ మహాత్ముల జీవిత గాధలు వింటుంటే ఐహిక సుఖములకై మానవుడు జెందు తాపత్రయము నిరర్ధకముగా తోచును.

శ్యామ : సత్సంగత్వే-నిస్సంగత్వం। నిస్సంగత్వే-
నిర్మోహత్వం।
నిర్మోహత్వే-నిశ్చలతత్వం। నిశ్చలతత్వే-జీవన్ముక్తిః"

అని శంకరాచార్యులవారు చెప్పినట్లు నేటి సత్సాంగత్యములో ఎన్నో అద్భుత విషయములు తెలిసినవి.

గోపి : మేము శ్రీ త్యాగరాజస్వామివారి మహిమలను ఎన్నియో వినియున్నాము. వారి జీవితచరిత్ర మాకెరుకపరిచి మమ్ములను ధన్యులను జేయవలసినదిగా కోరుచున్నాము.

వేంకట : స్వామీ! ఉచితమైన ఆజ్ఞ చేసినారు. ఒక్క మనవి. త్యాగరాజస్వామివారి పవిత్ర గాధను తమకు తెలియజేయుటకు ముందు ఒకటి రెండు విషయాలు తెలియజెప్పాలి. త్యాగరాజులవారికి అన్ని విధముల సరిపోలినవారు మరిద్దరున్నారు. తమబోటి పెద్దలు ఈ ముప్పురను సంగీత త్రిమూర్తులని పిలుచు చుందురు. ఇందు త్యాగరాజులవారిని వాకొనినప్పుడు మిగిలిన ఇద్దరిని గూడ చెప్పుటవలన దాక్షిణాత్య సంగీత చరిత్ర సమగ్రముగ చెప్పినట్లగును.

# శ్యామశాస్త్రి చరిత్ర

అరుగో! మన ఎదుట ఆశీనులై యున్న వీరే శ్యామశాస్త్రులవారు. వీరి పూర్వులు నెల్లూరి మండలమువారు. కంచి కామాక్షీ దేవాలయమున అర్చకులు. ఒక ఉపద్రవము కారణమున వీరు కాంచీపురము నుండి బయలుదేరి అటనట తల దాచు

కొనుచు చివరకు తిరువయూరు వచ్చి చేరిరి. తరువాత వారు తంజావూరునందు అమ్మవారిని ప్రతిష్ఠించినారు. తంజావూరులో అది కామాక్షి అమ్మన్ కోవెల. అచటనే శ్యామశాస్త్రిలవారు జన్మించిరి. వారిని వారి తల్లిదండ్రులు శ్యామకృష్ణుడని పిలుచు కొనుచుండిరి. ఆయన మేనమామ దగ్గర సంగీత శాస్త్రమున ప్రాథమిక విద్య నేర్చిరి. కారణ జన్ములగు వీరికి సంస్కృతాంధ్రముల యందు మంచి పాండిత్యము కలదు. చక్కని బుద్ధిబలము, మేధ, ప్రజ్ఞ కల సూక్ష్మగ్రాహి వీరు. ఈయన గొప్ప సంగీతకారులే గాక మహా వాగ్గేయకారులు గూడాను. వీరు పవిత్ర జీవి. నిష్కళంక భక్తులు. శ్రీదేవియును, వీరునూ మాట్లాడుకొనుచుందురు. కామాక్షీదేవి వీరికి ఎన్నియోమార్లు ప్రత్యక్షమై అనుగ్రహించినది. వీరు వీధివెంట పోవుచుండగ అరుగుల మీద కూర్చొన్నవారు లేచి నిలచి గౌరవము నెరపుచుండిరి. వీరు మీనాక్షీదేవిపై తొమ్మిది కృతులను రచించిరి. అవి నవరత్నమాలికా కృతులుగా కొనియాడబడుచున్నవి. వీరు మధురయందు అమ్మవారి సమక్షమున పాడిన కృతులు మధుర గాంధార ప్రవాహమై వినువారిని తన్మయులజేసినవి. అప్పటి నుండియును వీరిని అచట ఆలయ మర్యాదలతో సత్కరింతురు.

వీరి కృతులు విద్వత్తుతో కూడినవి. తాళక్రమ విషయమున అత్యంత గంభీరములైనవి. రసభావ దృష్టితో పరిశీలించిన వీరి కృతులు కదళీఫల పాకమునందున్నవి. ఒకనాడు బొబ్బిలి కేశవయ్య అను ఒక సంగీత విద్వాంసుడు తంజావూరు వచ్చెను. అతడు మహాగర్వి. భూలోక చాపచుట్టి అను బిరుదును ధరించినాడు. ఎందరో సంగీత విద్వాంసులను జయించి వారి

తంబురాలను, బిరుద పతకములను లాగుకొని జయపత్రములను తీసుకొనిపోవుచుండెడివాడు. ఈతడు తంజావూరు విద్వాంసులను సవాలు చేసినాడు వీరిని ఎదుర్కొను ధైర్యము ఆస్థాన సంగీత విద్వాంసులకు కొరవడినది. వారందరునూ కేశవయ్యను ఎదుర్కొనమని శ్యామశాస్త్రిగారిని ప్రార్థించిరి. వివాదమునకు ముందురోజు మనస్సునకు అశాంతి కలుగగా వీరు శ్రీదేవి పూజ చేసి పరిస్థితిని అమ్మకు వివరించిరి. అప్పుడొక కృతి ఉబికివచ్చినది. అది చింతామణి రాగమున "దేవిబ్రోవ సమయమిదే" అనునది, అమ్మవారి కరుణ కల్గినది. మరునాడు సభలో కేశవయ్య ఒక రాగమెత్తుకొని పాడెను. తానములో భిన్నవి భిన్నగతులు ప్రదర్శించెను. క్లిష్ట సంచారములు చూపెను. కేశవయ్య పాట నిలుపగానే శ్యామశాస్త్రులవారు ఇంతేనా? ఇంకనూ కలదా? అని ప్రశ్నించిరి. కేశవయ్య మాట్లాడలేదు. శాస్త్రిగారు – కేశవయ్య చూపిన తానములన్నీ పాడి ఆయనకు తెలియని నూతన విషయములను ప్రదర్శించి లయాంతర్లీనమైన గమకములను జూపిరి. కేశవయ్యకు వీరి ప్రతిభ తెలియదు. వారిద్దరునూ చాలసేపు పెనగులాడిరి. చివరకు ఒకరినొకరు మూడు ప్రశ్నలడిగి జయాపజయ నిర్ణయము చేయుటకు నిశ్చయించుకొనిరి.

మొదట శ్రీ శ్యామశాస్త్రి కేశవయ్యను "నీవు శాస్త్రీయముగా పాడగలవా"? అని ప్రశ్నించెను. అంత గొప్ప విద్వాంసుని ఇటువంటి ప్రశ్న వేయుట సముచితము కాదు, అందుకు సమాధానంగా "ఓ! తప్పకుండా పాడగలను" అన్నాడు కేశవయ్య. అయితే కొంచెమైనా తల త్రిప్పకుండా తానంపాడు"

అని శ్యామశాస్త్రిగారు అన్నారు. కేశవయ్య ఎంత ప్రయత్నించిననూ తల తిప్పకుండా పాడలేకపోయినాడు. అది అశాస్త్రీయము. అంత కేశవయ్య "సింహనందన తాళములో" ఒక పల్లవి పాడి శ్యామశాస్త్రిని పాడమన్నారు. శ్యామశాస్త్రి అవలీలగా దానిని పాడి "శరభనందన తాళములో" తాను మరియొక పల్లవిని పాడి దానిని కేశవయ్యను పాడమనెను. కేశవయ్యకు అంతకు మునుపెన్నడూ ఆ తాళము గురించి తెలియదు. దానితో పరాజితుడై శ్యామశాస్త్రిగారికి క్షమాపణలు చెప్పుకొని, గర్వ భంగము నొందినవాడై, చిన్నబోయిన వదనముతో నిష్క్రమింపనుండ, వానిని సాదరముగా పంపివైచెను. ఆస్థాన విద్వాంసులు శాస్త్రిగారికి కృతజ్ఞతలు చెప్పుకొన్నారు. మరియొక సందర్భములో వీరు నాగపట్టణమున అప్పుకుట్టి అను నాట్యాచార్యుని గర్వమును చిన్న పల్లవితోనే పరాభూతము జేసిరి. వీరు స్వరజతి నిర్మాణ నిపుణులు. "రావే హిమగిరి కుమారి" (తోడి) "కామాక్షి అనుదినము" (భైరవి) "కామాక్షి నీదు పదయుగమె" (యదుకుల కాంభోజి) అనునవి సంగీత చరిత్రలోనే నిరుపమానములు. రాగభావ ప్రస్తారమందు, సంగీత భావ సంపన్నతయందు సాటిలేనివి. వీరికి ఆనందభైరవి రాగమన్న ప్రీతి యెక్కువ. వీరు చాపు తాళమందు అనేక రచనలు చేసిరి అందు విలోమచాపు (4+3) పద్ధతిని నూతనముగా ప్రవేశపెట్టిరి.

గోపి : శ్యామశాస్త్రిగారు, వారు రచించిన ఒక కృతి బాడి మమ్ములను కృతార్థుల జేయ ప్రార్థన.

శ్యామ : (ఆనందభైరవి రాగం - ఆదితాళము)

పల్లవి : ఓ జగదంబ నన్ను నీవు జవమున బ్రోవు ॥

అ॥ ప : ఈ జగతి గతియై జనులకు మఱి
తేజమున రాజ వినుతయౌ
రాజముఖి సరోజనయన సుగుణ
రాజరాజిత కామాక్షి ॥ఓ॥

స్వరసాహిత్యము : వరసితగిరి నిలయుని ప్రియ ప్రణయిని
పరాశక్తి మనవిని వినుమా
మరియాదలెఱుగని దుష్ప్రభుల కోరి
వినుతింపను వరంబొసగి ॥

చర 1 : కన్నతల్లి నాదు చెంత ఇంత-కన్నడ సలువగ
తగునా।
నిన్ను నే నమ్మియున్న వాడగద-నన్నా కని
బ్రోచుట కరుదా।
అన్ని భువనంబులు గాచేవు ప్రసన్నమూర్తి
అన్నపూర్ణ వరదా
విన్నపంబు విన్నవింతు సన్నిధి విపన్న భయ
విమోచన ధౌరేయ॥

చర 2 : జాలమేల శైల బాలతాళ-జాలను జనని నిన్నువినా
పాలనార్థముగ వేరె దైవముల-లోలమతినై
నమ్మితినా

నీలనుత శీలము నేనెచ్చటనైనా-గాన గానలోల
హృదయా
నీలకంఠరాణి నిన్ను నమ్మితిని-నిజంబుగ బలికేది
దయజేసి ॥

చర ౩ : చంచలాత్ముడే నేమి పూర్వ సంచితములు సలిపితినో
కంచి కామాక్షి నేడు నిన్ను పాద-గాంచితిని శరణు
శరణు నీ
వించుక దృగంచల గతి నాదెస నుంచవమ్మ
శ్యామకృష్ణ వినుతా
మంచికీర్తి మించినట్టి దేవివి-మదించి మదవ
రాధములు సహించి ॥

శ్రోతలందరూ : అద్భుతము! ఆ దేవి కనుల కగుపడునట్లు గానము జేసిరి.

త్యాగ : వారు శ్రీ చక్రోపాసకులు. వారు పిలిస్తే అంబ ప్రత్యక్షమౌతుంది.

గోపీ : నేనెంతో అదృష్టవంతుడను. త్యాగరాజ స్వామివారి సంగీతమును విందామని వచ్చేను. భగవదనుగ్రహముచే శ్రీ శ్యామశాస్త్రివారి సంగీతమును గూడ వినగల్గితిని. మహా భాగ్యము. శ్రీ దీక్షితులవారి చరిత్రను గూడ సంగ్రహముగా తెలిపి నన్ను కృతార్థుని జేయ ప్రార్థన.

త్యాగ : శ్రీ ముత్తుస్వామి దీక్షితులవారికి సంగీతమందే గాక,

వేద వేదాంత, యోగ, మంత్రశాస్త్ర, అగమ శాస్త్రముల యం దపార పాండిత్యము గలదు. యావద్భారతమున సంచారము చేసెను. సంగీత విద్వల్లోకమున వీరి ప్రభావము స్ఫుటముగా నున్నది. వీరు కర్ణాటక సంగీతమందే కాక హిందుస్తానీ సంగీతమందు కూడ కొంత పరిశ్రమ జేసినారు. పాశ్చాత్య సంగీతము కూడ వీరికి తెలియును. తెలుగు భాషయందు కూడ వీరికి పాండిత్యము కలదు. వీరి కృతులు కొన్నిటి యందు సంస్కృతాంధ్ర తమిళ భాషలను కలిపి మణిప్రవాళ శైలిగా ప్రయోగించిరి. దక్షిణ దేశమున విరించి పుర గ్రామమున వెంకటేశ్వర దీక్షిత భాగీరధి దంపతులకు రామస్వామి దీక్షితులు జన్మించెను. రామస్వామి దీక్షితులకు తిరువారూరు నందు కృత్తికా నక్షత్ర సమయమున కలిగిన సంతానమే ముత్తుస్వామి. వైదీశ్వరన్ కోవెల అను గ్రామము నందు వేంచేసి యున్న అమ్మవారు బాలాంబికాదేవికి రామస్వామియును, భార్య సుబ్బలక్ష్మి అమ్మాళ్‌ను కలసి నలుబది దినములు నవావర్ణ పూజలు చేసిరి. నలుబదియవ దినము రాత్రి అమ్మవారు స్వప్న దర్శనమిచ్చి రామస్వామి దీక్షితునకు ఒక ముత్యాల హారమును ప్రసాదించెను. అమ్మవారి అనుగ్రహమున పుట్టుట వలన కార్తికేయుని పేరైన ముత్తు కుమారస్వామి అని తన కుమారునకు పేరు పెట్టెను. అదియే ముత్తుస్వామి అయినది. మణలి జమీందారీ స్థానమున రామస్వామి దీక్షితులు సంగీత విద్వాంసులుగా స్థిరపడిరి. అచట దీక్షితుల ప్రఖ్యాతి పెరిగెను. జార్జి కోటలో పాశ్చాత్య బ్యాండు సంగీతమును వినిన దీక్షితులవారికి కొన్ని పాశ్చాత్య సంగీత మర్మములు తెలిసినవి. బ్రౌన్‌దొర కోరికపై దీక్షితులవారు కొన్ని ఇంగ్లీషు పాటలకు వరుసలు, సంస్కృత

సాహిత్య శబ్దములను కూర్చెను. వీరివలన పాశ్చాత్య సంగీత వాయిద్యమైన ఫిడేలు కర్ణాటక సంగీత వ్యవస్థలో స్థానమును పొందినది. మణలియందే దీక్షితులవారికి శ్రీ విద్యా గురువైన చిదంబరనాథ యోగీంద్రుల శుశ్రూష దొరికినది. రామస్వామి దీక్షితులవారి అనుమతిపై ముత్తుస్వామి దీక్షితులను చిదంబర నాథయోగి కాశీయాత్రకు తీసుకొనిపోయెను. కాశీలో ముత్తు స్వామివారు కఠినవ్రత నిష్ఠగా దినచర్య గడిపిరి. యోగీంద్రుల సన్నిధానమున, శ్రీ చక్రార్చన కాలమున వేదపఠనము, సంగీతము, భజనలు చేయుట, విశ్వేశ్వర, విశాలాక్షి అన్నపూర్ణలను దర్శించుట, గంగాస్నానము యోగాభ్యాసము, వేదాంత శ్రవణము ఇవి నిత్య కృత్యములు. ఈ కాలముననే దీక్షితులువారు హిందుస్తానీ సంగీత మర్మములను తెలిసికొనిరి. వారు యోగీంద్రుల ఆదేశమున గంగలో వెదుకగ యొక వీణ దొరికినది. అది వారికి గంగాదేవి ప్రసాదము. యోగీశ్వరులు ప్రాణత్యాగము చేయుగా వారిని సమాధి చేసి తిరిగి దీక్షితులు మణలి వచ్చిరి. కుటుంబమును కలియుటకై తిరువారూరుకు పోవు దారిలో వారు తిరుత్తణి వెళ్ళిరి. నలుబది దినములు షడక్షరీ జపము చేయుచు దీక్షితులవారు అట గడిపిరి. నలుబదియవ దినమున దీక్షితులు జపము చేసుకొనుచుండగ ఒక వృద్ధుడు దీక్షితులవారి నోరు తెరిపించి ఏదియో పెట్టి కన్నులు మూసుకొని నీ నోటిలో నేను పెట్టినదేదియో చెప్పుమనెను. దీక్షితులవారు పటికబెల్లము అని చెప్పి కన్ను తెరుచునరికి అట బ్రాహ్మణుడు లేడు. శ్రీవల్లీ, దేవసేనా సమేతుడైన శ్రీ సుబ్రహ్మణ్య స్వామి తేజోమయముగ దర్శన మిచ్చి ఆలయాంతర్భాగమునకు పోవుచు అదృశ్య

తయ్యెను. ఆనందముతో గొంతెత్తి "శ్రీనాథాది గురు గుహో జయతి జయతి" (మాయామాళవ రాగం) అను 'గురు గుహ' ముద్ర గల అనేక కృతులను బాడదొడగెను. వాటిని తిరుత్తణి కృతులని పిలువ దొడంగిరి. తెలుగున ఉదాహరణకావ్యము వలె విభక్తి పరముగ దీక్షితులవారు కృతులను రచించిరి. తెలుగున దీనిని ఉదాహరణ సాహిత్యమందురు.

తిరుత్తణి నుండి అటకు అరువదిమైళ్ళ దూరములో గల తిరుపతిని వారు దర్శించిరి. అటనుండి వారు ప్రసిద్ధ శైవ క్షేత్రమైన శ్రీకాళహస్తికి వెళ్ళిరి. వీరి నవావరణ కీర్తనల యందు శ్రీచక్ర స్వరూప వర్ణనము, యంత్ర, తంత్ర, మంత్ర, పూజా సాంకేతిక వైభవము గలదు. వీరు గానా పత్యాగమ మందు నిష్ణాతులు. హంసధ్వని రాగకర్తలు. తిరువారూరునకు సమీపమున కివళూరు కలదు. అచట శివుడు అక్షయ లింగ స్వామి. వీరు "అక్షయలింగ విభో - స్వయంభో" అను కృతిని రచించి స్వామి ఎదుట గానము చేయుటకు వెళ్ళు సమయము నకు నిత్య పూజ పూర్తి చేసుకొనిన పూజారి గుడి తలుపులు మూసుకొని వెళ్ళిపోవుచుండెను. దర్శనమిప్పింపుడని దీక్షితుల వారు కోరగా అతడు తిరస్కరించి రేపు రమ్మనిపోవ నుద్యుక్తు డయ్యెను. దీక్షితులువారు కృతిని పాడసాగిరి. పూజారి నిలు చుండి చూడ దొడగెను. గ్రామస్థులు గుమిగూడిరి. ఆశ్చర్య కరముగ ఆలయపు తలుపులు తెరచుకొన్నవి. గ్రామస్థులు అచ్చెరువొందిరి. పూజారి పశ్చాత్తాపమునొందెను.

మరొకనాడు భోజన సంబారములింటియందు లేవు. అట్టి దీనస్థితిలో దీక్షితులవారి భార్య దేవదాసి కమలమ్మ సహాయము

కోరినది. కమలమ్మ ఆభరణములను అమ్మి ఇచ్చుటకు సిద్ధపడుచున్నది. దీక్షితులవారు ఆమెను వారించి "త్యాగరాజం భజరే రేచిత్త" అను కృతిని దేవాలయమున గానము చేసి ఇంటికి వచ్చుసరికి రెండు బండ్ల నిండ వస్తు సంబారములు ఆయన యిల్లు చేరియుండెను.

ముత్తుస్వామి దీక్షితుల శిష్యుడు శుద్ధ మద్దళం తంచియప్ప శూలనొప్పి, వైద్యమునకు నయముకాలేదు. అంత దీక్షితులవారు "దివాకర తనూజం" అను కృతి రచియించి యిచ్చి శనిదోష నివారణమునకై గానము చేయించగా శూల నొప్పి పోయెను. దీక్షితులవారు రామేశ్వరయాత్రకు బయలు దేరిరి. దీక్షితులవారి సోదరుడు బాలస్వామి ఎట్టయా పుర రాజాస్థానమున సంగీత విద్వాంసుడు. దీక్షితులు ఎట్టయా పురము బయలుదేరిరి. దారిలో వర్షములు లేక క్షామములున్న ప్రాంతములు కలవు. మార్గమధ్యమున దీక్షితులవారి భార్యకు అమిత దాహమై నీరు లేక శోష వచ్చినది. దీక్షితులవారు అమృతవర్షిణి రాగమున "ఆనందామృత కర్షిణి – అమృతవర్షిణి" అను కృతిని గానము చేయగా పెద్ద వర్షము కురిసి అందరునూ తేరుకొనిరి.

ఇట్లు దీక్షితులవారు దైవాంశ సంభూతులై బహుకృతులు రచించిన సంగీత త్రయమందొకరు.

భట్టా : వారి రచన నొకదానిని మాకు వినిపింప ప్రార్థన.

త్యాగ : ఇట కూర్చున్న వీరిద్దరూ ప్రసిద్ధ తంజావూరు సోద

రులు పొన్నయ్య, చిన్నయ్య. వీరు ముత్తుస్వామి దీక్షితుల వారి శిష్యులు. నాయనలారా! మీ గురువుగారు రచించిన ఒక కృతి పాడండి!

పొన్నయ్య) : గమకక్రియ రాగము–ఆదితాళము.
చిన్నయ్య) :

పల్లవి : మీనాక్షీ మే ముదం దేహి – మేచకాంగి రాజ
మాతంగి ॥మీనాక్షీ॥

అ॥ ప : మానమాతృమేయే మాయే మరకతచ్ఛాయే
శివజాయే
మీనలోచనీ పాశమోచనీ మానినీ కదంబ
వనవాసినీ ॥మీనాక్షీ॥

చర : మధురాపురి నిలయే మణివలయే మలయధ్వజ
పాండ్యరాజ తనయే
విధు విడంబన వదనే విజయే వీణా గాన
దశ గమకక్రియే
మధు మదమోదిత హృదయే సదయే మహాదేవ
సుందరేశ ప్రియే
మధు మురరిపుసోదరి శాతోదరి విధి గురుగుహ
వశంకరి శంకరి ॥

భట్టా : ఆహా! ఏమి సాహితీ పటుత్వము–అద్భుతంగా గానం చేసారి చిరంజీవులు.

త్యాగ : వీరి కీర్తనలు నారికేళపాకరచనలుగా సంగీతమందు విశేష ప్రజ్ఞలేనిదే వాటిని పాడుట కష్టము. కృతిని సంపూర్ణ

ముగా పాడగలిగినవారికి ఆ రాగమందలి మెళుకువలన్నియు నిస్సంశయముగా స్వాధీనమగును. వీరి రచనయందే రాగ ముద్ర గూడ యుండును. మధ్యమకాల సాహిత్యాద్యనేకాలం కారములతో వీరి రచనలు శోభిల్లుచుండును.

భట్టా : కర్ణాటక సంగీత భాండారము కడు విశాలమైనది. ఇంతవరకు శ్రీ శ్యామశాస్త్రి, ముత్తుస్వామిగార్ల రచనా వైశిష్ట్య ముతో బాటు వారి అద్భుత జీవిత విశేషములను గూడ వినే భాగ్యం కలిగినది. నేను కాశీక్షేత్రమందుండగా శ్రీ త్యాగరాజ స్వామి గురించి ఎన్నియో విశేషములు విన్నాను. వారి గానము ప్రత్యక్షముగా విని చరితార్థుడనైనాను. వారి జీవిత విశేషములను గూడ చెప్పి నా యీ యాత్రను సఫలీకృతము జేయ ప్రార్థిస్తున్నాను.

వేంకట : త్యాగరాజ స్వామివారి దివ్య చరిత్రను చెప్పగల సమర్థులు ఇక్కడ ఉపవిష్టులైనవారిలో శ్రీ శ్యామశాస్త్రివారు. అది అర్హులైనవారి నోటినుండియే వినవలయు గదా! అందు వలననే చేతులు మోడ్చి శ్యామశాస్త్రివారిని త్యాగరాజస్వామి వారి జీవిత విశేషములను తెలుప ప్రార్థిస్తున్నాను.

శ్యామ : శుభమస్తు. సంతోషమైనది. వారి పవిత్ర గాథ కథనము జేయు పుణ్యవంతుడనగుచున్నాను. ఆలకింపుడు.

# త్యాగరాజ చరిత్ర

కర్ణాటక సంగీత రత్నత్రయమున శ్రీ త్యాగరాజస్వామి అగ్రగణ్యుడు. సంగీతమునందే గాక సాహిత్యమందు కూడా అప్రతిమానుడు. భక్తవరేణ్యుడు. కర్నూలు మండలములోని కంభం తాలూకా కాకర్ల గ్రామము నుండి దక్షిణ దేశమునకు వచ్చిన ఆంధ్ర బ్రాహ్మణ వంశమున త్యాగరాజు జన్మించిరి. వీరి ముత్తాతగారు పంచనద బ్రహ్మము. ఆయనకు ఐదుగురు పుత్రులు. సదాశివ బ్రహ్మము, సదానంద బ్రహ్మము, సచ్చిదానంద బ్రహ్మము, బాలబ్రహ్మము, గిరిరాజ బ్రహ్మము. గిరిరాజ బ్రహ్మమునకు గిరిరాజ కవి అని పేరు కూడ కలదు. ఈయన సంగీత వాగ్గేయకారులు. తంజావూరు రాజ్యమును పాలించిన షహాజీ మహారాజు వద్ద ఆస్థాన విద్వాంసులుగా నుండి "పల్లకీ సేవా ప్రబంధ" మను సంగీత నృత్య నాటికను రచించిరి. ఈయన పెక్కు యక్షగానములను రచించిరి. ఈయనకు గూడ ఐదుగురు కుమారులు కలిగిరి. వారిలో రామబ్రహ్మము ప్రసిద్ధుడు. ఆయన గొప్ప విద్వాంసుడు. ఆయన భార్య సీతమ్మ. ఈమె తంజావూరు సంస్థాన వైణిక విద్వాంసులైన వీణకాళహస్తయ్య కుమార్తె. ఆమె చక్కని గాయని. పురందర దాసు కీర్తనలెన్నిటినో ఆమె గానము చేసెడిది. రామబ్రహ్మము గొప్ప పౌరాణికుడు. ఆయన పురాణ ప్రవచనము విని ఆనందించి తంజావూరు ప్రభువు ఆయనకు పశుపతి కోవెల గ్రామమున కొంత భూవసతిని, తిరువయ్యూరు గ్రామమందొక గృహమును బహుమానముగా ఇచ్చి సత్కరించెను. రామబ్రహ్మమునకు ముగ్గురు కుమారులు. వారు పంచాప కేశ, రామనాథ, త్యాగరాజులు. రామనాధుడు చిన్నతనముననే మర

ణించెను. పంచాపకేశునికి జపేశుడని మారుపేరు కలదు. రామ బ్రహ్మమునకు స్వప్నమున ఒకనాడు తిరువారూర్ శివాలయ మందున్న శివుడు దర్శనమిచ్చి సంగీత, సాహిత్య కళాకోవిదు డైన కుమారుడు ఒకడు జన్మింపనున్నాడని చెప్పి వానికి "త్యాగరాజు" అని నామకరణము చేయమని చెప్పెను.

త్యాగరాజస్వామి తిరువారూరు గ్రామమున సర్వజిత్ నామ సంవత్సర వైశాఖ శుద్ధ షష్ఠి (4-5-1765) నాడు జన్మించిరి. ఆయన జన్మ నక్షత్రము పూర్వాషాఢ. కటకలగ్నము. వీరిది భరద్వాజస గోత్రము. అపస్తంబ సూత్రము. కృష్ణ యజుశ్శాఖ.

త్యాగరాజునకు 8వ ఏట ఉపనయనమైనది. పదునెనిమిదవ ఏట కమలాంబ అను కన్యతో వివాహమైనది. ఆమెకు సీతాలక్ష్మి అను కుమార్తె కలిగినది. చాల చిన్నతనముననే త్యాగరాజు బాలుడుగా సంగీతములో ప్రజ్ఞను చూపించెను. ఆయన బాలుడుగా నున్నప్పుడు మొదటిసారిగా "నమో నమో రాఘవాయ" (పున్నాగవరాళి) యందు ఒక కీర్తనను గోడమీద వ్రాయగా దానిని రామబ్రహ్మము జూచి సంగీత విద్వాంసులైన రామశేష శాస్త్రి, భాష్యం కృష్ణశాస్త్రివంటి మహా విద్వాంసులకు చూపగా వారు ఆ రచనను మిగుల ప్రశంసించిరి.

అంత కొడుకు సంగీత ప్రతిభను జూచి రామబ్రహ్మము తిరువయ్యూరులో నివసించుచున్న తంజావూరు ఆస్థాన విద్వాంసులైన శొంఠి వెంకట రమణయ్యగారివద్ద సంగీత విద్య అభ్య

సించుటకు ఒప్పుకొనెను. త్యాగరాజు ఒక సంవత్సర కాలము లోనే ఆయన వద్ద నున్న సంగీత విద్య నంతయూ గ్రహించెను. తండ్రిగారివద్ద ఆంధ్ర సంస్కృత భాషల నభ్యసించెను.

వీరి 18 వ ఏట రామకృష్ణ యతీంద్రుని దర్శనమై ఆయన ఆజ్ఞానుసారముగా 96 కోట్ల రామనామ జపమును 21 సంవత్సరములలో పూర్తిచేసి రామ సాక్షాత్కారమును బొందిరి. త్యాగరాజు గొప్ప వైణికుడు కూడా. ఆయన కీర్తనల యందున్న గమకములు ఆయనకున్న వీణావాదన పాండిత్యమును చాటుచున్నవి.

త్యాగరాజు వాల్మీకాంశ సంభూతుడు. వాల్మీకి మహర్షికి నారద మునీంద్రులు రామాయణ గాథను రచించుటకు ఎట్టి ప్రేరణ జేసిరో అట్లే త్యాగరాజ కీర్తన స్రవంతికి గూడ నారద మహర్షి కారణభూతుడయ్యెను. ఒకనాడు త్యాగరాజ స్వామి ఉంఛవృత్తి ముగించుకొని ఇంటికి వచ్చి శ్రీరామునకు నివేదన చేయుచుండగా ఒక సన్యాసి త్యాగరాజు వాకిట నిలచి భిక్ష కోరెను. వానిని కమలాంబ జూచి సాదరముగా లోనికి ఆహ్వానించెను. త్యాగరాజస్వామి వానిని జూచి సాష్టాంగ నమస్కారము జేసి మిక్కిలి వినయ విధేయతలతో ఆనాటికి తన ఇంటి వద్ద భిక్ష స్వీకరించమని కోరెను. అంత ఆ వచ్చిన సన్యాసి త్యాగరాజు కీర్తి విని వాని గానము వినవలెనను కోరికతో వచ్చితినయు, కొన్ని అమూల్య గ్రంథములు గల ఒక మూటను వారికందించుచూ తాను కావేరికి పోయి స్నానము చేసి మరలవత్తునని చెప్పి వెడలిపోయెను. అపరాహ్ణము దాటి

నది. యతి రాలేదు. సూర్యాస్తమయమైనది. సన్యాసి జాడ కానరాలేదు. త్యాగరాజు యతికై నిరీక్షించుచూ నిరాహారుడై ఆ రాత్రి నిదురించెను. అంత స్వప్నమునందు నారదముని ప్రత్యక్షమై తాను యతి రూపమున వచ్చితిననియు తానిచ్చిన మూటయందు "స్వరార్ణవము" "నారదీయము" అను అపూర్వ గ్రంథము ఉన్నవనియు, వాటిని అనర్గళముగా పఠించిన సంగీత మర్మములన్నియూ తెలిసి సంగీత కవితాధార భావ గర్భితమైన పదజాలములతో గూడి వెల్లువలై ప్రవహించగలదని చెప్పి అంతర్ధానమయ్యెను. అంత నిదుర మేల్కొని సన్యాసి ఇచ్చిన మూటను విప్పి జూచి అందు నారద మునీంద్రులు జెప్పిన అపూర్వ గ్రంథములను గాంచి తన్మయత్వముతో "శ్రీ నారదనాద సరసీరుహ భృంగ" "వర నారద" మొదలుగా గల కీర్తనలతో నారద మునిని స్తుతించెను. తదనంతరము త్యాగరాజు రామభక్తి పారవశ్యములో అనేక కీర్తనలను అద్భుతముగా గానము జేయదొడగిరి.

ఈయన తన కుటుంబ పోషణకై ఉంఛవృత్తిని స్వీకరించి, వచ్చిన సంబారములతో ఏరోజు కారోజు తన కుటుంబ భారమును శిష్య సమేతముగా తీర్చుచుండెను. ఒక్కొక్కప్పుడు వీరు ఉపవాసములు కూడ జేయుట కద్దు. వీరి గానము విన్న వారు ఒడలు మైమరచి దైవ సాన్నిధ్యము పొందెడివారు. క్రమముగా వీరి కీర్తి దేశము నలుమూలలా ప్రాకెను. ఎందరో మహానుభావులు, వడివేలు, గోపాలకృష్ణ భారతి, షట్కాం గోవిందమారాత్, తూము నరసింహదాసు మొదలగువారు వీరి గానము వినుటకై ప్రత్యేకముగా వచ్చుచుండిరి. అందు

తూము నరసింహదాసు త్యాగరాజును ఈ విధముగా ప్రస్తుతించెను :

"కేశవానంద సంకీర్తనావళి వింటి - భావసిద్ధియు శుద్ధభక్తిగంటి
భక్తులు శిష్యులు బలిసి కొల్వగగంటి - వాఙ్మాధురీ వైభవంబుగంటి
వినయ సత్వంప ద్వివేకంబు గనుగొంటి - శ్రీరామ పదభక్తి
చెలువుగంటి
అజునకందగరాని యనుభవంబును గంటి - తన్మయత్వంబాత్మ
తనరగంటి
అరసి కనుగొంటి త్యాగరాయార్యునందు - ఇద్ధ సద్గుణ పుంజ
మింకెన్నియైన
దివ్య మహిమాతిశయములు తేజరిలుట - గంటి హర్షాబ్ధి
వోలలాడుచుంటె మదిని
రామపదభక్తి త్యాగయార్యవరునికినీ - సమముగానేర రెవ్వ
రిక్ష్మాతలమున
ప్రేమనాథుని నొకసారి పిలిచెనేని - రాముడోహో యనుచును
మార్పలుకునంట"

ఒకనాడు శొంఠి వెంకటరమణయ్యగారి ఆదేశము మేరకు త్యాగరాజు వెంకట రమణయ్యగారి తండ్రిగారు శొంఠి వెంకట సుబ్బయ్యగారింట గానము చేసిరి. ఆ గానసభకు తంజావూరు నాస్థానమందలి అనేకమంది సంగీత విద్వాంసులు త్యాగరాజు యొక్క అద్భుత గానమును విన కుతూహలముతో వచ్చిరి. త్యాగరాజు పరవశుడై 'కాంభోజి' రాగమును పాడి "మరి మరి నిన్నే మొరలిడుదు" అను కీర్తనను అద్భుతముగా విస్తరించి

పాత దొడంగెను. శ్రోతలు, త్యాగరాజు కాలవ్యవధిని మరచి పోయిరి. ఆ గానసభ ఆ విధముగా ఎనిమిది గంటలు క్షణ మాత్రకాల మన్నట్లుగా సాగిపోయినది. ఈ సందర్భములో ఆస్థానమందు గురుతరమైన బాధ్యతలు గల ఆస్థాన విద్వాంసులు వారి విధి నిర్వహణము మరచి ఇచట గానవారధిలో మునిగిరి. తదనంతరము రాజసన్నిధిని జేరి క్షమాపణ జెప్పుకొని జరిగిన వృత్తాంతము జెప్పిరి. అంత శరభోజి మహారాజు త్యాగరాజు గానము విని మిక్కిలి ఉత్సుకత కలవాడై వానిని ఆస్థానము నకు ఆహ్వానించి అచట గానము చేయమని సగౌరవముగా ఆహ్వానించెను. ఆ ఆహ్వానముతో అనేక అమూల్య వస్తు సము దాయములు గూడ కానుకగా పంపెను.

వాటిని జూచి త్యాగరాజు విరాగమనస్కుడై "నిధి చాల సుఖమా? రాముని సన్నిధి సేవ సుఖమా??" అని మనసులో తర్కించుకొని రాజాహ్వానమును తిరస్కరించెను. రాజు, తిర స్కారమును తీరని అవమానముగా భావించి రాజభటులను పంపి బలవంతముగా త్యాగరాజును తంజావూరునకు తెమ్మనెను. ఆ మరుక్షణము నుండే మహారాజునకు భరింపరాని శూల బాధ (కడుపు నొప్పి) వచ్చి విల విల కొట్టుకొనుచుండెను. ఎన్ని చికిత్సలు చేసిననూ బాధ తగ్గలేదు. అంత కొందరు జ్యోతిష్యులు విషయమును గమనించి ఇది సాధు జనాపచారము వలన కలిగినదని మహారాజునకు విన్నవించిరి. అంత శరభోజి త్యాగ రాజును బంధించి తెమ్మనినందుకు పశ్చాత్తాపము నొంది వెంటనే రయమున పోవు అశ్వ సైనికులను పిలిపించి ముందు పంపిన రాజభటులను వెనుకకు రావించెను. వెంటనే మహారాజునకు

బాధా విముక్తి కలిగినది. అంత త్యాగరాజుయొక్క మహిమ లకు ఆశ్చర్యము చెందినవాడై వారి గానము వినవలెనను కుతూహలము ద్విగుణీకృతము కాగా ప్రచ్ఛన్నవేషియై త్యాగ రాజ మందిరమునకు జని వారి అద్భుత గానము విని తరించెను.

త్యాగరాజు అన్న జపేశుడు ప్రాపంచిక సౌఖ్యములను ఆశించుచు లౌకిక జీవనమందు అధికమైన ఆసక్తిని కలిగి యుం డెడివాడు. త్యాగరాజు అందుకు భిన్నముగా విరాగియై ఆధ్యా త్మిక చింతనలో కాలము వెళ్ళబుచ్చు చుండెను. జపేశుడు, త్యాగరాజు కుటుంబమునకు ఏ విధముగాను అక్కరకు రాకపోవు టచే తండ్రి ఆస్తిని పంచుకొనగా త్యాగరాజునకు రామపంచాయు తన విగ్రహములు, గృహమునందు కొంత భాగము వచ్చెను. నిరంతర రామ సేవా పరాయణుడై యున్న తమ్ముని జూచి ఎటులైన వానిని ఐహిక చింతనకు తీసుకురావలెనని ఎంచి ఒక నాటి అర్ధరాత్రి సమయమున రామపంచాయతన విగ్రహము లను దొంగిలించి కావేరి నదిలో పారవైచెను. మరునాడు ఉదయముననే మేల్కాంచిన త్యాగరాజు రామపంచాయతన విగ్రహములు గానక మిక్కిలి వగచి పిచ్చివానివలె నిద్రాహార ములు వదలి రామపంచాయతన విగ్రహములకై వెదుకసాగెను. ఇవ్విధముగా కొన్ని దినములు అహోరాత్రములు నిద్రాహార ములు మాని విగ్రహాన్వేషణలో శుష్కించుచుండగా శ్రీరామ చంద్రుడు స్వప్నమున సాక్షాత్కరించి కావేరి నది యందు తానున్న స్థలమును సూచించెను. మరునాడు ఉదయముననే మేల్కాంచి కావేరి నదికి పోయి స్నానమాచరించు చోటున

వానికి రామ విగ్రహములు దొరికినవి. అంత మహానంద ముతో, మేళతాళాదులతో స్వామిని "రార మాయింటిదాక" అను కీర్తనను గానం చేయుచూ ఇంటికి తోడ్కొని వచ్చెను. జపే శుడు తాను జేసిన అపరాధమునకు పశ్చాత్తాపము జెంది త్యాగ రాజు యొక్క మాహాత్యమును గుర్తించినవాడై నాటి నుండి వానిని భాతృ వాత్సల్యముతో జూడసాగెను.

ఒక దినమున త్యాగరాజుని యింట భోజన పదార్థములు లేవు. అంత ఇంటిలోని వారందరూ ఉపవసించి తులసీ తీర్థము సేవించి అదియే మహా ప్రసాదముగా భావించి పరుండిరి. అంత శ్రీరామచంద్రుడు హనుమత్ సీతా సమేతుడై బాటసారుల రూపములో వచ్చి త్యాగరాజు యింటిని తట్టెను. త్యాగరాజు తలుపు తీసి సాదరముగా వారిని ఆహ్వానింప వారు త్యాగరాజు ఆహ్వానమును మన్నించి వాని ఇంట బసచేసిరి. అతిథి సత్కా రము చేయుటకై ఇంట్లో సంభారములు లేవు. ఆ దినమున సంభారములు లేని కారణమున శ్రీరామచంద్రునకు నివేదన జరుగలేదు. త్యాగరాజు కమలాంబలు ఏమి చేయుటకును పాలు పోక విచారించు చుండిరి. వీరి మనోగతం ఎరిగినవాడై ఆ వచ్చిన బాటసారి తనవద్ద తినుబండారములన్నియూ గలవని చెప్పి అనుజ్ఞ ఇచ్చినచో తానే వాటిని పచనము చేయించి రామ చంద్రునకు నివేదన చేయగలనని చెప్పెను. ఆ దినమున శ్రీరామునికి నివేదన జరుగని కారణమున త్యాగరాజు అందు లకు సమ్మతించెను. అంత సీతాదేవి పచనము చేయగా శ్రీరామచంద్రుని నివేదన అనంతరమందు, భక్తునితో శ్రీరామ చంద్రుడు విందారగించెను. అంత త్యాగరాజు పులకిత మన

స్కుడై "భవనుత" అను మోహనరాగ కృతిని గానము చేసి శ్రీరాముని మహిమలను వేనోళ్ళ కొనియాడెను.

రామ బ్రహ్మముగారి స్నేహితుడైన కంచి పీఠాధిపతి ఉపనిషద్బ్రహ్మేంద్ర స్వామి త్యాగరాజు కీర్తిని విన్నవాడై వయోవృద్ధు డగుటచే త్యాగరాజును వచ్చి తన గానమును వినుపింపుమని అభ్యర్థించెను. వారి కోరికపై త్యాగరాజస్వామి తీర్థాటనము చేయ సంకల్పించి శిష్యులతో బయల్వెడలెను. కాంచీపురమందు ఉపనిషద్ బ్రహ్మేంద్రస్వామిని దర్శించి అచట వరదరాజుపై కొన్ని కృతులు రచించి మనోహరముగా గానము జేసెను. తదనంతరము వాలాజీపేట వెళ్ళి తన శిష్యుడు వాలాజిపేట వెంకటరమణ భాగవతార్ వద్ద కొన్ని దినములుండి తదుపరి తిరుపతి బయలుదేరెను. తిరుపతి చేరగానే మధ్యాహ్నమైనది. ఆ సమయమందు వెంకటేశ్వరస్వామికి ప్రసాద నివేదనకై తెర అడ్డుగా ఉంచబడినది. త్యాగరాజ స్వామి వెంకటేశ్వరస్వామి దర్శనము ప్రాప్తించనందుకు చింతించినవాడై "తెర తీయగ రాదా" అను కీర్తనను గౌళీపంతు రాగంలో గానము చేయగా ప్రజలందరూ ఆశ్చర్యపోవులాగున తెర దానంతట అది తొలగిపోయెను. తిరుపతి నుండి ఘటికాచల క్షేత్రమునకు పోవుచు మార్గ మధ్యమున పుత్తూరునందు బస చేసెను. అచట శేషయ్య అనువతడు దేవాలయము తలుపులు మూసివుండగా లోపలికి గోడదాటు ప్రయత్నములో అతను బావిలో పడి మరణించెను. దైవ దర్శనమునకు పోయిన శేషయ్య ఈ విధముగా మరణించుటచే అతని భార్య మిక్కిలి దీనముగా రోదించసాగెను. ఆ సమయమునకు త్యాగరాజు

అటురాగా జరిగిన వృత్తాంతము విన్నవాడై "నా జీవధార" అను కృతిని బిలహరి రాగంలో గానం చేసి శేషయ్యకు జీవన ప్రదానము గావించమని భగవంతుని వేడుకొనెను. అంత నిద్రనుండి మేల్కొనిన రీతి శేషయ్య లేచి కూర్చొనెను. అట నుండి ఘటికాచల క్షేత్రమునకు వెళ్ళి నృసింహస్వామి దర్శనం చేసుకొని వానిపై కొన్ని కీర్తనలు జేసి అందున్న యోగాంజనేయ స్వామి దర్శనం చేసి వానిని అనేక విధముల స్తోత్రము చేసెను. ఘటికాచలము నుండి సుందర ముదలియార్ అభ్యర్థన మేరకు త్యాగరాజు చెన్నపట్టణం వచ్చి వాని అతిధిగా వారము దినములుండెను. అచట పార్థసారథి స్వామిని దర్శించి వారిని అనేక విధముల కీర్తించెను. తర్వాత చెన్నపట్టణమునకు దగ్గరగా నున్న తిరువత్తియ్యూరు, కోవూరు మొదలుగా గల క్షేత్రములను దర్శించి ఆయా దేవతలపై అపూర్వమైన పంచరత్న కీర్తనలు రచించెను కోవూరునుండి తిరువయ్యూరునకు తిరుగు ప్రయాణము చేయ సంకల్పించెను. అంత సుందరేశ మొదలియార్ శ్రీరామ కైంకర్యమునకై వేయి బంగారు నాణెములను ఒక సంచియందు భద్రపరిచి త్యాగరాజు పల్లకిలో నుంచెను. కోవూరు నుండి తిరువయ్యూరునకు నాగులాపురపు అడవులమీదుగా పోవలెను. వారు నాగులాపురము చేరినంతనే కొందరు దొంగలు వీరు ధనవంతులని భ్రమించి వారి మీద రాళ్ళు రువ్వసాగిరి. అంత శిష్యులు భయభ్రాంతులై త్యాగరాజునకు ఆ వృత్తాంతము చెప్పి సుందరేశ మొదలియారు రామ కైంకర్యమునకై ఇచ్చిన వెయ్యి బంగారు నాణెముల సంగతి కూడ చెప్పెను. అంత త్యాగరాజు శ్రీరాముడే తన ధనమును

కాపాడుకొనును. మనకు చింత ఏల? అని "రారా రఘువీర" అను అఠాణ రాగకృతిని, "ముందు-వెనుక" అను దర్బారు రాగ కృతిని గానము చేయగా రామలక్ష్మణులు ధనుర్ధారులై వచ్చి దొంగలను పారద్రోలిరి. అంత దొంగలు త్యాగరాజ స్వామి మహాత్మ్యమునకు అచ్చెరువొంది వానికి సాష్టాంగపడి ఆ వచ్చిన వారు రామలక్ష్మణులని ఎఱిగినవారై, ఆ చోరులు తదనంతరము మహా భక్తులుగా మారి త్యాగరాజు సేవ చేయ దొడంగిరి.

ఒకసారి త్యాగరాజు శ్రీరంగమునకు వెళ్ళినప్పుడు రంగనాథస్వామికి చైత్రోత్సవము జరుగుచున్నది. అది తిలకింప కోట్లాది ప్రజలు శ్రీరంగము వేంచేసి యుండిరి. జన సమ్మర్ధముచే త్యాగరాజుకు శ్రీరంగనాథుని దర్శనము లభించలేదు. అంత స్వామి దర్శనమునకై చింతించుచుండగా చైత్రోత్సవ రథము ఎంత ప్రయత్నించిననూ కదలదాయెను. ఎన్ని శాంతులు జేసిననూ, ఎన్ని లక్షలమంది లాగిననూ రథము ఒక్క అంగుళము కూడ కదలదాయెను. అంత జన సమూహము నందు ఒక భక్తునికి రంగనాథుడావహించి తన భక్తుడగు త్యాగరాజునకు దర్శనము లభింపకపోవుటచే రథము కదులుట లేదని చెప్పెను. అంత అర్చక బృందములు త్యాగరాజును వెతికి తీసుకువచ్చి శ్రీరంగనాథుని దర్శనము చేయించగా వెంటనే రథము కదిలెను. ఆ సందర్భములో శ్రీ త్యాగరాజ స్వామి అద్భుతమైన ఐదు పంచరత్న కీర్తనలతో శ్రీ రంగ నాథుని స్తోత్రము చేసెను.

త్రిభువనం స్వామినాథ గురుకుల్ అనునతడు ఆనంద భైరవి రాగమున మహత్తరమైన కృషిచేసి ఆ రాగమును

అద్భుతముగా గానము చేయుచుండెను. ఒకనాడు ఆయన తిరువయ్యూరు వచ్చి వీధినాటకము వేసి రంగస్థలమందు అద్భుతంగా ఆనందభైరవిని ఆలపించగా త్యాగరాజు అతనిని మిక్కిలి కొనియాడెను. అంత త్రిభువనం తన పేరు చిరస్థాయి చేసుకొనదలచి త్యాగరాజ స్వామిని ఒక అసాధారణమైన వరమడిగెను. అది ఏమన త్యాగరాజస్వామి నాటినుండి ఆనందభైరవి రాగమందు కీర్తనలను రచింపవలదని అభ్యర్థించెను. దాని అంతర్యమును గ్రహించినవాడై త్యాగరాజస్వామి అందుకు సంతోషముగా అంగీకరించెను.

వీరు నిరాడంబరులు. వినయశీలి, మృదుభాషి. సాధుస్వభావులు. శిష్యులకు పుత్రవాత్సల్యముతో విద్య గరపుటచే వీరికి చాలమంది శిష్యులు గలరు. అందు ప్రసిద్ధులు వీణ కుప్పయ్యర్, వాలాజీపేట వెంకటరమణ భాగవతార్, సుబ్బరాయ శాస్త్రి, మానాంబు చావడి వెంకట సుబ్బయ్యర్, వాలాజీపేట కృష్ణస్వామి భాగవతార్, ఉమయాల్‌పురం కృష్ణ భాగవతార్, సుందర భాగవతార్ సోదరులు, గోవింద శివన్, సభాపతి శివన్, తంజావూరు రామారావు, తిల్లస్థానం రామయ్యంగారు, కన్నయ్య భాగవతారు, ఆర్య భాగవతారు, వైక్కరపట్టి సుబ్బయ్యర్, నేమం సుబ్రహ్మణ్యయ్యర్, నాగవరం నీలకంఠ అయ్యర్, సుబ్బరాము భాగవతార్, గణేశయ్య, సోజిరి సీతారామయ్య కంజీర రాధా కృష్ణయ్య, సేవన వెంకటాచలపతి భాగవతార్, అమృతలింగం పిళ్ళే మొదలగువారు.

వీరు జీవితమంతయూ రామకథా గానమునకే వినియోగించిరి. ఐహిక భోగములను, సుఖములను తిరస్కరించిరి.

విరాగి. వీరి సాన్నిధ్యంలో ఉంటే మనకు శ్రీరామచంద్రుని సాక్షాత్కారం కలుగుతుంది. ఇట్టి మహానుభావుల చరిత్ర చెప్పే సావకాశం కల్గించి నన్ను ధన్యుణ్ణి చేసేరు.

గోపి : ఆహా! ఏమి నా భాగ్యము. త్యాగరాజ స్వామివారి చరిత్ర విన్న ఈ వీనులు, వారిని కన్న ఈ కన్నులు, వారితో సహచర్యము సలిపిన ఈ దేహము మిక్కలి పునీతమైనవి.

గురువు : అంత అందరూ కలిసి "ఎందరో మహానుభావులు" అన్న కృతిని పాడి నాటి సమావేశమును ముగించిరి.

శిష్యుడు : త్యాగరాజస్వామి వారి శేష జీవిత చరిత్రను తెలుప ప్రార్థన.

గురువు : త్యాగరాజ స్వామి ఇరువది నాలుగువేలకు పైగా కృతులు. కీర్తనలు, ప్రహ్లాద భక్తి విజయము, నౌకా చరిత్రము, సీతారామ విజయము అను గేయ నాటకములు రచించిరి. పరాభవ నామ సంవత్సర పుష్య శుక్ల దశమినాటి రాత్రి త్యాగరాజునకు స్వప్నమందు శ్రీరామ చంద్రుడు సాక్షాత్కరించి పది దినములలో తనయందైక్యము చేసుకొందునని చెప్పి అంతర్ధానమయ్యేను. అంత త్యాగరాజస్వామి మేల్కాంచి "గిరిపై నెల కొన్న" అను కృతిని పాడి శిష్యులందరినీ పుష్యబహుళ పంచమి నాడు అఖండ సంకీర్తన సలుపుడని ఆజ్ఞాపించెను. పుష్య బహుళ చతుర్థినాడు "పరమహంస పరివ్రాజ" కార్యవర్యుల వద్ద సన్యాస దీక్ష స్వీకరించి "నాద బ్రహ్మానంద" యను నామమును బొంది పుష్య బహుళ పంచమినాటి ఉదయమున "పరమాత్ముడు

వెలిగె" అను వాగధీశ్వరి యందలి కృతియు "పరితాపము" అను మనోహరి రాగమందలి కృతియు రచించి శిష్యుల రామ నామ సంకీర్తన ఘోష మిన్నంట, పద్మాసనస్థుడై బ్రహ్మ రంధ్రమును ఛేదించి ఆ దినమున ఉదయము పదకొండు గంట లకు బ్రహ్మైక్యము చెందెను.

తిరువయ్యూరులో వీరి సమాధివద్ద దేశ విదేశముల నుండి అనేకులగు కర్ణాటక సంగీత విద్వాంసులు పుష్య బహుళ పాడ్యమి నుండి వీరి కృతులు పాడి ఆరాధించెదరు. పంచమినాడు ఘన రాగ పంచరత్న కీర్తనలు మహా విద్వాంసులందరూ గూడి బృందగానము చేసి తన్మయులై జన్మ సాఫల్యత నొందెదరు.

వీరి పంచరత్న కీర్తనలపై అనేకులగు కవులు, గాయ కులు ప్రశంసాపూర్వకమైన భాష్యములు వ్రాసిరి. అందు శ్రీ కలవర్తి వెంకటేశ్వరరావుగారు పంచరత్న కీర్తనల పదజాలముతో రచించిన పద్య రత్నములు ఆ కీర్తన సువర్ణ సుమములకు పరిమళమొసగినట్లున్నవి.

1. "జగదానంద కారక"

సీ॥ సజ్జన మానస శరధి సుధాకర!
సురసారిపుకరార్త చరణకమల!
అవగుణ గణ రాక్షసాఖిల మదహర
ణా! సనాతన! ఈశ్వరాజ వినుత
పాదవిజితమౌని పటుశాప! పవపరి
పాలక! భూమిజా ప్రాణనాథ!

అగణిత గుణ గగనాధిప కులజాత
నిర్వికార కృపాబ్ధి నిగమసార!

తే॥ గీ॥ కనకచేల మహాపాప గజ నృసింహ!
అమరజనహిత! త్యాగరాజాది వినుత!
కదలిరా రమ్ము మము బ్రోవగా కృపార్ద్ర!
రాఘవా! రావదేల! శ్రీరామచంద్ర!

2 దుడుకుగల నన్నే దొరకొడుకు బ్రోచురా

సీ॥ పరధనమ్ముల గోరి కరగిపోవగ నోరుల్
పలికితి నిచ్చైకమ్ముగ లను సతము
సౌఖ్య జీవనమైనబ్బో! సర్వమ్ము భువినంచు
పొద్దులు పుచ్చితి ముష్కరముగ
నటవిట వనితాది నానావిధ క్షుద్ర
జన వశీకరణపై మనసు నిడితి.
నయనపర్వంబైన ప్రియసతీ సంతాన
ధన గృహ మోహ వర్తనుడనైతి.

తే॥ గీ॥ సతత మపరాధ జీవన చపలచిత్తు
దుర్మదాంధుల దగిలిన దురిత మతిని
ఏ దొరకొడుకు బ్రోచురా! ఆదరమున
అసుర మదహర! త్యాగరాజాప్త రామ!
రాఘవా! నీవు కాక శ్రీరామచంద్ర.

### 3 సాధించెనే మనసా.

సీ॥ సంగీతమునకు సత్సంప్రదాయకుడైన
గంగకు తండ్రి శ్రీరంగ శాయి.
చొక్కించి వనితల మ్రొక్కించు పరమాత్ము
డగు యశోద కుమారు డనగ నగుచు.
భక్తవత్సల గుణవారాశి యా జన్మ
మనఘుడు కలికల్మషార్తి హరుడు
సరసీరుహ దళాక్ష సర్వోన్నత అస
న్మకుట కుండలధరా: మనుచుమన్న

తే॥ గీ॥ అమరికగ నాదు పూజల నందుకొనుచు
దమశమాది సుఖోత్కర దాతయగుచు
త్యాగరాజార్చితుడు పమదుమ్మునకు తగు
మాటలాడెను దేవకీమాత సుతుడు.

### 4. కన కన రుచిరా.

సీ॥ కరముల నీవద కమల ద్వయమ్మును
భజియించు నంజనాభవుఢు సాక్షి
నగు మోముతో నోరయగ్గు చూపుతో నీదు
మోమ్ము జూచెడు భూమి పుత్రి సాక్షి
రామమన్త్రాద్వ్యక్షర రసపాయి పార్వతీ
పతియగు కైలాసవాసి సాక్షి
నారద శౌనక నగజ ధరాత్మజా
ప్రవిమల సద్భక్త వరులు సాక్షి

తే॥ గీ॥ బాలసూర్య ప్రభాచేల భాసమాన
మణి మయోజ్జ్వల మాలికాభ్యుదీ మయూఖ
కంధరుని : సౌమ్య దరహాసు, కనగ నిన్ను
రాక్షసాంతక శ్రీ త్యాగరాజ వినుత!
రాఘవా! నాదు కోర్కె శ్రీరామచంద్ర!

## 5 ఎందరో మహానుభావులు

సీ॥ స్వాంతమన్ వనచరు సంచారమును నిల్పి
మూర్తిని పొడగాంచు పుణ్యమతులు
పరమార్థ బుద్ధులై పతిత పావన నాము
తమ పాటలో పాడి తనియు ఘనులు
హరిగుణ మణులగు సరములు గళమున
శోభిల్లు విబుధ సుశ్లోక జనులు
సనక సనందన శశి విభాకర సుర
పరమేష్ఠి భాగ్యందు ధరులె గాక

తే॥ గీ॥ సకల శృతి, శాస్త్ర, గీతార్థసార నిధులు
షణ్మత నిగూఢ మర్మ విచారులౌ మ
హానుభావు లెందరో! వారలందరకును
రాఘవుల భక్తుడౌ త్యాగరాజ వరదు
దాసు లెల్లరి యడుగులు తాకి చేతు
వందనమ్ములు; సాష్టాంగ వందనములు.

శిష్యుడు : ఇట్టి మహనీయ చరిత్ర గల మహానుభావు లింకెవ
రైనా ఈ ఇరువదియవ శతాబ్దిలో నున్నారా?

గురువు : లేకేమి? ఎందరో మహానుభావులు ఈక్ష్మాతలమందు ధర్మ ప్రబోధము చేయుటకై అవతరించి యున్నారు. అందు నాదోపాసన, హరికథా గానముచే జీవన్ముక్తులైనవారు కీ. శే. ఆదిభట్ల నారాయణదాసు, ఇంద్రగంటి లక్ష్మీనారాయణ, చంబై వైద్యనాథ భాగవతార్ మొదలగువారలే గాకుండా అజ్ఞాతులైన మహనీయులెందరో గలరు. వారల చరిత్రల శ్రవణము అవశ్యము పుణ్యప్రదము.

శిష్యుడు : శ్రీ ఆదిభట్ల నారాయణదాసు, చంబై వైద్యనాథ భాగవతార్ గారల పుణ్య కథలను చదివి యున్నాము. శ్రీ ఇంద్రగంటి లక్ష్మీనారాయణగారి చరిత్ర విన కుతూహలము కల్గుచున్నది. దానిని మాకు వినిపింప ప్రార్థన.

# లక్ష్మీ నారాయణ చరిత్ర

గురువు : అవశ్యము. శ్రీ లక్ష్మీ నారాయణాయ నమః

శంకరాభరణ రాగము–ఆదితాళము (కీర్తన)

ప॥ శ్రీరామ జయరామ-సీతాపతే రామ–కారుణ్య గుణధామ–
రామ్–రామ్–రామ్–। సారసాక్షా కావరా ॥శ్రీ॥

చ 1 : వరభక్తులందరు వరుసతో నీ నామ స్మరణలు.
చేయుటెంతో
మేల్–మేల్–మేల్ । వారినందరి బ్రోవరా ॥శ్రీరామ॥

చ 2 : లక్ష్మీ నారాయణుని–రక్షణ సేయుటకు–పక్షివాహనమెక్కి
రా రా రా మోక్షదాయక రాఘవా ॥శ్రీరామ॥

అని పాడుచుంటే, గరుడా రూఢుడై ఆ శ్రీమన్నారాయణుడు వీరికి మోక్షధామ మొసంగెను. అదెట్లన:

పెనుగొల్లు అను గ్రామమందు పందొమ్మిదవ శతాబ్దపు ఉత్తరార్ధములో అనేకులగు మహనీయులు జన్మించి ఆ గ్రామమును పుణ్యక్షేత్రమొనరించిరి. ఆ గ్రామమునకు ఉత్తరమున వరహానది, దానిపై 500 మీటర్ల పొడవైన, దృఢమైన, సుందరమగు వంతెన, గ్రామమందలి విశాల సౌధములు, వంకరలు లేని రాజవీధి, ఆ గ్రామమునానుకొని యున్న పచ్చికబయళ్ళు, క్షేత్ర పాలకుడగు విశ్వేశ్వరస్వామి ఆలయము, ఆ గ్రామమునకు ప్రవేశమందు గల విశాల యశ్వత్థ వృక్షముతో అది యొక మహా సుందర ప్రదేశముగా కన్పట్టుచుండును.

ఈ ప్రాంతము పౌరాణికముగా ప్రసిద్ధమైనది. కౌరవులు గోగ్రహణమును ఈ గ్రామమునకు చేరువలో నున్న 'గోకుల పాడు' అను ప్రదేశమునుండి చేసిరనియు అది చూచిన గొల్లలు పెద్దగా గోల చేయుచూ బయల్వెడలుటచే ఈ గ్రామమునకు "పెనుగొల్లు" అను పేరు కల్గినదని చెప్పెదురు. మరికొద్ది దూరములో 'ఉప్పలము' అనుచోట బకాసురుని గుహ యున్నది. దాని సమీపములో చిన్న కొండపై భీముని గద యున్నది. ఆ ప్రదేశమందే భీముడు బకాసురుని సంహరించెనని చెప్పెదురు. దానికి చేరువలో "బసవపాడు" అను గ్రామముండెడిది. పాండవులు లాక్షా గృహమునుండి రహస్య మార్గమున బయటకు వచ్చి ఆ ప్రదేశమందు 'బస' చేయుటచే ఆ గ్రామము "బసవపాడు"గా ప్రసిద్ధి జెందినది.

ఇట్టి పురాణ ప్రశస్తి గల ప్రదేశమునకు పెనుగొల్లు కేంద్ర స్థానమై యున్నది. ఆ గ్రామము పలు సత్పురుషులకు ఆవాసమై ధర్మ ప్రబోధనా కేంద్రముగా విరాజిల్లెడిది. అందు "ప్రయాగ బ్రహ్మన్న" అను మహనీయుడు నిరతాన్నదాతగా కాశీ-రామేశ్వరముల మధ్య విశేషఖ్యాతి నార్జించెను. ఆ మార్గమందు ప్రయాణించు భిక్షవులు, యాత్రికులు వీరి ఆతిథ్యము స్వీకరించుచూ ఆ గ్రామమునకు ఎనలేని కీర్తిని కల్గజేసిరి. నిరంతరము వారి యింట వందకు పైగా యాత్రికులు వారి ఆతిథ్యము స్వీకరించెడివారు. ఆ గ్రామమందు మరియొక మహనీయుడు కోటమర్తి పెద వెంకటరమణ. వారి నివాసము సర్వకాల సర్వావస్థలయందు హరినామ సంకీర్తనలు, సంగీత కచేరీలు, పురాణ గోష్ఠులచే శోభిల్లెడిది. వీరి ఆస్థానము ఉద్దండులైన సంగీత విద్వాంసులగు "సంగమేశ్వర శాస్త్రి" "వీణ వేంకట రమణయ్య" "వడలి వేంకట నారాయణ" మొదలగువారి సంగీత కచేరీలతోను, ధూళిపాళ కృష్ణకవిగారి వంటి వాగ్గేయ కారుల కథాగానముతోను విరాజిల్లెడిది. మరియొక మహనీయుడగు ఇంద్రకంటి అప్పయ్యశాస్త్రి ఉచిత వైద్యసేవ చేయుచూ ఎనలేని ఖ్యాతినార్జించినాడు. వీరికి ఇరువురు కొమరులు ఒక పుత్రికయు కలిగిరి. కుమారులు వరహాలు, లక్ష్మీ నారాయణ. కుమార్తె జానకమ్మ, జానకమ్మ భర్తయే ఇదివరలో పేర్కొనిన పెద వేంకటరమణ. లక్ష్మీనారాయణ పసితనము నుండి భగవ ధ్యాన పరాయణుడై హరినామ సంకీర్తన చేయుచూ ఎల్ల వేళలా బావగారింటి వద్దనే (పెద వేంకటరమణ యింటనే) యుండి మహా సంగీత విద్వాంసులైన సంగమేశ్వర శాస్త్రిగారివద్ద సంగీతాభ్యాసము చేయుచుండెడివారు. అచిర కాలములోనే మంచి

వాగ్గేయకారుడుగాను, సంగీత విద్వాంసునిగాను ప్రజ్ఞ సంపాదించిరి. ఈయన లౌకిక వ్యవహారములయందు ఈషణ్మాత్రము శ్రద్ధ వహించక నిరంతర నాదోపాసనా తత్పరుడై ఆ గ్రామమందు మహా భక్తునిగా కీర్తినార్జించెను. వీరికి అన్నపూర్ణ యను కన్యనిచ్చి వివాహము చేసిరి. ఆమె భర్తకంటె మిన్నగా సంకీర్తనాదులొనరించుచూ జాగృతావస్థలో ఒక్క క్షణమైననూ వ్యర్థపరచకుండా రామభజన చేయుచుండెడిది. వీరుభయుల కలయికచే వీరి గృహము మిక్కిలి పావనమై, ప్రణవనాద స్వరూపుడైన-ఆ పరమాత్మునికి ప్రీతి పాత్రమైన ఆవాసముగా కొనియాడబడెడిది.

ఆ గ్రామమందు మరియొక మహానుభావుడు ఇంద్రకంటి రాంబాబు. ఈయన హరినామ సంకీర్తనతో ఏకాహ, సప్తాహ, సప్త-సప్తాహ దీక్షలను బూని, రామదాసుగా ప్రఖ్యాతి గాంచినాడు. వీరు లక్ష్మినారాయణ దంపతులయందు అమిత భక్తి భావముతో వారి యింట జరుగు కార్యము లన్నిటి యందు పాల్గొనుచుండెడివాడు. కొన్ని సందర్భముల యందు లక్ష్మి నారాయణ ఒడలు మరచి గానము చేయుచూ నృత్యము సలుపు చుండ "చైతన్య" ప్రభువుగా చూపరులకు గన్పట్టెడివాడు.

లక్ష్మి నారాయణకు ముగ్గురు పుత్రులు గలిగిరి. వారు సత్యనారాయణ, సీతారామశాస్త్రి, వేంకట లక్ష్మణశాస్త్రి. కనిష్ఠుడైన వేంకట లక్ష్మణశాస్త్రి గర్భమందుండగా, లక్ష్మి నారాయణ చేరువలో నున్న 'ఉప్మాక' క్షేత్రమునకు వెళ్ళి వేంకటేశ్వర స్వామి కళ్యాణమందు హరికథా గానము, సంకీర్తనాది కార్య

క్రమములు జరుపుచూ త్రిరాత్రి దీక్షతో ఆలయమందే యుండిరి. మూడవనాటి అర్ధరాత్రమున వేంకటేశ్వరస్వామి లక్ష్మీనారాయణ వీపుపై తట్టి మేల్కొలిపెను. సంభ్రమాశ్చర్యములతో లక్ష్మీ నారాయణ వేంకటేశ్వర స్వామికి సాష్టాంగమొనరించి "కమలా కుచ చూచుక కుంకుమతో నియతారుణితాతుల నీలతనో........" అని స్వామివారిని కీర్తించుచుండ, పుట్టబోవు బిడ్డడికి తన నామము జేర్చమని చెప్పి అదృశ్యుడయ్యెను. ఇంటికి వచ్చిన తోడనే వీపుపై తట్టిన హస్తపు గుర్తులు జూచి అన్నపూర్ణ ఆశ్చర్యము చెంది, వేంకటేశ్వర స్వామియొక్క దర్శనము లభించిన భర్తను మిగుల కొనియాడినది.

కొలది కాలమునకు అన్నపూర్ణకు ప్రసవవేదన కలిగి మగ బిడ్డడు జన్మించెను. కాని అన్నపూర్ణకు తెలివిరాలేదు. అంత లక్ష్మీనారాయణ సోదరియగు జానకమ్మకు వేంకటేశ్వరస్వామి ఆవహించగా, ఆమె ముమ్మారు ఆ బాలుని పేరు వేంకట లక్ష్మణ శాస్త్రిగా పేర్కొనిన వెంటనే అన్నపూర్ణకు తెలివివచ్చినది. ఆ బాలుని పరమ భక్తులైన ఆ దంపతులు కడు శ్రద్ధగా పెంచి సంగీత, సాహిత్యముల యందు ప్రజ్ఞావంతునిగా చేసి, అనేక సంగీత వాయిద్యముల వాదన యందు గూడ నిష్ణాతుని గావించిరి.

లక్ష్మీ నారాయణ కడు బీదవాడు. జీవనభృతికై ప్రాథమిక పాఠశాలోపాధ్యాయుని పదవిని, త్యజించి పోస్టు మాస్టరు పదవిని చేపట్టినాడు. లౌకిక ధర్మముగా ఉద్యోగములు చేయుచున్నను, సర్వకాల సర్వావస్థలయందు దైవచింతనాసక్తుడై

యుండెడివాడు. ధర్మవర్తనుడగుటచే జీవితములో అనేకము లగు ఉపద్రవములను ఎదుర్కొనవలసి వచ్చెను.

ఒకనాడు పోస్టులో నాలుగువేల రూపాయల ఇన్స్యూరెన్సు కవరు పంపబడుచున్నట్లు ఒక వర్తకునికి లేఖ వచ్చినది. అయితే వీరి ఇల్లు ఒక దేవాలయము. అందు ప్రవేశమునకు ఎట్టి నిరోధములు లేవు. ఆ గ్రామమందు కామందుల బిడ్డడొకడు దుర్వ్యసనములకు లోనై, జార చోరాది అకృత్యములు సల్పుచుండెడివాడు, వాడు ఇన్స్యూరెన్సు కవరుయొక్క వృత్తాంతమును పసిగట్టినవాడై దానిని తస్కరింప బూనినాడు. మరునాడు ఇన్స్యూరెన్సు కవరు వచ్చినది. ఆ కామందుల బిడ్డడు నేర్పుతో ఆ కవరును అపహరించినాడు.

పాఠశాలనుండి తిరిగి వచ్చిన లక్ష్మీనారాయణ పోస్టల్ సంచిని చూడగానే అది తెరువబడ్డట్లు గ్రహించినవాడై వెంటనే గ్రామకర్ణము, మునసబులకు కబురంపి వారి సమక్షములో ఆ పోస్టల్ సంచి యందలి వస్తువులను తనిఖీ చేయుచుండగా అందుండి నాల్గువేల రూపాయిల ఇన్స్యూరెన్స్ కవరు దొంగలింపబడినట్లు గుర్తించెను. కర్ణము, మునసబుల సాక్ష్యముతో పోలీసువారికి ఫిర్యాదు చేసెను. పోలీసువారు వచ్చి విచారింపగా వారికి దొంగయొక్క ఆచూకీ తెలిసినది దొంగ గొప్పయింటివారి బిడ్డ డగుటచే పోలీసువారిని వశపరచుకొనెను. అంత పోలీసువారు నేరస్థుని జాడ తెలియనట్లు మిన్నకుండిరి.

ఈలోగా పోస్టల్ అధికారులు కూడ ఎంక్వైయిరీకి వచ్చిరి. కొద్ది రోజులలోనే నేరస్థుని జాడ పసిగట్టిరి. కాని వారికి పోలీసు

శాఖవారినుండి సహకారము లభింపలేదు. అందుచే గత్యంతరము లేక, లక్ష్మీ నారాయణ నిరపరాధి యని రూఢిగా తెలియుచున్ననూ, ఎనిమిదవ రోజు ఉదయమున 8 గంటలకు లక్ష్మీ నారాయణను పోలీసుశాఖవారికి అప్పగించవలసియుండెను.

లక్ష్మీనారాయణ దంపతులు ఈ అవమానమును సహింపలేరైరి. ఏడవరోజు రాత్రి వారు దైవ సాన్నిధ్యమందు దీనులై ఆ భగవంతుని ప్రార్థించుచూ ఈ క్రింది విధముగా పాడి పాడి నిదురించిరి.

ప॥ రక్షించే దొరవని నమ్మితి—నన్ను శిక్షింపగ తప్పేమి
జేసితిని ॥

అ॥ ప॥ రక్షింప మీకంటె రక్షకులెవరున్నారు—దాక్షిణ్యమింతైన
తలపున నుంచవు ॥

చ॥ 1 నీ ప్రాపు నెరనమ్మి యుంటిని నన్ను—కాపాడు బిరుదు
నీదంటిని రామా।

నన్ను చేపట్టి విడనాడ జెల్లదు యిక—నాకు దాపున
నుండెడి దైవము సాక్షిగ ॥

చ॥ 2 ఎంతో వేడిన యేల పల్కవు—నేనెంత ద్రోహినో
దయజూడవు రామా।

ఎంతేసివారల నేలేటి కర్తవు—అంతకంతకు నాపై
యరమర జేసేవు ॥

చ॥ 3 భద్రాద్రివాస నీ బంటును—నితర పాపము లేదు
నా వెంటను రామా।

అద్విజసన్నుత అమరాది వందిత భద్రేభవరద
నా పాలిటి దైవమా ॥

అంత దీన పోషకుడగు ఆ శ్రీమన్నారాయణుడు నేరస్థుని యజమానికి స్వప్నమందగపడి, నేరమంగీకరించి అపహరించిన సొమ్మును మరుచటి దినమున 8 గంటల లోగా వాపసు చేయనిచో వాని కుటుంబము సర్వనాశనము అగునని హెచ్చరించి అదృశ్యుడయ్యెను. ఆ పురవాసులందరికి లక్ష్మీ నారాయణ యొక్క నిశ్చలభక్తి, నిర్మల జీవితము తెలుసును.

భూకామందు సంశయములో పడెను. నేరమంగీకరించుటకు స్వాభిమానము ఒప్పుకొనుటలేదు. భగవంతుని హెచ్చరికను పాటించకపోతే సర్వనాశన మగునేమోనన్న భయము కూడా కలుగుచుండెను. అంత మధ్యే మార్గముగ ఆ అర్ధ రాత్రమున ఉత్తరములు తపాలా పెట్టెలో వేయుటకై వచ్చినట్లు వచ్చి ప్రక్కన నిదురించుచున్న పోస్టలు శాఖవారికి అనుమానము కలుగకుండ, రహస్యముగా తపాలాపెట్టెలో నాల్గువేల రూపాయిలు బడవైచి వెళ్ళిపోయెను.

ఎనిమిదవ రోజు ప్రాతః కాలముననే లక్ష్మీ నారాయణ దంపతులు మేల్కాంచి యథావిధిగ దైనందిన పూజాధికములు ముగించుకొని రాబోవు దారుణ పరిణామముల నూహించుకొని ఖిన్న వదనులై నిర్ణీత సమయమునకై నిరీక్షించు చుండిరి. ఈలోగా పోస్టలు అధికారులు వీరిని జూచి మిక్కిలి జాలినొంది ఏమియు చేయలేకుండిరి. ఏడుగంటలు కావచ్చినది. పోలీసు

శాఖవారికి కబురంపిరి. ఈలోగా తపాలాపెట్టె తెరిచి అందలి ఉత్తరములు తీసుకొని ఆ రోజు పంపవలసిన పోస్టలు సంచిని సీలుచేసి బయటకు పంపు కార్యక్రమమును చేపట్టిరి.

పోస్టలు ఇన్‌స్పెక్టరు చూచుచుండగా, అచటి పోస్టుమేన్ తపాలాపెట్టి తెరువగా అందరి కనులు మిరిమిట్లు గొలుప అందుండి నాలుగువేల రూపాయల నోట్ల కట్ట క్రిందబడినది. పరమాశ్చర్యములతో ఇన్‌స్పెక్టరు ఆ సొమ్ము లెక్కింపగా సరిగా నాలుగువేలు మాత్రమే యున్నది. అంత ఆనంద పారవశ్యముతో ఆ ఇన్‌స్పెక్టరు వచ్చి లక్ష్మీనారాయణను కౌగలించుకొనగ, లక్ష్మీనారాయణ ఆనందము పట్టలేక ఈ క్రింది త్యాగరాజ కీర్తనము తన్మయత్వముతో పాడ దొడగెను :

ప॥ నను పాలింప నడచి వచ్చితివో! నా ప్రాణనాథ!

అ॥ ప॥ వనజనయన నీమోమును జూచుటె జీవనమని నెనరున
మనసు మర్మము తెలిసి ॥నను॥

చ : సురపతి నీలమణి నిభ తనువుతో-ఉరమున ముత్యపు
సరలు చయముతో
కరమున శరకోదండ కాంతితో-ధరణీ తనయతో
త్యాగరాజార్చిత ॥నను॥

అంత, వచ్చిన పోలీసు శాఖవారికి విషయము లన్నియూ తెలియజేసి, ఆ నాల్గువేల రూపాయలు, ఇన్‌స్యూరెన్స్ ఖాతాకి జమకట్టించి, లక్ష్మీనారాయణపై పెట్టవలసిన కేసును ఉపసంహరించుకొనిరి.

ఆ వచ్చిన పోస్టల్ ఇన్‌స్పెక్టరు పేరు శ్రీనివాస అయ్యంగార్. అంత లక్ష్మీ నారాయణ దంపతులు ఆ శ్రీనివాసుడే ఈ పోస్టలు ఇన్‌స్పెక్టరుగా వచ్చి తమను రక్షించినట్లు గ్రహించినవారై భక్తులయందున్న ఆ భగవంతుని ప్రేమను మిక్కిలి కొనియాడిరి. ఆ భూకామందు భగవంతుని ఆజ్ఞానుసారము నేరము బహిర్గతము చేయకపోవుటచే అనతికాలములోనే వారు ఆ గ్రామము విడిచిపెట్టి వెళ్ళిపోవలసి వచ్చి నామ రూపములు లేక నశించిరి.

శ్లో॥ పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం।
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే॥

మరియొక సందర్భమున లక్ష్మీ నారాయణ ఎలమంచిలి వబ్ పోస్టాఫీసు నుండి మణియార్డర్ల బట్వాడాకై పెద్ద మొత్తములో డబ్బును స్వయముగా వెళ్ళి తీసుకురావలసి వచ్చెను. ఎలమంచిలి పెనుగొల్లుకు 12 కి॥ మీ॥ దూరములో నున్నది. ఆ రోజులలో రవాణా సౌకర్యములు చాల తక్కువ. వీరు సొమ్ము తీసుకొనునప్పటికి సూర్యాస్తమయమగుటచే వాహన సౌకర్యములేమీ లేవు. అందుచే అంత పెద్ద మొత్తంతో కాలి నడకను వెళ్ళవలసిన అగత్యమేర్పడినది. వీరు పోస్టాఫీసులో ధనము లెక్కించుచుండగా ఇద్దరు దొంగలు చూచి వీరి పోకడలను గమనించుచుండిరి. వీరు ఒంటరిగా ఆ సొమ్ముతో కాలి నడకను ప్రయాణించుట చూచి వారు మనస్సులో ఆనందించి వీరిని వెంబడించసాగిరి. వారు దృఢకాయులు. చేతిలో లాఠీలు ధరించిరి. లక్ష్మీ నారాయణ బక్కపలుచగాను, పొట్టిగాను

ఉండి బలహీనుడగుటచే ఆ దొంగలు వీరిని మార్గ మధ్యమందు నిర్జన ప్రదేశములో అడ్డగించి ఆ ధనమును బలాత్కారముగా అపహరించవలెనని తలపోసిరి. లక్ష్మీ నారాయణ దొంగలు తనను వెంబడించి వచ్చుటను గమనించి ఆందోళన చెందెను. కాని ఎట్టి పరిస్థితిలోనైనా ఆ రాత్రికి తాను ఇంటికి చేరుకొన వలెను. ఏలనన వాని భార్యకు పురిటిరోజులు. ఏ సమయ మందైనను ఆమె ప్రసవించవచ్చు. గత్యంతరము లేక వడిగా నడచుచూ "ముందు వెనుక ఇరుప్రక్కల తోడై–మురఖర హర రారా" అను త్యాగరాజ కృతిని పాడుకుంటూ ముందుకు సాగిపో జొచ్చెను. విచిత్రముగా దొంగలు ఎంత ప్రయత్నించిననూ వీరి దగ్గరకు రాజాలరైరి. వారిమధ్య దూరము ఎల్లప్పుడు సుమారు 15 మీటర్లుగానే ఉంటూ వచ్చెను. వారు వీరిని సమీపింప లేకపోవుటచే ఎలుగెత్తి "ఓ పొట్టి బావడా! కొంచెం ఆగు! నీకు సహాయముగా మేము వస్తున్నాము. భయపడవద్దు" అని అరవసాగిరి. కాని వారి కేకలు లక్ష్మీ నారాయణ చెవుల నోకుట లేదు. ధైర్యముగా ముందుకు సాగిపోజొచ్చెను. దొంగ లకు ఏమి చేయుటకును పాలుపోవుట లేదు. వారు ఒక్క దూకు డులో పరుగెత్తి లక్ష్మీ నారాయణను పట్టుకొనుటకై ప్రయ త్నించగా వాళ్ళ కట్టులు ఒకళ్ళ కాళ్ళలో మరియొకరికి అడ్డు తగిలి బోర్లాపడిరి. ఆ జోరుకు వారికి తీవ్రమైన గాయములు తగిలి మరి ముందుకు అడుగు వేయలేకపోయిరి.

లక్ష్మీ నారాయణ ఈ సన్నివేశమును చూచి ఆ భగవం తుని అనేక విధముల ప్రార్థించి సురక్షితముగా ఇల్లు చేరు కొనెను. ఆ మరునాడు తీవ్రమయిన గాయములతో ఆద్రాగలుం

లక్ష్మీ నారాయణ ఇంటికి వచ్చి వాని కాళ్ళపై బడి క్షమాపణ వేడుకొనిరి. అంత వారికి భక్తిమార్గమునకు, ధర్మ వర్తనము నకు మించినదేదీ లేదని చెప్పి రామనామము వారిచే పదిసార్లు చెప్పించి పంపివైచెను.

ఒకనాడు లక్ష్మీ నారాయణ పనిమీద గ్రామాంతరము వెళ్ళవలసి వచ్చెను. వారి ధర్మపత్ని ఒక్కరే ఇంటియందుం డెను. రాత్రి భోజనానంతరము అలవాటు ప్రకారము హరినామ సంకీర్తన చేయ దొడంగెను. క్రమముగా ఆమె చైతన్య రహితయై నాదోపాసనచే ఒడలు మరచి రాగాలాపన చేయుచూ ప్రణవనాద పూరితమైన వాతావరణమందు సమయమును గమ నింపకుండెను. ఇది ఇట్లుండ ఇద్దరు దొంగలు ఈమె ఒంటరిగా నున్న సంగతి తెలిసినవారై ఆ రాత్రి పోస్టాఫీసు నందలి ధన మును అపహరింప సంకల్పించిరి. అదనుకై పరిసర ప్రాం తములందు పొంచియుండిరి. ఆమె ఇనుమంతయైన ప్రయాస లేకుండా అమితోత్సాహముతో గానము చేయుచుండెను. అర్ధ రాత్రి 12 గంటలు దాటినది ఆమె పాడుచునేయున్నది. రాత్రి ఒంటిగంట కూడ దాటినది. ఆమె గానము చేయుచునే యున్నది. ఈమె గానమును ముగించి నిద్రించినగాని దొంగలకు సావ కాశము లభింపదు. అందుచే వారు ఆ అదనుకై వేచి వేచి చివరికి విసిగి ఆ ప్రయత్నము నుండి విరమించి ప్రక్కనున్న మరియొక గ్రామంలోని ఐశ్వర్యవంతుని ఇంట్లో ప్రవేశించి అనేక అమూల్య ఆభరణములను, ధనమును దొంగలించిరి. కాని మరునాడు వారు పోలీసులకు పట్టుబడిరి. కోర్టులో వారు విఫలమయిన తమ ప్రధమ ప్రయత్నము గురించి చెప్పగా

పోలీసువారు ఎంక్వయిరి చేసి అందలి నిజమును గుర్తించి లక్ష్మీ నారాయణ ధర్మపత్నిని, ఆమె భక్తిని బహుధా ప్రశంసించిరి.

తుమరాడ సంగమేశ్వర శాస్త్రి, దూళిపాళి కృష్ణకవి వంటి మహానుభావుల నుంచి ఆర్జించిన విజ్ఞానముచే లక్ష్మీనారాయణ అనేక భజన కీర్తనలను, అంబరీషోపాఖ్యానము, ఏకాదశీ వ్రత మహత్యము అను హరికథలను వ్రాసిరి. వీరి భక్తి ప్రభావము ఆ గ్రామవాసు లందరిమీద ప్రసారించి అది యొక ఆదర్శ గ్రామముగా ఖ్యాతి నొందినది.

వీరి పెద్ద కుమారుడు సత్యనారాయణ గూడ తండ్రిగారి వద్ద సంగీతము కవిత్వము నేర్చుకొని అనేక గీత రచనలు చేసెను. వీరికి అనేకమంది శిష్యులు గలరు. అందు ప్రముఖులు ఇంద్రకంటి రామచంద్రమూర్తి, కొట్రు మహదేవ శర్మ, రాయ ప్రోలు మహదేవుడు మొదలగువారు. నేడు సాంఘికముగా ప్రముఖమైన పాత్రలను నిర్వహించుచున్నారు.

వీరి కనిష్ఠ పుత్రుడు వేంకట లక్ష్మణశాస్త్రి వేంకటేశ్వర వర ప్రసాది. చిన్ననాటి నుండియు తల్లి దండ్రుల అడుగు జాడలలో నడచుచూ మహాభక్తుడై అనేక సంగీత వాయిద్యముల యందు ప్రజ్ఞ సంపాదించెను. గాత్రము తండ్రిగారి వద్దను, మృదంగము ముళ్ళపూడి లక్ష్మణరావుగారి వద్దను, వేణుగానము స్వీయప్రతిభ చేతను అభ్యసించినవాడై మంచి సంగీతజ్ఞుడిగా అచిరకాలములోనే ఖ్యాతినొందెను. లక్ష్మీ నారాయణ పుత్రులు

ఆ గ్రామవాసులు కలసి భజన చేయు సమయమందు ప్రణవ నాద పూరితమగు ఆ ప్రదేశము రోమాంచము కలుగచేయు చుండెడిది. కొన్ని సందర్భముల యందు లక్ష్మీ నారాయణ ధర్మపత్నికి వేంకటేశ్వరుడావహించుట జరుగుచుండెడిది. అట్టి సమయమందు ఆమెను స్నానమాడించి అరచేతి యందు కర్పూరహారతి వెలిగించగా ఆమె జ్వలించు ఆ కర్పూరమును మ్రింగి భక్తుల ప్రశ్నలకు సమాధానము లొసగెడివారు. అది యొక దివ్యమైన అనుభూతి.

ఉద్యోగ ధర్మము మీద లక్ష్మణశాస్త్రి తన పందొమ్మిదవ ఏట కలకత్తా వెళ్ళిరి. అచట తన నిస్వార్థ సంఘసేవచే స్థాని కుల అభిమానము చూరగొనినవారై అనేకములైన సాంస్కృ తిక, సాంఘిక కార్యక్రమములను నిర్వహించుచూ అచిరకాలము లోనే అచటివారికి అభిమానపాత్రులైరి. వీరి కీర్తి విని లక్ష్మీ నారాయణ కలకత్తా వెళ్ళి, తనయుని నిస్వార్థసేవకు ముగ్ధుడై, సరస్వతీదేవి త్వరలో వానిని కటాక్షించునని ఆశీర్వదించిరి.

అనతి కాలములో స్వప్నమందు సరస్వతీదేవి సాక్షాత్క రించి లక్ష్మణశాస్త్రికి అనేక రాగములు, కీర్తనలు బోధింపసాగెను. స్వప్నమందు లభించిన సంగీత సంపద మనస్సునందు హత్తు కొని దానిని మహా విద్వాంసుల యెదుట ప్రదర్శింప తనకు లభించిన విజ్ఞానము అత్యున్నతమైనదని ఆ విద్వాంసులు శ్లాఘించిరి. అప్పటినుండి వేంకట లక్ష్మణశాస్త్రి సరస్వతీదేవి అనుగ్రహం వల్ల లభించిన సంగీత సంపదను ఉచితముగా

ప్రతిభావంతులకు దానము చేయుచూ ప్రతి వత్సరము సరస్వతీ దేవి పూజను కడు శ్రద్ధాసక్తులతో జరుపుచుండిరి.

హేవిళంబి నామసంవత్సర (1957) వైశాఖ శుద్ధ షష్ఠి దినమున ఒక అద్భుత సంఘటన జరిగెను. ఆ దినమున ఉదయం పదిగంటలకు లక్ష్మీనారాయణ తాను రచించిన "శ్రీరామ జయరామ సీతాపతే రామ" అన్న కీర్తనను బాడుచు "లక్ష్మీ నారాయణుని–రక్షణ చేయుటకు పక్షివాహనమెక్కి – రా–రా–రా" అని ఎలుగెత్తి ఆ దైవమును ప్రార్థించి పరుండెను. అంత వారి ఇంటి ముంగిట గరుడుడు (బొల్లి గెద్ద) వచ్చి నిలబడెను. వెంటనే లక్ష్మీనారాయణ దేహమునుండి ఒక వెలుగు బహిర్గతమై ఆ పక్షిరాజమును చేరినది. లక్ష్మీనారాయణ విగతజీవుడాయెను. వీరి భౌతిక కాయమును రామనామ సంకీర్తనము మిన్నంట, స్మశానమునకు గొంపోవుచుండ లక్ష్మీ నారాయణుని ఆత్మను గొనిపోనేతెంచిన గరుడుడు కూడ ఆ భౌతికకాయము వెంట జని ఆ అవశేషములన్నియూ పంచభూతములయందు కలియునంత వరకూ వేచియుండి అంతర్ధానమందెను.

ఈ విచిత్ర సన్నివేశమును తిలకించిన ఆ పుర ప్రజలు లక్ష్మీనారాయణకు అంజలులు ఘటించి వారు గానము చేసిన విధముగా "లక్ష్మీ నారాయణుని–రక్షణ సేయుటకు పక్షి వాహన మెక్కి" ఆ వేంకటేశ్వరస్వామి స్వయముగా వచ్చినట్లు గ్రహించినవారై తన్మయత్వముతో ఆ మహాభక్తుని చే రచింపబడ్డ కీర్తనలు బాడి తరించిరి.

ఈ విధముగా రామభక్తి సామ్రాజ్య వ్యవస్థాపకుడైన ఆంజనేయస్వామితో బాటు అందు వెలుగొందిన భక్తశిఖామణులగు తులసీదాస్, సమర్ధ రామదాస్, కబీర్ దాస్, భద్రాచల రామ దాస్, త్యాగరాజు, శ్యామశాస్త్రి, దీక్షితార్, లక్ష్మీ నారాయణార్యు లను మనసా సందర్శించి అత్యంత బ్రహ్మానందము బొందితిమి.

శిష్యులందరూ :- ఇలాగని ఈ స్థితిని వివరింపలేము. ఇది స్వానుభవైకవేద్యమే. ఈ మహనీయుల చరిత్ర శ్రవణముచే మా జన్మలు తరించినవి. సంగీత జ్ఞానము భక్తివినా సన్మార్గము గలదే అని త్యాగరాజస్వామివారు సెలవిచ్చిరి. ఈ గ్రంథ పఠనము గావించినవారికి ఆ హనుమత్ప్రభువుల కటాక్షము నిస్సంశయముగా లభించును.

శ్లో॥ మంగళం కోసలేంద్రాయ మహనీయ గుణాత్మనే।
చక్రవర్తి తనూజాయ సార్వభౌమాయ మంగళం॥

— ( ౦ ) —

# వంశ వృక్షము

ఇంద్రకంటి లక్ష్మీ నారాయణ (1881 – 1957) రచయిత, హరికథకుడు (ముగ్గురు పుత్రులు)

- సత్యనారాయణ (1908) రచయిత, హరికథకుడు. (ముగ్గురు పుత్రికలు)
  - మంగతాయారు (ముగ్గురు పుత్రికలు ఒక పుత్రుడు)
  - అన్నపూర్ణ (ఇద్దరు పుత్రికలు) ఒక పుత్రుడు)
  - భ్రమరాంబ (ఒక పుత్రిక)
- సీతారామశాస్త్రి (1923) ఒక పుత్రుడు
  - లక్ష్మీ నారాయణమూర్తి (ఇంజనీరు) (పుత్రుడు/పుత్రిక)
- వేంకట లక్ష్మణశాస్త్రి (1927) గాత్రం, ఫ్లూట్, మృదంగం, కంజిరా (నలుగురు పుత్రికలు – ఒక పుత్రుడు
  - అన్నపూర్ణ (ఒక పుత్రుడు) వయొలిన్ డిప్లమో
    - శ్రీనివాస్ (Vocal & Acting)
  - లక్ష్మి (ఒక పుత్రిక) వీణ, గాత్రం డిప్లమో, కేంద్రీయ విద్యాలయం మ్యూజిక్ టీచర్
    - పల్లవి గాత్రం
  - కాశీప్రసాద్ (ఇద్దరు ఆడపిల్లలు) ఫ్లూట్–A I R ఆర్టిస్టు రైల్వేలో Cultural– quota లో Hd. Clerk
    - కాత్యాయిని (గాత్రం)
    - దుర్గాప్రియదర్శిని (గాత్రం)
  - సరస్వతి (MA Music) (ఒక పుత్రిక) రేడియో ఆర్టిస్టు A గ్రేడ్ A.U.Music Lecturer
    - అహరి గాత్రం–ఫిడేలు Child–Prodigy– చాలా National awards
  - శారద (M A. Music రేడియో B హైగ్రేడ్ ఆర్టి[illegible] చాలా National awards (unmarried yet)